


మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162

GSTIN 37AMRPM5719R1ZX


## సీఎం చంద్రబాబు రైతులకు క్షమాపణ చెప్పాలి..






ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ , ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | సంచిక : 165 | ఆదివారం 21 - 06 -2026 | పేజీలు : 12 | వెల-3 | No: KNL/3-77(D)/2026-2028



# దేశానికి ఆధ్యాత్మిక హబ్‌గా ఆంధ్రప్రదేశ్

- యోగాకు గుర్తింపు తెచ్చిన ఆధ్యాత్మిక వేత్త బాబా రాందేవ్
- ఉండవల్లి గుహల వద్ద అంతర్జాతీయ యోగా నిర్వహణ
- బాబాతో కలసి ఆసనాలు వేసిన చంద్రబాబు
- చంద్రబాబు విజనరీ నేత అన్న బాబా రాందేవ్



దేశానికి ఆధ్యాత్మిక హబ్‌గా ఆంధ్రప్రదేశ్ మారనుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని రాజధాని అమరావతిలోని ఉండవల్లి గుహల వద్ద యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. రాందేవ్ బాబా శిక్షణలో జరుగుతున్న యోగా సాధనను తిలకించారు. ఈ సందర్భంగా వివిధ రకాల యోగా ప్రక్రియలను రాందేవ్ బాబా సీఎంకు వివరించారు. బాబారామ్‌దేవ్‌తో కలిసి సీఎం యోగా సాధన చేశారు. రామ్‌దేవ్ శిక్షణలో జరుగుతున్న యోగా సాధనను తిలకించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. యోగాకు.. రాందేవ్ బాబా మంచి గుర్తింపు తీసుకొచ్చారన్నారు. యోగా సాధనతో ఆయన అద్భుతాలు సృష్టిస్తున్నారని కొనియాడారు. ఆయన శిక్షణలో యువత యోగాసనాలు అద్భుతంగా ఉన్నాయన్నారు. ప్రస్తుతం సమాజంలో యువత చాలా ఒత్తిడితో ఉందన్న సీఎం.. ఆధ్యాత్మికతతో కూడిన సాంకేతికత చాలా







# ఒడిషాలో 47వేల కోట్లతో అభివృద్ధి పనులు

- రెండేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా మోడీ ప్రకటన
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కలసి ప్రారంభించిన ప్రధాని
- ముర్ము స్వగ్రామం పహాడ్‌పూర్‌ను సందర్శించిన మోడీ
- అభివృద్ధి చేసి సోలార్ విలేజ్‌గా మారుస్తామని ప్రకటన



## కర్నూలు ఆర్డీఓ ఆఫీస్ ముందు బాధితురాలి నిరసన:

## "పది నెలల వేధింపులకు చరమగీతం పాడాలి!"

- గార్గేయపురం భూ వివాదంలో విచారణ పూర్తి
- తుది ఉత్తర్వులు జారీ చేసిన రెవెన్యూ యంత్రాంగం
- ఫోర్జరీ ఆరోపణలు నిరూపించలేకపోయిన పిటిషనర్ బైరెడ్డి హరిత..
- రికార్డుల ఆధారంగా 'వెబ్ ల్యాండ్' లో గొల్ల లక్ష్మీనారాయణ పేరే ఖరారు
- తప్పుడు ప్రచారాలు నమ్మవద్దని అధికారుల స్పష్టీకరణ



**నంది పత్రిక కర్నూలు బ్యూరో కర్నూలు** రెవెన్యూ డివిజనల్ కార్యాలయం (ఆర్డీఓ) వేదికగా గత కొంతకాలంగా సాగుతున్న గార్గేయపురం భూ వివాదం శనివారంతో ఒక కొలిక్కి వచ్చింది. న్యాయం కోసం పది నెలలుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నానంటూ, శనివారం ఉదయం 11:30 గంటల నుండి సాయంత్రం వరకు వేచి చూసిన పిటిషనర్ బైరెడ్డి హరిత ఆర్డీఓ కార్యాలయం వద్ద తీవ్ర నిరసన వ్యక్తం చేశారు.

## ఢిల్లీలో అవార్డు అందుకున్న ఏపీ పోలీసులు..

- పాస్‌పోర్ట్ దరఖాస్తుల వెరిఫికేషన్‌లో ఏపీ పోలీసులకు జాతీయ అవార్డు
- 2025 సంవత్సరానికి గాను 'ఇన్‌స్టిట్యూషనల్ పెర్ఫార్మెన్స్' పురస్కారం
- డీజీపీ తరఫున అవార్డును అందుకున్న ఇంటెలిజెన్స్ ఎస్పీ ఎ. రమాదేవి



# క్రిమినల్స్‌కు కులం లేదు..

# వైసీపీ గూండాలను తొక్కి నార తీస్తా:

- క్రిమినల్‌కు కులం, మతం, ప్రాంతం ఉండవని స్పష్టం చేసిన పవన్
- వైసీపీ రౌడీ మూకలు, గుండాల పిచ్చి వేషాలు తమ వద్ద చెల్లవని తీవ్ర హెచ్చరిక
- శాంతిభద్రతల విషయంలో పోలీసుల విధుల్లో జోక్యం చేసుకోనని హామీ
- తప్పుడు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను ఉపేక్షించవద్దని అధికారులకు సూచన
- నేరాలకు వ్యతిరేకంగా పౌరులు ఏకమై పోరాడాలని పిలుపునిచ్చిన డిప్యూటీ సీఎం



# అన్నదాత సుఖీభవ నిధుల విడుదల



- ఏటా రూ.20 వేలు ఇస్తామన్న హామీ నిలబెట్టుకున్నాం
- రైతులు బాగుంటేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బాగుంటుంది
- 48 గంటల్లో ధాన్యం కొనుగోలు మొత్తాన్ని జమచేస్తున్నాం
- రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మళ్లాలి
- ఆంధ్రాను మించి తెలంగాణ ధాన్యం పండిస్తోంది
- వైకాపా హయాంలో రైతులు నానా కష్టాలు పడ్డారు
- లింగగుట్లో అన్నదాత సుఖీభవ నిధులు విడుదల
- రైతులకు అండగా ఉంటామని ప్రకటించిన చంద్రబాబు

# కర్నూలు ఆర్డీఓ ఆఫీస్ ముందు బాధితురాలి నిరసన: "పది నెలల వేధింపులకు చరమగీతం పాడాలి!"




మహిళనని కూడా చూడకుండా గంటల తరబడి నిరీక్షించేలా చేయడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ముఖ్యమంత్రి మరియు జిల్లా కలెక్టర్ స్పందించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

**అసలు వివాదం ఏమిటి?** కర్నూలు రూరల్ మండలం గార్గేయపురం గ్రామానికి చెందిన సర్వే నంబర్ 619/3లోని 1.63 ఎకరాల భూమిపై గత కొంతకాలంగా వివాదం నడుస్తోంది. తన భర్త మరణాన్ని ఆసరాగా చేసుకుని కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు, దొంగ పాసుపుస్తకాలు, ఫోర్జరీ రికార్డులు సృష్టించారని బైరెడ్డి హరిత ఆరోపించారు. తహసీల్దార్ కార్యాలయం నుండి తనకు అనుకూలంగా నివేదిక వచ్చినప్పటికీ, ఆర్డీఓ కార్యాలయంలో కేసును పదేపదే వాయిదా వేస్తూ కాలయాపన చేస్తున్నారని ఆమె ధ్వజమెత్తారు.

**అధికారుల సమగ్ర విచారణ రికార్డుల పరిశీలన:** ఈ వ్యవహారానికి సంబంధించి శనివారం (20.06.2026) కర్నూలు రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో తుది నోటీసుల ఆధారంగా సుదీర్ఘ విచారణ జరిగింది. ఈ కేసులో ప్రతివాదిగా ఉన్న గొల్ల లక్ష్మీనారాయణ (వికలాంగుడు) విచారణకు హాజరై, తనకు సంబంధించిన ఒరిజినల్ పాస్ బుక్ మరియు పక్కా భూ పత్రాలను (డాక్యుమెంట్లను) అధికారులకు సమర్పించారు.మరోవైపు, ఈ భూమిపై 'మస్జిద్ రియల్ ఎస్టేట్' వారు కూడా హాజరై హైకోర్టులో తాము దాఖలు చేసిన ఔ్రా. 16138/2026 కేసు వివరాలను తెలియజేస్తూ, తదుపరి విచారణ ఈ నెల 22న ఉందని అధికారుల దృష్టికి తెచ్చారు.

**'ఫోర్జరీ' ఆరోపణలకు ఆధారాలు లేవు ఆర్డీఓ ఉత్తర్వులు:** పిటిషనర్ బైరెడ్డి హరిత ఆరోపిస్తున్నట్లుగా ప్రతివాది గొల్ల లక్ష్మీనారాయణ సమర్పించిన పాస్ బుక్స్ గానీ, రెవెన్యూ రికార్డులు గానీ ఫోర్జరీ అయినట్లు నిర్ధారించడానికి ఎలాంటి పక్కా ఆధారాలను పిటిషనర్ పక్షం విచారణలో సమర్పించలేకపోయింది.దీంతో రెవెన్యూ రికార్డులు, రీ-సర్వే నివేదికలను క్షుణ్ణంగా పరిశీలించిన రెవెన్యూ డివిజనల్ అధికారి.. రిసెర్వే తదుపరి 'వెబ్ ల్యాండ్-2' (ఔవఎ ఝఅస - 2) నందు నమోదై ఉన్న శ్రీ గొల్ల లక్ష్మీనారాయణ గారి పేరును ఖరారు చేస్తూ, ఆయన హక్కులను నిర్ధారిస్తూ తుది ఉత్తర్వులు జారీ చేశారు.

**అసత్య ప్రచారాలను నమ్మవద్దు:** కేసుతో ఎలాంటి సంబంధం లేని వి.వి. నాయుడు మరియు ఇతర అనుచరులతో కలిసి పిటిషనర్ బైరెడ్డి హరిత ఉద్దేశపూర్వకంగానే అసత్య ప్రచారాలు చేస్తున్నారని, విచారణ అంతా పారదర్శకంగా, రికార్డుల ప్రకారమే జరిగిందని రెవెన్యూ విభాగపు అధికారి కార్యాలయం ఓ ప్రకటనలో స్పష్టం చేసింది. వివాదాలకు తావులేకుండా రికార్డుల ఆధారంగానే లక్ష్మీనారాయణ పేరును నిర్ధారించినట్లు అధికారులు వెల్లడించారు.

# క్రిమినల్స్‌కు కులం లేదు.. వైసీపీ గూండాలను తొక్కి నార తీస్తా:

రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమని, నేరస్తులకు కులం, మతం, ప్రాంతం వంటివి అంటగట్టి వెనకేసుకొచ్చే సంస్కృతికి చరమగీతం పాడతామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. నేరాలకు పాల్పడింది తన పార్టీ నాయకులైనా సరే ఉపేక్షించేది లేదని, పోలీసుల విధుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ జోక్యం చేసుకోనని హామీ ఇచ్చారు. కాకినాడలో జరిగిన 'మన ఊరు - మాట మంతి' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, గత ఐదేళ్ల పాలనలో వ్యవస్థలను నిర్వీర్యం చేశారని, క్రిమినల్స్‌ను ప్రోత్సహించారని తీవ్రస్థాయిలో విమర్శించారు. ముఖ్యంగా వైసీపీకి చెందిన రౌడీ మూకలను, గుండాలను తొక్కి నార తీస్తాను అంటూ తీవ్ర పదజాలంతో హెచ్చరించారు.

**వైసీపీ గుండాలకు బహిరంగ హెచ్చరిక** "రక్తపాతం సృష్టిస్తాం, కుత్తుకలు కోస్తాం అని విర్రవీగుతున్న ప్రతి వైసీపీ గుండాకు కెమెరా సాక్షిగా చెబుతున్నా. మీ పిచ్చి వేషాలు మా దగ్గర చెల్లవు. ప్రభుత్వాలు వస్తుంటాయి, పోతుంటాయి. ప్రజల చేతిలో నిర్ణయం ఉంటుంది. ఒకవేళ మీ ప్రభుత్వమే వచ్చినా సరే, మిమ్మల్ని తొక్కి నార తీస్తాను, గుర్తుపెట్టుకోండి. గతంలో వైసీపీకి పనిచేశామని ఇప్పటికీ విధేయత చూపిస్తున్న కొందరు అధికారులపై ప్రత్యేక దృష్టి పెడతాను" అని పవన్ తీవ్రంగా హెచ్చరించారు. "దేశాన్ని, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలనే లక్ష్యంతో రాజకీయాల్లోకి వచ్చాను. పదవుల కోసం కాదు. కాకినాడలో ఛార్జ్ తీసుకున్న తర్వాత ఎవరు ఎస్పీగా, కలెక్టర్‌గా ఉండాలో నేను నిర్దేశించలేదు. వ్యవస్థలను బలోపేతం చేయండి, నా నుంచి ఒక్క ఫోన్ కాల్ కూడా రాదని వారికి చెప్పాను. నా పార్టీ వాళ్లను పట్టుకున్నా వదలమని చెప్పను. ఎమ్మెల్సీ తన డ్రైవర్‌ను చంపేస్తే జైలుకు వెళ్లి అభినందించే వ్యక్తిని నేను కాదు. తెలిసి తెలియని వయసులో 23 నేరాలు చేసిన వాడ్ని కూడా పసిపిల్లవాడని వెనకేసుకొచ్చే నాయకుడిని కాదు" అని పవన్ పరోక్ష వ్యాఖ్యలు చేశారు. ఇలాంటి నేరపూరిత భావజాలాన్ని ప్రోత్సహిస్తే భవిష్యత్తు ఊహకు అందకుండా తయారవుతుందని ప్రజలను హెచ్చరించారు.

**శాంతిభద్రతల పునరుద్ధరణే లక్ష్యం** శాంతిభద్రతలు పటిష్టంగా ఉంటేనే పెట్టుబడులు, పరిశ్రమలు, ఉద్యోగాలు వస్తాయని, సమాజం సవ్యంగా ముందుకు సాగుతుందని పవన్ కల్యాణ్ అన్నారు. "లా అండ్ ఆర్డర్ అనేది కేవలం ప్రభుత్వ విధి మాత్రమే కాదు, నాగరిక సమాజానికి అది పునాది. అది లేకపోతే సంక్షేమం, ఉద్యోగాలు, వ్యాపారాలు అన్నీ కుప్పకూలిపోతాయి. రూల్ ఆఫ్ లాను బలంగా నిలబెట్టాల్సిన బాధ్యత అధికారులదే. ఏ విషయంలోనైనా ఒత్తిడి తీసుకువచ్చేలా నా నుంచి ఒక్క ఫోన్ కాల్ కూడా రాదు" అని ఎస్పీ, కలెక్టర్లను ఉద్దేశించి అన్నారు.

**క్రిమినల్స్‌కు కులం రంగు పులమొద్దు** కొందరు నేరస్తులకు కులం రంగు పులిమి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని, ఇది రాష్ట్ర భవిష్యత్తుకు అత్యంత ప్రమాదకరమని పవన్ ఆవేదన వ్యక్తం చేశారు. "ఆంధ్రప్రదేశ్‌కు పట్టిన కులం దరిద్రం వదిలితే తప్ప రాష్ట్రం బాగుపడదు. క్రిమినల్‌కు కులం ఉండదు. అత్యాచారం చేసేవాడికి, దోపిడీ చేసే నీచుడికి కులం ఎందుకు ఉంటుంది? అలాంటి వారిని వెనకేసుకొస్తే అది ఆ వ్యక్తి నైజాన్ని తెలుపుతుంది. ఎమ్మెల్సీ అనంతబాబు ఒక దళిత డ్రైవర్‌ను హత్య చేస్తే, అది కాపులందరికీ చెడ్డపేరు అవుతుందా? ప్రతిదానికీ కులాన్ని లాగడం సరికాదు" అని ఆయన ప్రశ్నించారు. సుగాలి ప్రీతి, వివేకానంద రెడ్డి హత్య కేసుల్లో గత ప్రభుత్వం సాక్ష్యాలను నాశనం చేయడం వల్లే నేరస్తులకు శిక్ష పడటం కష్టమవుతోందని అన్నారు.

**తప్పుడు ఎస్సీ, ఎస్టీ కేసులపై కఠినంగా ఉండాలి** ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని కొందరు రాజకీయ ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేస్తున్నారని పవన్ విమర్శించారు. "నిజమైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను ఎంత బలంగా ఎదుర్కొంటామో, తప్పుడు కేసులను కూడా అంతే బలంగా నిలువరించాలి. బాబాసాహెబ్ అంబేద్కర్ మీద గౌరవం ఉన్నవారెవరూ తప్పుడు కేసులు పెట్టరు. సుప్రీంకోర్టు కూడా దీనిపై స్పందించిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. మా కూటమి నాయకులు కూడా ఇలాంటి వాటిని ప్రోత్సహించవద్దు" అని విజ్ఞప్తి చేశారు.

**పౌర సమాజం మేల్కొనాలి** ప్రజలు కూడా తమ బాధ్యతను గుర్తించాలని, తమ ప్రాంతాల్లో జరిగే అన్యాయాలపై గొంతెత్తాలని పవన్ పిలుపునిచ్చారు. "కుల సంఘాలకు వాట్సాప్ గ్రూపులు ఉన్నప్పుడు, శాంతిభద్రతల కోసం ఎందుకు లేవు? మీ వీధిలో 30-40 మంది కలిసి ఒక గ్రూప్‌గా ఏర్పడండి. సిటిజన్ కౌన్సిల్స్ ఏర్పాటు చేసుకోండి. మీరు బలంగా నిలబడితే, ఏ క్రిమినల్ కూడా తలెత్తడానికి భయపడతాడు. జనసేన ఎమ్మెల్యేలు, ఎంపీలు కూడా లా అండ్ ఆర్డర్ సమస్యలపై ఎక్కడికక్కడ గొంతెత్తాలి. నన్ను కులానికి పరిమితం చేయొద్దు" అని చేతులెత్తి నమస్కరిస్తూ కోరారు. వ్యవస్థాగత వైఫల్యం వల్లే ఒక ఎస్సై పరిష్కరించాల్సిన సమస్య డిప్యూటీ సీఎం వద్దకు వస్తోందని, ఇలాంటి పరిస్థితులను మార్చడానికే తాను కట్టుబడి ఉన్నానని పవన్ కల్యాణ్ పునరుద్ఘాటించారు.

# భారత్ ధర్మసత్రం కాదు

శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే, కాంగ్రెస్ పార్టీలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. భారత్ ధర్మసత్రం కాదని, ఈ దేశం పౌరులకు మాత్రమే ఇక్కడ నివసించే హక్కు ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. దేశంలోని ప్రతి చొరబాటుదారుడినీ గుర్తించి, వారిని వెళ్లగొడతామని హెచ్చరించారు. శనివారం మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో మహాలక్ష్మి ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. చొరబాటుదారులను ఓటు బ్యాంకుగా మార్చుకుని రాజకీయ లబ్ధి పొందాలని కాంగ్రెస్, ఉద్ధవ్ ఠాక్రే ప్రయత్నిస్తున్నారని అమిత్ షా ఆరోపించారు. "ఈ దేశం ధర్మసత్రం కాదని వారికి స్పష్టంగా చెప్పదలుచుకున్నాను. ఈ దేశానికి చెందిన వారు మాత్రమే ఇక్కడ ఉంటారు. ప్రతి చొరబాటుదారుడినీ గుర్తించి, దేశం నుంచి తరిమికొడతాం" అని ఆయన పేర్కొన్నారు.

# రైతులకు నరకం చూపిస్తున్న రేవంత్ ప్రభుత్వం

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తుందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద తీవ్రంగా మండిపడ్డారు. ప్రజలను నానాయాతన పెడుతూ రాష్ట్రాన్ని పూర్తిగా అధోగతి పాలు చేస్తుందని విమర్శించారు. హైదరాబాద్ చింతల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం ఉదయం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేపీ వివేకానంద మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ది పేరుకే ప్రజాపాలన.. వాస్తవానికి ప్రజలను హింసించే పాలనగా సాగుతుందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాక్షస పాలన సాగుతోందని ఆరోపించారు.పదేళ్ల పాటు కేసీఆర్ పాలనలో వ్యవసాయాన్ని ఒక పండుగలా మార్చారని కేపీ వివేకానంద తెలిపారు. రైతులను కంటికి రెప్పలా కాపాడుకుంటూ, కడుపులో పెట్టుకుని చూసుకున్నారని కొనియాడారు. సకాలంలో విత్తనాలు, యూరియా అందించడమే కాకుండా, సమయానికి 'రైతు బంధు' డబ్బులను నేరుగా రైతుల ఖాతాల్లో వేసి, పండించిన ప్రతి ధాన్యాన్ని కొనుగోలు చేసి అన్నదాతకు బంగారు బాట వేశారని పేర్కొన్నారు. కానీ నేడు రేవంత్ రెడ్డి రాక్షస పరిపాలనలో రైతులంతా హింసను అనుభవిస్తున్నారని, రైతులకు నరకం చూపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయానికి విత్తనాలు లేవు, యూరియా కోసం రైతులు రోడ్లపై పడిగాపులు కాస్తూ యుద్ధాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు పేరు మార్చి రైతు భరోసా అని పెట్టారని.. కానీ అది భరోసా కాదు.. రైతు మోసం అని అన్నారు. రైతు భరోసా కింద ఒక్క రైతుకు కూడా డబ్బులు ఇవ్వలేదని విమర్శించారు. సంపూర్ణ రుణమాఫీ చేస్తానని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని కేపీ వివేకానంద మండిపడ్డారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బోరంపేట పీఏసీఎస్ పరిధిలో 632 మంది రైతులకు కేవలం 13 మందికే రుణమాఫీ అయ్యిందని తెలిపారు. రుణమాఫీ విషయంలో రేవంత్ రెడ్డి గజదొంగలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం వడ్లు కొనకపోతే రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయదా అని పీసీసీ ప్రెసిడెంట్‌గా ఉన్న సమయంలో రేవంత్ రెడ్డి ప్రశ్నించారని గుర్తుచేశారు. కేంద్రం వడ్లు కొనుగోలు చేయకపోతే కిషన్ రెడ్డి ఇంటి ముందు వడ్లు పోస్తానని శపథం చేసిన రేవంత్ రెడ్డి.. ఇప్పుడు మోదీకి సరెండర్ అయిపోయాడని విమర్శించారు. రేవంత్ రెడ్డి చేతగానితనాన్ని, డొల్లతనాన్ని, అసమర్థను ఆయన ప్రకటనలే బయటపెడుతున్నాయని అన్నారు. మూసీ ప్రక్షాళన, మెట్రో రైలు విస్తరణ, ఫోర్త్ సిటీ, కాళేశ్వరం రిపేర్లు ఇలా ప్రతిదాంట్లో రేవంత్ రెడ్డి ప్రభుత్వం విఫలమైందని అన్నారు. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుపై దుమ్మెత్తిపోస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ మోసాలను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని.. ఈ చేతగాని ప్రభుత్వాన్ని గద్దె దించడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా గులాబీ జెండా ఎగురడం, మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రైతాంగానికి చేసిన మోసానికి కాంగ్రెస్ ప్రభుత్వం ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తక్షణమే రైతు బీమా ప్రీమియం చెల్లించాలని, రైతు భరోసా కింద ఎకరానికి రూ.15వేలను రైతుల ఖాతాలో జమ చేయాలలన్నారు. లేదంటే అసెంబ్లీ వేదికగానే కాకుండా, రోడ్లపైకి వచ్చి ప్రజా పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. రేవంత్ రెడ్డి సర్కార్ మెడలు వంచైనా రైతుల హక్కులను సాధించుకుంటామని స్పష్టం చేశారు.

# మానవవాదమే ప్రజాస్వామ్య పరిణతి

ప్రతి సంవత్సరం జూన్ 21న ప్రపంచవ్యాప్తంగా మానవవాదులు, హేతువాదులు, నాస్తికులు, శాస్త్రీయ దృక్పథాన్ని విశ్వసించే ప్రజలు ప్రపంచ మానవవాద దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఇది కేవలం ఒక జ్ఞాపక దినం మాత్రమే కాదు; మానవుడే విలువల కేంద్రం, మానవ సంక్షేమమే సామాజిక వ్యవస్థల అంతిమ లక్ష్యం అనే భావనను పునరుద్ఘాటించే సందర్భం.ప్రపంచ మానవవాద దినోత్సవం సందర్భంగా ఒక ముఖ్యమైన విషయాన్ని గుర్తుంచుకోవాలి. మానవవాదం అనేది కేవలం ఒక తాత్విక ధోరణి మాత్రమే కాదు; అది భారత రాజ్యాంగం ఆమోదించిన విలువ కూడా. ప్రపంచంలోని చాలా రాజ్యాంగాలు పౌరులకు హక్కులను కల్పిస్తాయి. కానీ భారత రాజ్యాంగం ఒక అడుగు ముందుకేసి పౌరులు ఎలాంటి విలువలను పెంపొందించుకోవాలో కూడా నిర్దేశించింది. అందులో మానవవాదానికి చోటు కల్పించడం దూరదృష్టికి నిదర్శనం. అయితే ఇక్కడ ఒక ముఖ్యమైన ప్రశ్న తలెత్తుతుంది. మానవవాదాన్ని రాజ్యాంగం ప్రోత్సహిస్తున్నప్పుడు, మన విద్యా వ్యవస్థ, పరిపాలన, సామాజిక వ్యవస్థలు ఆ విలువను ఎంతవరకు ఆచరణలో పెడుతున్నాయి? నిజానికి భారత సమాజంలో ఇప్పటికీ కులం, మతం, జాతి, లింగం ఆధారంగా వివక్ష కొనసాగుతోంది. మూఢనమ్మకాలు, అంధవిశ్వాసాలు, సామాజిక అసమానతలు అనేక రూపాల్లో కనిపిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో మానవవాదం కేవలం ఒక సిద్ధాంతం కాదు; అది సామాజిక అవసరం. మానవవాదం మనిషిని కులం కంటే గొప్పవాడిగా చూస్తుంది. మతం కంటే మానవ గౌరవాన్ని ప్రాధాన్యంగా పరిగణిస్తుంది. జన్మ కంటే వ్యక్తిత్వాన్ని, సంప్రదాయం కంటే హేతువును, విభజన కంటే సౌభ్రాతృత్వాన్ని విలువైనవిగా భావిస్తుంది. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కూడా రాజ్యాంగం విజయవంతం కావాలంటే రాజ్యాంగ నైతికత సమాజంలో పెరగాలని చెప్పారు. రాజ్యాంగ నైతికతకు మూల సూత్రాలు స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం. ఇవే మానవవాదం ప్రధాన విలువలు కూడా. మానవ వాద భావజాలం పెరగాలంటే భారతదేశంలో ప్రమాదకరంగా ఉన్న కుల వ్యవస్థ నుంచి బయటపడాలి. దేశంలో ఇప్పటివరకు మతరహితులు, నాస్తికులు, మానవవాదులను తరచుగా 'ఇతరులు' అనే విభాగంలో కలిపేసేవారు. వారి సంఖ్య, అవసరాలు, వారి సామాజిక స్థితి గురించి స్పష్టమైన సమాచారం ప్రభుత్వాల వద్ద ఉండేది కాదు. మానవవాదం అనేది మానవ జీవితానికి అర్థం, విలువ, గౌరవం మానవుల నుంచే ఉద్భవిస్తాయని చెప్పే తాత్విక దృక్పథం. మానవీయ విలువల్ని పెంచడం, వాటిని అనుసరించడం కూడా మానవవాదమే. ఇది మత విశ్వాసాలకు వ్యతిరేకంగా ఉండాల్సిన అవసరం లేదు; కానీ మానవ సమస్యలకు పరిష్కారాలను దైవిక జోక్యంలో కాకుండా మానవ బుద్ధి, శాస్త్ర విజ్ఞానం, నైతికత, సామాజిక బాధ్యతలలో వెతుకుతుంది. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, మానవ హక్కులు, లింగ సమానత్వం, శాస్త్రీయ దృక్పథం, ప్రజాస్వామ్యం ఇవన్నీ మానవవాద ఆలోచనలో కీలక విలువలు. భారతీయ సంప్రదాయంలో కూడా చార్వాకులు, లోకాయతులు, బౌద్ధులు, జైనులు వంటి అనేక ఆలోచనా ధోరణులు మానవవాదానికి దగ్గరగా ఉన్న భావాలను వ్యక్తపరిచాయి. ఆధునిక కాలంలో జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే, పెరియార్, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్, గోరా, ఎం.ఎన్.రాయ్ వంటి మహనీయులు మానవవాద, హేతువాద ఆలోచనలను సామాజిక ఉద్యమాలతో అనుసంధానించారు. దానికి కొనసాగింపుగా బి.రామకృష్ణ, గుత్తా రాధాకృష్ణ, డాక్టర్ పి.ఎం.భార్గవ, రావిపూడి వెంకటాద్రి, డాక్టర్ జయగోపాల్ లాంటి అనేక మంది సమాజం మార్పు కోసం అహర్నిశలు శ్రమించారు. భారత రాజ్యాంగం మత స్వేచ్ఛను హామీ ఇస్తున్నప్పటికీ, మతాన్ని అనుసరించకపోవడానికి సంబంధించిన గుర్తింపునకు ఇప్పటికీ సరైన పరిపాలనా వ్యవస్థ లేదు. ప్రభుత్వ పత్రాలు, విద్యాసంస్థలు, అనేక అధికారిక దరఖాస్తుల్లో మతం తప్పనిసరి కాలమ్‌గా కొనసాగుతున్న సందర్భాలు కనిపిస్తూనే ఉన్నాయి. నాస్తికుడు అంటే నైతికత లేని వ్యక్తి, మతరహితుడు అంటే సంప్రదాయ వ్యతిరేకి అనే అపోహలు ఇంకా సమాజంలో ఉన్నాయి. ప్రతి పౌరుడు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని రాజ్యాంగం చెబుతున్నా, మూఢనమ్మకాలు, అంధవిశ్వాసాలు, మతపరమైన మూఢాచారాలు ఇంకా విస్తృతంగా కొనసాగుతున్నాయి. మత విశ్వాసాలను విడిచిపెట్టిన అనేక మంది కూడా కుల గుర్తింపులను పూర్తిగా అధిగమించలేకపోతున్నారు. కులం భారత సమాజంలో కేవలం మతపరమైన అంశం కాదు; అది సామాజిక, ఆర్థిక, రాజకీయ నిర్మాణాలలో బలంగా పాతుకుపోయిన వ్యవస్థ.డాక్టర్ అంబేద్కర్ చెప్పినట్లుగా కుల వ్యవస్థను నిర్మూలించకుండా నిజమైన ప్రజాస్వామ్యం సాధ్యం కాదు. కులాంతర వివాహాలు, సమాన విద్యావకాశాలు, సామాజిక న్యాయం, ఆర్థిక సమానత్వం... ఇవన్నీ కలిసి పనిచేసినప్పుడే కులరహిత సమాజం నిర్మాణం సాధ్యమవుతుంది. రాబోయే జాతీయ జనగణనలో 'కులం లేదు', 'మతం లేదు' అనే ప్రత్యేక కాలమ్‌లను చేర్చడం ద్వారా భారతదేశం తన పౌరులందరి అస్తిత్వాన్ని సమానంగా గుర్తించాలి. ప్రజాస్వామ్యం అంటే కేవలం మెజారిటీని గుర్తించడం కాదు; భిన్నమైన ఆలోచనలతో జీవించే ప్రతి వ్యక్తి హక్కులను గుర్తించడం కూడా. మానవవాదులు, మతరహితులు, కులరహితులు కూడా భారతదేశ పౌరులే. వారి ఉనికిని అధికారికంగా నమోదు చేయడం ప్రజాస్వామ్య పరిపక్వతకు సూచిక. ప్రపంచ మానవవాద దినోత్సవం మనకు ఒక ముఖ్యమైన సందేశాన్ని గుర్తుచేస్తుంది. మనిషి కేంద్రంగా మానవత్వం ఆధారంగా మానవ హక్కులను కాపాడి గౌరవించే సమాజమే నిజమైన నాగరిక సమాజం.

# దేశానికి ఆధ్యాత్మిక హబ్‌గా ఆంధ్రప్రదేశ్

అవసరమన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 190 దేశాలు యోగాను అనుసరిస్తున్నాయని వివరించారు. బాబారామ్‌దేవ్ ఏదైనా చేయగలరన్నారు. యోగాకు.. రామ్‌దేవ్ మంచి గుర్తింపు తీసుకొచ్చారని కొనియాడారు. యోగా మన సంప్రదాయం, విజ్ఞానం, వారసత్వ సంపద అని చెప్పుకొచ్చారు. ప్రస్తుత సమాజంలో యువత చాలా ఒత్తిడితో ఉందని సీఎం అన్నారు. ఆధ్యాత్మికతతో కూడిన సాంకేతికత చాలా అవసరమని తెలిపారు. దేశానికి ఆధ్యాత్మిక హబ్‌గా ఏపీ మారనుందని పేర్కొన్నారు. ఉండవల్లి కొండల వద్ద యోగా.. చాలా అందమైన ఆలోచన అని అన్నారు. అమరావతి కోసం 29 వేల మంది రైతులు 33 వేల ఎకరాలు ఇచ్చారని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ యునైటెడ్ నేషన్స్‌ను ఒప్పించి ప్రపంచ యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. 20 లక్షల ఎకరాల్లో రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం 31శాతం ఉన్న పచ్చదనాన్ని 50 శాతానికి పెంచడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామన్నారు. రాందేవ్‌బాబా మాట్లాడుతూ.. అభివృద్ధి, విజన్ కలిగిన సీఎం.. చంద్రబాబు అని కితాబిచ్చారు. ప్రధాని వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా సీఎం కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దేశంలోనే విజన్ ఉన్న నాయకుడని అన్నారు. గత 30 సంవత్సరాలుగా చంద్రబాబు ఏం అడుగుతారో.. తాము అది చేస్తున్నామని తెలిపారు. యోగా మన సంస్కృతి, సంప్రదాయాల్లో భాగమని రామ్‌దేవ్ బాబా తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు అందర్నీ సమానంగా చూస్తారని.. అందుకే ప్రజలు ఆయన్ను దేవుడిలా భావిస్తారన్నారు. అమరావతి దేవతల రాజధాని అని.. ఇక్కడ 40 శాతం పచ్చదనం, 60 శాతం నిర్మాణాలు ఉంటాయన్నారు. ఇది దేవ భూమి అని వెల్లడించారు. స్విట్జర్లాంట్ కోసం వెళ్లాల్సిన అవసరం లేదని... ఆంధ్రప్రదేశ్ వస్తే చాలని చెప్పారు. ఇక్కడి మామిడికాయలు, అరటిపండ్లు చాలా బాగుంటాయని.. ఎందుకంటే వాటిని సహజ సిద్ధంగా పండిస్తారని తెలిపారు. ఈసారి అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని 'యోగా ఫర్ హెల్తీ ఏజింగ్' పేరుతో నిర్వహిస్తున్నామని రామ్‌దేవ్ బాబా పేర్కొన్నారు.

# ఒడిషాలో 47వేల కోట్లతో అభివృద్ధి పనులు

ఒడిషా రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఒడిశాలోని మయూర్‌భంజ్‌లో జరిగిన 'వికాస్ రా ధారా, ఒడిశా సారా' బహిరంగ సభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒడిశా సర్వతోముఖాభివృద్ధి కోసం దాదాపు రూ.47,000 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జన్మదినం రోజే ఈ కార్యక్రమం జరగడం విశేషం. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జన్మదినం సందర్భంగా ఆమె స్వగ్రామమైన పహాడ్‌పూర్‌ను ప్రధాని మోదీ సందర్శించారు. ఈ గ్రామాన్ని వేగంగా అభివృద్ధి చేసి 'సోలార్ విలేజ్'గా మారుస్తామని ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామంలోని ప్రతి ఇంటికీ సౌరశక్తి అందుతుంది. ఒడిశాలోని ప్రసిద్ధ కోణార్క్ సూర్య దేవాలయానికి ఉన్న గుర్తింపు తరహాలోనే, పహాడ్‌పూర్ గ్రామం కూడా ప్రపంచపటంలో పునరుత్పాదక ఇంధన కేంద్రంగా సరికొత్త గుర్తింపును పొందుతుందని ప్రధాని పేర్కొన్నారు. ఒడిశాలోని సహజ వనరులను ఆర్థిక అవకాశాలుగా మార్చడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ప్రధాని తెలిపారు. రాష్ట్రంలో భారీగా పారిశ్రామిక వృద్ధి జరుగుతోందని, అంతర్జాతీయ, దేశీయ పెట్టుబడిదారులను ఆకర్షించడంలో 'ఉత్కర్ష్ ఒడిశా' ప్రచారం కీలక పాత్ర పోషిస్తోందని ఆయన కొనియాడారు. కొత్త పరిశ్రమల స్థాపన ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. గిరిజన యువతకు మెరుగైన విద్య, ఉపాధి అవకాశాలను అందించడం ద్వారా వారిని సాధికారత వైపు నడిపించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మోదీ పునరుద్ఘాటించారు. గిరిజన పిల్లలకు మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించేందుకు దేశవ్యాప్తంగా సుమారు 500 ఏకలవ్య మోడల్ స్కూళ్లను ప్రారంభించామని తెలిపారు. అంతకుముందు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ కలిసి పహాడ్‌పూర్ గ్రామంలోని 'సంతాలీ జాహిరా', 'హో జాహిరా' అనే పవిత్ర వనాలలో సంప్రదాయ పూజలు, ఆచారాలు నిర్వహించి దేశ శ్రేయస్సు కోసం ప్రార్థించారు. ప్రస్తుతం ఒడిశాలో పండుగ వాతావరణం నెలకొందని, గత వారమే 'గాన్ పర్దా' పండుగను ఘనంగా జరుపుకున్నారని, అలాగే జగన్నాథ రథయాత్ర, బరిపద రథయాత్ర ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయని ఈ సందర్భంగా ప్రధాని గుర్తుచేశారు. ఈ ఉత్సవాల మధ్య 'ప్రజాస్వామ్యం, అభివృద్ధి' అనే పండుగ కూడా ఇక్కడ నడుస్తోందని ఆయన హర్షం వ్యక్తం చేశారు.

# అన్నదాత సుఖీభవ నిధుల విడుదల

రైతులకు ఏటా రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చి.. దాన్ని నిలబెట్టుకున్నా మని సీఎం చంద్రబాబు అన్నారు. రైతు బాగుంటేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బాగుంటుందన్నారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం లింగంగుంట్లలో 'పీఎం కిసాన్- అన్నదాత సుఖీభవ' నిధులను విడుదల చేసిన అనంతరం ముఖ్యమంత్రి ప్రసంగించారు. నిధుల విడుదలకు సంబంధించి రైతులు తమ ఫోన్ ద్వారా వచ్చాయో లేదో చూసి చెప్పాలన్నారు. అక్కడే రైతులు సెలఅ÷-÷-ఫోన్లు ఊపుతూ వచ్చాయని సైగలు చేశారు. టెక్నాలజీ పెరగడంతో క్షణాల్లో వ్యవహారం తెలిసిపోతోందన్నారు. కూటమి ప్రభుత్వానికి అధికారం కట్టబెట్టినందుకు తాము నమ్మకంగా పనిచేస్తున్నామని అన్నారు. వైకాపా హయాంలో అన్నదాతలు అనేక సమస్యలు ఎదుర్కొన్నారని తెలిపారు. ప్రజలను కష్టాల్లోకి నెట్టడం తప్ప గొడ్డలి పార్టీకి మరేమీ తెలియదని విమర్శించారు. ఇవాళ యోగా, స్వచ్ఛాంధ్ర, అన్నదాత సుఖీభవ.. ఇలా మూడు మంచి కార్యక్రమాల్లో పాల్గొన్నాను. నా జీవితంలో ఇవాల్టికి మించిన ఆనందం మరొకటి లేదన్నారు. గత ప్రభుత్వం ఆర్థిక విధ్వంసం సృష్టించింది. విధ్వంసం నుంచి వికాసంవైపు తీసుకెళ్తామని మేం హామీ ఇచ్చాం. సంపద సృష్టించి.. రైతుల కష్టాలు తీరుస్తామని చెప్పాం. అన్నదాతలకు ప్రతి విషయంలో అండగా ఉన్నాం. బటన్ నొక్కగానే 99.8 శాతం మంది రైతులకు నిధులు జమయ్యాయి. గతంలో ధాన్యం కొని ఆరు నెలలైనా డబ్బులు వచ్చేవి కావు. మా ప్రభుత్వం 48 గంటల్లోనే డబ్బులు ఇస్తోందన్నారు. ఒకప్పుడు ఆంధ్ర అంటే వరి.. తెలంగాణ అంటే మెట్ట పొలాలు. ఇప్పుడు ఆంధ్రాను డామినేట్ చేసి తెలంగాణ వరిని పండిస్తోంది. మనం ప్రకృతి సేద్యం వైపు మళ్లాలి. ఎక్కువ రసాయనాలు వినియోగిస్తే.. ఇతర దేశాలు మన ఉత్పత్తులను దిగుమతి చేసుకోవు. రైతులకు లాభసాటిగా ఉండాలని పామాయిల్ పంటను ప్రోత్సహిస్తున్నాం. రాయలసీమ హార్టికల్చర్ హబ్‌గా మారింది. సంజీవని ప్రాజెక్టు ద్వారా అందరి ఆరోగ్యాన్ని కాపాడుతాం అని చంద్రబాబు అన్నారు. 'పీఎం కిసాన్- అన్నదాత సుఖీభవ' కింద తొలి విడతగా 46.85 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.7 వేల చొప్పున రూ.3,125 కోట్లు జమయ్యాయి. పశ్చిమ బెంగాల్‌లో ప్రధాని మోదీ పాల్గొన్న పీఎం- కిసాన్ నిధుల విడుదల కార్యక్రమాన్ని రైతులతో కలిసి ముఖ్యమంత్రి వర్చువల్‌గా వీక్షించారు. లింగంగుంట్లలో ప్రజావేదిక సభ వద్ద ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. ప్రాసెసింగ్ ఎ÷-లాంట్లు, వర్మీకంపోస్ట్ తయారీ గురించి అడిగి తెలుసుకున్నారు. జాతీయ నూనెగింజలు, ఆయిల్‌పామ్ మిషన్ ప్రదర్శనలను తిలకించారు. ఈ కార్యక్రమంలో మంత్రి అచ్చన్నాయుడు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# ఢిల్లీలో అవార్డు అందుకున్న ఏపీ పోలీసులు..

పాస్‌పోర్ట్ దరఖాస్తుల వెరిఫికేషన్ ప్రక్రియలో ప్రదర్శించిన అత్యుత్తమ పనితీరుకు గాను ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ ప్రతిష్ఠాత్మక జాతీయ పురస్కారాన్ని దక్కించుకుంది. 2025 సంవత్సరంలో అందించిన సేవలకు గుర్తింపుగా 'ఇన్‌స్టిట్యూషనల్ పెర్ఫార్మెన్స్ అవార్డ్ ఫర్ స్టేట్ పోలీస్'ను ఏపీ పోలీస్ విభాగం కైవసం చేసుకుంది.న్యూఢిల్లీలో నిర్వహించిన పాస్‌పోర్ట్ సేవా దివస్ వేడుకల్లో కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. రాష్ట్ర డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా తరపున ఇంటెలిజెన్స్ విభాగం సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్పీ) ఎ. రమాదేవి ఈ గౌరవప్రదమైన అవార్డును అందుకున్నారు.ఈ సందర్భంగా డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో పోలీస్ శాఖ పనితీరు మెరుగుపడిందని తెలిపారు. ఇంటెలిజెన్స్ విభాగం, జిల్లాల ఎస్పీలు, నగర పోలీస్ కమిషనర్ల సమష్టి కృషితోనే ఈ ఘనత సాధ్యమైందని పేర్కొంటూ ఆయన సిబ్బందిని అభినందించారు. పౌరులకు అత్యంత కీలకమైన పాస్‌పోర్ట్ జారీ ప్రక్రియలో పోలీస్ వెరిఫికేషన్‌ను వేగంగా, సమర్థవంతంగా పూర్తి చేయడంలో రాష్ట్ర పోలీస్ శాఖ చూపిన చొరవకు ఈ అవార్డు నిదర్శనంగా నిలుస్తోంది. తద్వారా రాష్ట్రంలో పరిపాలనా సామర్థ్యం మెరుగుపడినట్లు స్పష్టమవుతోంది.

# నూనెపల్లిలో అంగన్వాడీ కేంద్రాలు,పాఠశాలల తనిఖీ.





**విద్యార్థుల భోజన నాణ్యతపై నంద్యాల మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి ఆరా**

**గర్భిణీలకు అందుతున్న పోషకాలపై మాజీ ఎమ్మెల్యే భూమా పరిశీలన.**

**అంగన్వాడీ సేవలు మెరుగుపర్చాలని సూచన.**

**చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి అవసరం..**

**మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి.**

నంద్యాల సిటీ బ్యూరో జూన్ 20 ( నంది పత్రిక ) నంద్యాల పట్టణం నూనెపల్లి ప్రాంతంలో ఉన్న పలు అంగన్వాడీ కేంద్రాలు, ఠాగూర్ ప్రాథమిక పాఠశాలను మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, ఆహార నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలపై సంబంధిత సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా విద్యార్థులతో మమేకమైన ఆయన, వారికి అందుతున్న విద్యా సదుపాయాలు, పాఠశాలలో ఉన్న మౌలిక వసతుల గురించి ఆరా తీశారు. చిన్నారులకు అందించే ఆహారం పోషక విలువలతో కూడి ఉండాలని, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులు, సిబ్బందికి సూచించారు. అనంతరం పలు అంగన్వాడీ కేంద్రాలను సందర్శించిన భూమా బ్రహ్మానందరెడ్డి అక్కడ గర్భిణీ స్త్రీలు, బాలింతలకు అందిస్తున్న పోషకాహార సరఫరా,ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై వివరాలు తెలుసుకున్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారం నాణ్యతగా ఉండేలా చూడాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ప్రయోజనాలు చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం మహిళలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, అంగన్వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. పిల్లల విద్యాభివృద్ధి, మహిళల ఆరోగ్య సంరక్షణలో అంగన్వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అంగన్వాడీ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## మర్రిపాడులో ఘనంగా రెవెన్యూ డే కార్యక్రమం..




మర్రిపాడు జూన్ 20నంది పత్రిక : మర్రిపాడు మండల తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో శనివారం రెవెన్యూ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీడీపీ నాయకులు, ఏఎంసీ చైర్మన్ జనార్దన్ నాయుడు, శాఖమూరి నారాయణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మండల తహసీల్దార్ అనిల్ కుమార్ యాదవ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రెవెన్యూ శాఖ గత ఏడాది కాలంలో చేపట్టిన కార్యక్రమాలు, సాధించిన పురోగతిని వివరించారు.ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలోని 21 రెవెన్యూ గ్రామాల్లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం రెండు గ్రామాల్లో రీ-సర్వే ప్రక్రియ పూర్తిచేశామని తెలిపారు. త్వరలో ఆయా గ్రామాల రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. మరో నాలుగు గ్రామాల్లో రీ-సర్వే పనులు తుది దశలో ఉండగా, మూడు గ్రామాల్లో భూ సర్వే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 2027 నాటికి రీ-సర్వే పనులను పూర్తిచేసి రెవెన్యూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపనున్నట్లు వెల్లడించారు.రెవెన్యూ డే సందర్భంగా మాజీ కలెక్టర్ ఎస్.ఆర్. శంకరన్ సేవలను స్మరించుకుంటూ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో శంకరన్ స్ఫూర్తిగా నిలుస్తారని పేర్కొన్నారు.అలాగే ఇటీవల విధి నిర్వహణలో ఉండగా అనారోగ్యంతో మృతి చెందిన గ్రామ రెవెన్యూ అధికారికి రెవెన్యూ సిబ్బంది నివాళులర్పించి, నిమిషం పాటు మౌనం పాటించారు.ఈ సందర్భంగా రెవెన్యూ శాఖలో తమ తమ హోదాల్లో విశిష్ట సేవలు అందించిన నలుగురు సిబ్బందిని ఘనంగా సత్కరించి ప్రశంసించారు. అనంతరం రెవెన్యూ సిబ్బంది తహసీల్దార్ అనిల్ కుమార్ యాదవ్‌ను శాలువాతో సన్మానించారు.కార్యక్రమం చివర్లో జనగణమన గీతాలాపనతో రెవెన్యూ డే వేడుకలు ముగిశాయి. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## బేతంచర్లలో ఘనంగా ఆపరేషన్ క్లీన్ స్వీప్ అవగాహన ర్యాలీ

బేతంచెర్ల జూన్ 20 ( నంది పత్రిక ). కేంద్ర, రాష్ట్ర ప్రభుత్ వాల ఆదేశాల మేరకు మరియు ఉన్నతాధికారులు, జిల్లా అధికారులు ఆదేశాల మేరకు మరియుడోన్ ఎంఎల్ఎ కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి సూచనల మేరకు బేతంచర్ల నగర పంచాయతీ నందు "స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమంలో భాగంగా శనివారం నాడు పారిశుద్ధ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు "మూడో శనివారం" పురస్కరించుకుని, స్థానిక పాత బస్టాండ్ పరిసర ప్రాంతాలలో ఆపరేషన్ క్లీన్ స్వీప్ పై భారీ అవగాహన ర్యాలీని చేపట్టారు.బేతంచెర్ల నగర పంచాయతీ కమిషనర్ డి.హరి ప్రసాద్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ ఘనంగా నిర్వహించడం జరిగింది.

**ఈ సందర్భంగా కమిషనర్ హరిప్రసాద్ మాట్లాడుతూ** పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత.అని అ న్నారు.ఆపరేషన్ క్లీన్ స్వీప్ ద్వారా బేతంచర్లను ప్లాస్టిక్ రహిత, పరిశుభ్ర నగరంగా మార్చడానికి ప్రజలందరూ సహకరించాలన్నారు.ముఖ్యంగా వ్యాపారస్తులు, ప్రజలు చెత్తను రోడ్లపై వేయకుండా, నగర పంచాయతీ వాహనాలకే అందించాలని తెలిపారు అలాగే ఆపరేషన్ క్లీన్ స్వీప్ లో భాగంగా చిన్న హై స్కూల్ ఆవరణంలో చెత్తను తొలగించి మొక్కలు నాటడం జరిగినది.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఆఫీసర్ మెహరున్నిసా బేతంచెర్ల మండల తహసీల్దార్ నాగ రాణి,ఎంపీడీవో ఎం.ఫజుల్ రహమాన్ మరియు ఎంఈఓ గారు, యూపీహెచ్ సి డాక్టర్లు, ఐసీడీసీ సూపర్వైజర్లు, బ్యాంకర్లు మరియు కూటమి నాయకులు, మెప్మా సిబ్బంది, నగర పంచాయతీ కార్యాలయ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు ఆశా వర్కర్లు మరియు స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమంను విజయవంతం చేశారు.




## ఎరువుల కొరత లేకుండా చర్యలు చేపట్టాలి : సిపిఎం




కొత్తపల్లి - నంది పత్రిక : ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రైతులు విత్తనాలు వేసుకునే సమయంలో అవసరమైన ఎరువులు అందుబాటులో లేకపోవడం వలన రైతులు ఇబ్బందులకు పడకుండా వ్యవసాయ శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకొని రైతులకు అవసరమైన యూరియా డిఎపి ఇతర సూక్ష్మ పోషకాల ఎరువులు కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి స్వాములు సీనియర్ నాయకులు ఎస్ సంజీవరాయలు డిమాండ్ చేశారు శనివారం సింగరాజు పల్లె గ్రామంలో జరిగిన సిపిఎం పార్టీ సమావేశంలో వారు మాట్లాడుతూ వ్యవసాయ శాఖ అధికారులు కొత్తపల్లి మండలానికి 124 మెట్రిక్ టన్నులు యూరియా డిఏపి ఇతర ఎరువులు పంపిణీ చేశామని చెబుతున్నప్పటికీ మండలంలోని రైతులు ఎరువుల కొరకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు వ్యవసాయ శాఖ అధికారులు యాప్ ద్వారా రైతులకు యూరియా డిఎపి అందిస్తామని చెబుతున్నప్పటికీ చాలామంది రైతులకు శాంకేతిక కారణాలవల్ల ఎరువులు అందడం లేదు ప్రైవేట్ డీలర్ల షాపులకు రైతులు వెళితే అగ్రికల్చర్ అధికారుల వద్దకు వెళ్ళమని చెప్తున్నారు దుద్యాల ఏదురుపాడు గువ్వలకుంట్ల నందికుంట సచివాలయాల కు ఎరువులు వచ్చినప్పటికీ రైతులకు సరిపడా ఎరువులు అందడం లేదని ఆరోపించారు శివపురం గుమ్మడాపురం ముసలమడుగు ఎర్రమఠం తదితర సచివాలయాలకు ఇంతవరకు ఎరువులు పంపిణీ చేయలేదు గుమ్మడా పురం సచివాలయానికి ఎరువులు వచ్చినప్పటికీ అగ్రికల్చర్ అధికారిని సెలవులో వెళ్లడం వల్ల పంపిణీ జరగలేదు ఒక ఎకరానికి ఒక డీఏపీ రెండు యూరియా బస్తాలు మాత్రమే పంపిణీ చేస్తున్నారని ఇది ఏ మూలకు సరిపోదు అన్నారు కౌలుకు సాగు చేస్తున్న రైతులకు ఎరువులు సరిపోక అనేక ఇబ్బందుల గురవుతున్నారు అన్నారు ఇప్పటికైనా రైతులు ఇబ్బంది పడకుండా సరిపడా ఎరువులను మార్కెట్లో అందుబాటులో ఉంచాలని తెలిపారు చర్యలు లేకపోతే సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో రైతులను సమీకరించి ఎరువుల కొరకు ఆందోళన చేస్తామన్నారు ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎన్ దాసు పి ఏసన్న జి దాసు తదితరులు పాల్గొన్నారు

## ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు రూ 12 వేల రూపాయల విరాళం.




రుద్రవరం ప్రతినిధి జూన్ 20 (నంది పత్రిక): మండల కేంద్రం రుద్రవరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు దాతలు రూ 12 వేల రూపాయలను విరాళంగా అందజేశారు. రుద్రవరంలోని ఉన్నత పాఠశాలలో హెడ్మాస్టర్ గా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ చేసినఆర్ కొత్తపల్లి గ్రామానికి చెందిన విశ్రాంత హెడ్మాస్టర్ దివంగతగంధం రామిరెడ్డి మనవడు ఇండియన్ పెట్రోల్ ఆయిల్ బంక్ ప్రొప్రైటర్ గంధం బ్రహ్మానందరెడ్డి కుమారుడు గంధం యశస్వి రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఉన్నత పాఠశాలలో ఉన్న మెయిన్ గేటు మరమ్మతుల కోసం రూ 12 వేల నగదును ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ వెంకటరమణకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి పరిచేందుకుతమ వంతు సహాయంగా ఈ విరాళాన్ని అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

## మా పెద్దాయన శెట్టిపల్లి. రఘురామిరెడ్డి, కి పుట్టినరోజ శుభాకాంక్షలు,..!!




కడప జూన్ 20:- నంది పత్రిక అలసట లేని బాటసారి... కల్మషం లేని కథానాయకుడు, సేవ గుణంలో సేవకునిగా ప్రజల సమస్యలను పరిష్కరించే పరుశురాముడిగా.. ప్రజా శ్రేయస్సును కోరుకునే ప్రజా నాయకుడిగా. ప్రజలందరి హృదయాల్లో నిలిచే మహోన్నత వ్యక్తి వైసీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్, మరియు మైదుకూరు.నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లి. రఘురామిరెడ్డి, అని ఆయన నేడు, పుట్టినరోజు వేడుకలను ఘనంగా జరుపుకుంటున్న శుభ సందర్భంగా మా పెద్దాయనకు.. నా హృదయపూర్వక శుభాకాంక్షలు, తెలుపుతున్నానని వైసీపీ రాష్ట్ర ఐటీ వింగ్ జాయింట్ సెక్రెటరీ పాలకొలను.లక్ష్మీనారాయణ రెడ్డి, తన ఆనందాన్ని పంచుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ప్రజల శ్రేయస్సు కోసం నిత్యం సమస్యలతో పోరాటం చేస్తూ ప్రజల సమస్యలే తమ సమస్యగా భావించి ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ... ప్రజాక్షేత్రంలో తనకంటూ ప్రత్యేకతను చాటుకొని నిరంతరంగా ప్రజా సేవ చేస్తున్నారని ఇలా చెప్పుకుంటూ పోతే ప్రజల కోసం మరెన్నో సేవా కార్యక్రమాలను నిర్వహించారని ఆయన చేసిన సేవలను కొనియాడారు.. మా పెద్దాయన ఇలాంటి పుట్టినరోజు వేడుకలను మరెన్నో ఘనంగా జరుపుకోవాలని నిండు,నూరేళ్లు సుఖసంతోషాలతో అష్ట ఐశ్వర్యాలతో ఆయురారోగ్యాలతో జీవించాలని మనసారా...శ్రీ వెంకటేశ్వర స్వామి నీ పూజిస్తున్నట్లు ఆయన తెలిపారు.

## సర్ సర్వే లో వైసీపీ బి ఎల్ ఏ..... పి. లక్ష్మి నారాయణ రెడ్డి



ఖాజీపేట నంది పత్రిక జూన్ 20 వైస్సార్ కడప జిల్లా ఖాజీపేట మండలం సిద్ధాంతి పురం గ్రామం లో ూఱ= సర్వే లో భాగంగా జూన్ 20 వ తేదీన బి ఎల్ ఓ సమక్షంలో లో 197 బూత్ లో ఓటర్స్ ప్రక్రియ సజావు గా జరిగేలా ఏ ఒక్కరి ఓట్ గల్లంతు కాకుండా వైసీపీ పార్టీ తమ బి ఎల్ ఏ పి. లక్ష్మి నారాయణ రెడ్డి ఏర్పాటు చేసింది. అందులో భాగంగా 197 వ బూత్ లో సర్వే లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో ఖాజీపేట మండలం సిద్ధాంతి పురం బి ఎల్ ఓ, మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వం రెండు సంవత్సరాలు పూర్తి...



కడప జిల్లా, కమలాపురం మండలం, నంది ప్రతినిధి. జూన్ 20. కుటుంబ ప్రభుత్వం రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కమలాపురంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్న ఎమ్మెల్యే చైతన్య రెడ్డి, ఇన్చార్జివర్యులు పుత్త నరసింహారెడ్డి, జనసేన, బిజెపి, నాయకులు, అధికారులు, కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు. ఈ రెండు సంవత్సరాలు కమలాపురం నియోజకవర్గ మూలో జరిగిన అభివృద్ధి ప్రజలకు వివరించారు.. రాబోయే మూడు సంవత్సరాలలో మరింత అభివృద్ధి చేసి చూపిస్తామని తెలిపారు.

## మాజీ శాసన సభ్యులు , పబ్లిక్ అకౌంట్ కమిటి మాజీ చైర్మెన్, వైయస్సార్ సిపి క్రమశిక్షణ కమిటి చైర్మెన్ ...

**81వ జన్మదిన సందర్భంగా శెట్టిపల్లె. రఘురామిరెడ్డి ని గజమాలతో సన్మానించిన రెడ్యం**

**నిండు నూరేళ్ళ ఆయురారోగ్యాలతో అష్ట ఐశ్వర్యాలతో ఉండాలని శ్రీవేంకటేశ్వరస్వామిని ప్రార్థించిన రెడ్యం .**



ఖాజీపేట నంది పత్రిక ప్రతినిధి జూన్ 20 మైదుకూరు మాజీ శాసన సభ్యుడు, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ మాజీ చేర్మెన్ , వైయస్సార్ సిపీ క్రమ శిక్షణ కమిటి చైర్మన్ శెట్టిపల్లి రఘురామిరెడ్డి 81వ జన్మదినం సందర్భంగా శనివారం మైదుకూరులోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కమలాపురం నియోజకవర్గం పరిశీలకులు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి పట్టుశాలువా కప్పి, గజమాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం శెట్టిపల్లి రఘురామిరెడ్డికి కేక్ ను తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగారెడ్యం మాట్లాడుతూ దాదాపు 60 ఏళ్ళు తన రాజకీయ జీవితంలో మచ్చలేని నేతగా ఉన్నారని... ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, అష్ట ఐశ్వర్యాలతో ఉండాలని కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామిని ప్రార్థించినట్లు రెడ్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు,అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## ఓటర్ల సర్వే పై వైఎస్ఆర్సిపి ఏజెంట్లకు అవగాహన



బండి ఆత్మకూరు నంది పత్రిక జూన్ 20: ఓటర్ల సమగ్ర సర్వేపై వైఎస్ఆర్సిపి ఏజెంట్లకు ఆ పార్టీ నాయకులు అవగాహన కల్పించారు. శనివారం మండల పరిధిలోని గాలి చెన్నయ్యపాలెం, నారాయణపురం చిన్నదేవలా పురం,లింగాపురం, సంత జూటూరు గ్రామాలలోని వైయస్సార్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ అధ్యక్షులు దే రెడ్డి సంజీవరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ బారెడ్డి సంజీవరెడ్డి, శ్రీశైలం నియోజకవర్గ బూత్ లెవెల్ ఏజెంట్లు అధ్యక్షుడు జనార్ధన్ రెడ్డి ఏజెంట్లతో మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న ఎస్ఐఆర్ లో ప్రతి ఓటు నూతనంగా నమోదు చేయడం జరుగుతుందన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని అన్నారు. గతంలో తమకు ఓటు ఉందిలే అన్న విషయంపై నిర్లక్ష్యంగా ఉంటే అది గల్లంతు అయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ప్రతిబిల్ ఏ ఎస్ ఐ ఆర్ పై ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వైయస్సార్ పి సానుభూతిపరుల ఓట్లను ఎక్కువగా తొలగించే పరిస్థితిలు ఉన్నాయి కాబట్టి, ప్రతి కార్యకర్త ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు రాగాల రమణ, సగిలె కృష్ణారెడ్డి, గోపి రెడ్డి వెంకట్ రెడ్డి,భూమా రవి,విష్ణువర్ధన్, శివశంకర్, బలరామిరెడ్డి నరెద్దుల సుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు శాఖమూరి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆగని కుందునది కరకట్ట తవ్వకం

**వరద ముంపున పరివాహక గ్రామాలు**
**జాతీయ రహదారి నిర్మాణానికి**
**కుందునది కరకట్టను యదేచ్ఛగా**
**తవ్వుతున్న రోడ్డు నిర్మాణ కాంట్రాక్టర్**
**అడ్డుకుంటామన్న ప్రజా సంఘాలు**

**బనగానపల్లె జూన్ 20నంది పత్రిక** జమ్మలమడుగు నంద్యాల హై వే రహదారి నిర్మాణానికి రోడ్డు కాంట్రాక్టర్ కుందునది కరకట్టను యాదేచ్ఛగా తవ్వి వాడుతున్నప్పటికీ కుందూనది గ్రామల ప్రజలు ఎవ్వరు అడ్డుచెప్పకపోవడం విస్మయాన్ని కలిగిస్తున్నది. కుందూ నది కి వరద వస్తే పరివాహక గ్రామాలు భీమునిపాడు కంపమల్ల క్రిష్టిపాడు హరివరం పొట్టిపాడు గ్రామాలు మరియు రైతుల పంట పొలాలు జలదిగ్బంధంలో చిక్కుకునే పరిస్థితిలోకి నెట్టబడుతున్నాయి. రాయలసీమ ఎత్తిపోతల పథకం కింద గత ప్రభుత్వము కుందూ నది విస్తరణ పనులు చేపట్టింది ఈ పనులలో నదిని వెడల్పు చేసి నది నుండి తీసిన రాయిని మట్టిని కరకట్టలుగా ఇరువైపులా పోశారు. అయితే కొద్ది నెలల క్రితం మొదలైన జమ్మలమడుగు కల్వకుర్తి జాతీయ రహదారి విస్తరణ పనులలో ఈ కరకట్ట మట్టిని సంబంధిత రోడ్డు కాంట్రాక్టర్ తవ్వుతూ రోడ్డు విస్తరణకు వాడుతున్నారు . నది కింది వరకు ఈ కరకట్ట మట్టిని తవ్వడంతో దిగువనున్న గ్రామాలు రైతుల పొలాలు నీటి ముంపునకు గురయ్యే ప్రమాదం అంచున నిలిచి ఉన్నాయని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఈ రోడ్డు విస్తరణ పనులు మొదలైనప్పటి నుండి కోవెలకుంట్ల జోల ద్వారాసి వద్ద నదికి ఇరువైపులా పోసినటువంటి కరకట్టలను తవ్వి రోడ్డు విస్తరణలో వాడారు. అప్పుడు దీనిపై సంబంధిత ఎస్ ఆర్ బి సి ఇంజనీర్లు గాని కె సి కెనాల్ ఇంజనీర్లు గాని ఏ విధమైనటువంటి చర్యలు తీసుకోకపోవడంతో కాంట్రాక్టర్ అడ్డగోలుగా దోచి రోడ్డు విస్తరణకు వాడారు. ఇప్పుడు భీమునిపాడు గ్రామం దగ్గరగా పోసినటువంటి కరకట్టాలను కూడా టిప్పర్ల ద్వారా తొలి రోడ్డు విస్తరణకు వాడుతున్నారు దీంతో వర్షాకాలంలో కుందునది ఉగ్రరూపం దాలిస్తే ఈ గ్రామాలు ఏమవుతాయని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. వానాకాలంలో వరద వస్తే నదిలో మూడు టీఎంసీల దాక నీరు ప్రవహించిన సందర్భాలు ఉన్నాయి కుందూ నది విస్తరణలో ఈ గ్రామాలు ముంపునకు గురికాకుండా ఇరువైపులా కరకట్టలను పోయడం జరిగినది . అయితే ఇప్పుడు ఈ కరకట్టలను నది అడుగుభాగం వరకు త్రవ్వి ఖాళీ చేయడంతో వరద సమయంలో నీరంతా సమీప గ్రామాలను ముంచేత్తే అవకాశం ఉందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

**గతంలో తవ్వకాలను అడ్డుకున్న ప్రజా సంఘాలు**

కుందునది కరకట్టలను రోడ్డు విస్తరణకు వాడడం వల్ల వరద సమయంలో నది నీరంతా సమీప గ్రామాలను ముంచేత్తే అవకాశం ఉందని కట్టను తవ్వడం ఆపాలని కోవెలకుంట్ల ప్రజా సంఘాల నాయకులు వాహనాలను అడ్డుకొని నిరసన చేశారు. దింతో కొంతకాలం కట్టను తవ్వడం ఆపిన కాంట్రాక్టర్ ఇప్పుడు మరలా యధావిధిగా కట్టను తవ్వి రోడ్డుకు వాడుతున్నాడు. కుందూ మట్టిని వాడుకున్నందుకు కోవెలకుంట్లను దత్తత తీసుకొని అభివృద్ధి చేయాలి .. సీపీఎం సుధాకర్ కుందూ మట్టిని రోడ్డు నిర్మాణానికి వాడుతు కోట్లు వెనకేసుకుంటున్న కాంట్రాక్టర్ ఆడబ్బును కోవెలకుంట్ల అభివృద్ధి కి ఉపయెగించాలని సీపీఎం సుధాకర్ డిమాండ్ చేశారు. ఇప్పుడు సిమెంట్ ఫ్యాక్టరీలు నాపరాయి గనులను లీజుకు తీసుకున్నందుకు ఆయా పరిధిలోని గ్రామాలను అభివృద్ధి చేస్తున్నాయని అదేవిదంగా అనాదిగా కోవెలకుంట్ల కు సంబందించిన కుందూ మట్టిని వాడుతున్న కాంట్రాక్టర్ నిధులను ఉపయేగించి కోవెలకుంట్ల అభివృద్ధికి ఉపయెగించాలని కోరారు . లేని పక్షంలో వాహనాలను అడ్డుకుంటామని హెచ్చరించారు.

# ఉక్కు కర్మాగార నిర్మాణ పనులకు త్వరలో ముహూర్తం..!





**జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి**
**లిజేఎస్ డబ్ల్యూ గ్రూప్స్ ప్రతినిధులతో**
**కలిసి స్థల పరిశీలన**

**జమ్మలమడుగు, బ్యూరో చీఫ్ జూన్ 20 నంది పత్రిక** : రాయలసీమ ప్రజల కల నెరవేర్చే దిశగా.. అతి త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో ఉక్కు పరిశ్రమ నిర్మాణ పనుల ప్రారంభానికి రంగం సిద్ధం చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు.జమ్మలమడుగు నియోజకవర్గ పరిధిలోని సున్నపురాళ్ళ పల్లె వద్ద జేఎస్ డబ్ల్యూ గ్రూప్స్ ఆధ్వర్యంలో ఉక్కుకర్మాగారం నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టనున్న ప్రాంతాన్ని.. శనివారం జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి... జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, ఆ కంపెనీ ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జమ్మలమడుగు నియోజకవర్గం సున్నపురాళ్లపల్లెలో.. ఈ ప్రాంతవాసుల కలను సాకారం చేసే దిశగా అతి త్వరలోనే ఉక్కు కర్మాగార నిర్మాణం తొలిదశ నిర్మాణ పనులకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టనుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఉక్కు పరిశ్రమ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసే దిశగా ఏర్పాట్లను చేపడుతున్నట్లు తెలిపారు. సంబంధిత సన్నాహక ఏర్పాట్లలో భాగంగా.. ముఖ్యమంత్రి రాక కోసం ప్లాంట్ సైట్ ప్రాంతంలోని హెలిపాడ్ల స్థితిగతులను, ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన అన్ని రకాల మౌలిక సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు తదితర అంశాలకు సంబంధించి జిల్లా ఎస్పీ, జేఎస్ డబ్ల్యూ యాజమాన్య ప్రతినిధులు, సంబందిత అధికారులతో సమీక్షించడం జరిగిందన్నారు. ఈ కర్మాగారం నిర్మాణం కార్యరూపం దాల్చితే.. జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహం అందివ్వడం, వేలాది మంది యువతకు మెండైన ఉపాధి, ఉద్యోగ అవకాశాలు అందనున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జేఎస్డబ్ల్యు స్టీల్స్ ప్లాంట్ హెడ్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రాజేష్ పూరి, బిజినెస్ హెడ్ వైస్ ప్రెసిడెంట్ యోగేష్ బేడీ, టెక్నీకల్ హెడ్ పురుషోత్తం ప్రసాద్, లైజనింగ్ కార్పోరేట్ హెడ్ కనకరావు, హెచ్ఆర్ హెడ్ ఏ. సుదర్శన్, ప్రాజెక్టు హెడ్ షేక్ నూరుల్, ఆర్డీవో శిరీష, ఎపి ఐఐసి జెడ్ఎం శ్రీనివాస మూర్తి, ఇండస్ట్రీస్ జీఎం చాంద్ బాషా, రెవెన్యూ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.





## పోరుమామిళ్లలో ఘనంగా ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం..

# మెరిసిన ప్రతిభకు నగదు ప్రోత్సాహకాలు




**పోరుమామిళ్ల, జూన్ 20: (నంది పత్రిక )** పోరుమామిళ్ల మండలం కమ్మవారిపల్లెలోని ఎస్‌పీఎస్ ఫంక్షన్ హాల్‌లో శనివారం ప్రతిభా పురస్కారాల ప్రధానోత్సవం ఘనంగా నిర్వహించబడింది. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి పోరుమామిళ్ల మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 10వ తరగతి చదివి, మార్చి-2026లో నిర్వహించిన ఎస్ఎస్‌సీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఎన్ఆర్ఐ సభాధ్యక్షులుగా గుండెబోయిన శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కడప జిల్లా విద్యాశాఖాధికారి డా. షంషుద్దీన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అలాగే మండల విద్యాశాఖాధికారులు ఎం. ఓబులేసు, ఎ. కొండశెట్టి, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గడ్డం వెంకటరమణయ్య, కమలమ్మ దంపతులు తమ తల్లిదండ్రులు చిన్నవెంకటయ్య, సుబ్బారావు జ్ఞాపకార్థం ఈ పురస్కారాలను ఏర్పాటు చేశారు. ఇందులో ప్రథమ బహుమతిగా రూ.7,116, ద్వితీయ బహుమతిగా రూ.5,116, తృతీయ బహుమతిగా రూ.3,116 చొప్పున విద్యార్థులకు ప్రదానం చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఈవో డా. షంషుద్దీన్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. నైతిక విలువలు, గురువుల ప్రాధాన్యత, తల్లిదండ్రుల బాధ్యతలపై విద్యార్థులకు, తల్లిదండ్రులకు విలువైన సందేశాలు అందించారు. అలాగే ఈ ప్రతిభా పురస్కారాలను అందజేస్తున్న గడ్డం వెంకటరమణయ్య, కమలమ్మ దంపతుల సేవలను కొనియాడుతూ, ఈ ప్రాంత ప్రజలు వారికి రుణపడి ఉంటారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఏ సెక్టోరియల్ అధికారులు టి. విజయభాస్కర్, వి. జాఫర్, మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# అందరి సహకారంతోనే నగర పరిశుభ్రత సాధ్యం

**జిల్లా కలెక్టర్, నగరపాలక ప్రత్యేక అధికారిణి డాక్టర్ ఏ. సిరి**
**కలెక్టరేట్ ప్రాంగణంలో స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం**
**పారిశుద్ధ్యంపై ప్రజల్లో అవగాహన పెరగాలి**
**వీధుల్లో వ్యర్థాలు వేస్తే జరిమానా తప్పదు**



**నంది పత్రిక కర్నూలు బ్యూరో :** ప్రజలందరి సహకారంతోనే నగర పరిశుభ్రత సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్, నగరపాలక ప్రత్యేక అధికారిణి డాక్టర్ ఏ. సిరి పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ ప్రాంగణంలో కలెక్టర్, కమిషనర్ చల్లా ఓబులేసుతో కలిసి స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ప్రజలు, ఉద్యోగులచే స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గత నాలుగు వారాలుగా వివిధ అంశాలతో ఆపరేషన్ క్లీన్ స్వీప్ ప్రత్యేక కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశామని, ఇది ప్రత్యేక డ్రైవ్‌గా కాకుండా నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందన్నారు. పారిశుద్ధ్యంపై ప్రజల్లో అవగాహన పెరగాలని, చెత్తను ఎక్కడబడితే అక్కడ వేయకుండా తడి, పొడి, హానికరమైన, ప్రత్యేకమైన వ్యర్థాలను వేర్వేరుగా చేసి మున్సిపల్ వాహనాలకే అప్పగించడం విధిగా భావించాలని సూచించారు. పర్యావరణానికి హాని కలిగించే వ్యక్తులకు జరిమానాలు విధించే అధికారాలను దేశ అత్యున్నత న్యాయస్థానం కలెక్టర్లకు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఎవరైనా బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే జరిమానా విధిస్తామని స్పష్టం చేశారు. కమిషనర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆపరేషన్ క్లీన్ స్వీప్ పేరుతో గత నాలుగు వారాలుగా ప్రతి శనివారం ప్రత్యేక థీమ్‌తో స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. రహదారులు, జంక్షన్లు, రెడ్-యెల్లో స్పాట్ల శుభ్రత, కాలువలు, డ్రైన్లు, వీధుల పరిశుభ్రత, వ్యర్థాల వర్గీకరణపై అవగాహన, మార్కెట్లు, వాణిజ్య ప్రాంతాల పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టామన్నారు. చివరి వారంలో ప్రజా మరుగుదొడ్ల పరిశుభ్రత, చెత్త పేరుకుపోయిన ప్రాంతాల శుభ్రత పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. నగర శుభ్రత కోసం ప్రభుత్వం, నగరపాలక సంస్థ, పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న కృషిని ప్రజలు గుర్తించి సహకరించాలని కమిషనర్ కోరారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం. రఘు, సానిటరీ సూపర్వైజర్ రమేష్ బాబు, డీఈఈలు పవన్ కుమార్ రెడ్డి, కృష్ణలత, ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు, ఎంటమాలజిస్ట్ సత్యనారాయణ, స్వచ్ఛ సర్వేక్షణ్ కోఆర్డినేటర్లు శ్రీనివాసులు, జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర లో మంత్రి బీసీ



**బనగానపల్లె జూన్ 20నందిపత్రిక** బనగానపల్లె పాత పోలిసుస్టేషన్ దగ్గర శనివారం జరిగిన స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం లో రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఆలోచనల మేరకు స్వర్ణాంధ్ర 2047 లక్ష్యంగా ప్రతి 3 వ శనివారం రాష్ట్ర వ్యాప్తంగా స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని గత ప్రభుత్వ పాలనకు నేటి పాలనుకున్న తేడాను ప్రజలు గమనించాలని మంత్రి ఆదర్శ ప్రభుత్వ పాలనను వివరించారు. చిన్నారులు విద్యార్థులు ప్లాస్టిక్ పై తమ తల్లిదండ్రులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు చెత్త సేకరణకు బండ్లు వస్తున్నప్పటికీ రోడ్లపై చెత్త వేయడం సరైనది కాదు.నా సతీమణి బీసీ ఇందిరమ్మ బనగానపల్లె పట్టణంలో 3 నెలలు పాటు ఇంటింటికి తిరిగి ప్లాస్టిక్ పై అవగాహన కల్పిస్తే 70 - 80% ప్లాస్టిక్ నివారించగలిగాం.చెత్త నిర్వహణ కోసం రూ. 65 లక్షలతో కాంపాక్ట్ మిషన్ ఏర్పాటు చేయడంతో పాటు, 5 కిలోమీటర్ల దూరంలో డంపింగ్ యార్డ్ కూడా ఏర్పాటు చేశాం నేడు మన జీవితంలో ప్రతి దశలో భాగమైన ప్లాస్టిక్ ను నివారించేందుకు అందరం కలిసికట్టుగా పని చేయాలన్నారు.ప్రజల్లో ఈ కార్యక్రమంపై మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.



# ఓటర్ల జాబితా ఖచ్చితంగా ఉండేలా ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్వహణ

### కర్నూలు జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి

**నంది పత్రిక కర్నూలు బ్యూరో :** ఓటర్ల జాబితా మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా ఉండేలా చేపడుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను నిర్వహించడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి తెలిపారు. శనివారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో నిర్వహించిన ప్రెస్ కాన్ఫరెన్స్ లో కలెక్టర్ ఎస్ఐఆర్ పై మాట్లాడారు. కర్నూలు జిల్లాలో అత్యధిక శాతం ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను సజావుగా పూర్తి చేయగలిగామని, ఎస్ఐఆర్ ఒక నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని పేర్కొన్నారు. సెప్టెంబర్ నెల తర్వాత కూడా తదుపరి దశల ప్రక్రియ కొనసాగించే అవకాశం ఉందన్నారు. ఇప్పటివరకు ఓటర్ల మ్యాపింగ్‌ను సమర్థవంతంగా నిర్వహించామని, అనంతర చర్యలను నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం చేపడతామని కలెక్టర్ తెలిపారు. కేవలం బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) మాత్రమే కాకుండా రాజకీయ పార్టీలకు చెందిన బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) కూడా సహకరిస్తే ఎస్ఐఆర్ ప్రక్రియ మరింత వేగంగా, సులభంగా పూర్తవుతుందన్నారు. ఎన్యూమరేషన్ ఫారమ్‌ల పంపిణీ సమయంలో ఓటర్లు తమ తాజా ఫొటోను జతచేసి, అవసరమైన వివరాలను పూర్తిగా నింపి సంబంధిత బీఎల్‌వోలకు తిరిగి అందజేయాలని సూచించారు. ఒక వ్యక్తికి రెండు ప్రాంతాల్లో ఓటు హక్కు ఉంటే, చట్టపరంగా ఒకే చోట మాత్రమే ఓటు హక్కును వినియోగించుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఓటరు తనకు అనుకూలమైన ప్రదేశాన్ని ఎంపిక చేసుకుని అక్కడే ఓటు హక్కును కొనసాగించేందుకు అవసరమైన వివరాలు అందించాలని సూచించారు. కర్నూలు జిల్లాలో ఉపాధి, ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లే వారు ఎక్కువగా ఉన్నప్పటికీ, ఓటర్ల హక్కులను ఎక్కడా తొలగించడం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్యూమరేషన్ ఫారమ్ అందించిన తర్వాత 15 రోజుల వరకు సమయం ఇస్తామని, ఆ గడువులో ఫారమ్ అందకపోతే సంబంధిత ఓటరును పిలిచి విచారణ నిర్వహించి, తగిన అవకాశం ఇవ్వడం జరుగుతుందన్నారు. అనవసరంగా ఓట్ల తొలగింపు లేదా కొత్తగా అక్రమంగా ఓటర్ల నమోదుకు ఎలాంటి అవకాశం లేదని స్పష్టం చేశారు. ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియలో ఇంటిపేరు, తల్లి పేరు, తాత పేరు, చిరునామా వంటి వివరాలను ఆధారంగా తీసుకుని ఖచ్చితమైన ధృవీకరణ చేపడుతున్నామని తెలిపారు. మ్యాపింగ్ పూర్తి చేయలేని ఓటర్లకు మళ్లీ ఎన్యూమరేషన్ ఫారమ్‌లు అందించి మరోసారి పరిశీలన నిర్వహిస్తామని చెప్పారు. రెండు చోట్ల ఓటు హక్కు ఉన్న వారి వివరాలను భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) వెబ్‌సైట్‌లోని డెమోగ్రాఫిక్ ఆధారిత పరిశీలన ద్వారా గుర్తిస్తున్నామని, సంబంధిత ఓటరే తాను ఎక్కడ ఓటు హక్కు కొనసాగించాలనుకుంటున్నారో నిర్ణయించుకునే అవకాశం కల్పిస్తున్నామని వివరించారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ఎలాంటి అపోహలు అవసరం లేదని, ఇది ఎన్నికల సంఘం నిరంతరంగా నిర్వహించే సాధారణ ప్రక్రియలో భాగమని తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారమ్‌ల సేకరణ పూర్తయిన తర్వాత ముసాయిదా ఓటర్ల జాబితాను (డ్రాఫ్ట్ పబ్లికేషన్) విడుదల చేసి, అభ్యంతరాలు, సూచనలకు అవకాశం కల్పిస్తామని చెప్పారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు, బూత్ లెవల్ ఏజెంట్లు, బీఎల్‌వోలు పరస్పర సహకారంతో పనిచేస్తే ఎస్ఐఆర్ ప్రక్రియను మరింత సమర్ధవంతంగా పూర్తి చేయవచ్చని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.



## 80% అంగ వైకల్య సర్టిఫికెట్ ఉన్నా పించను ఇవ్వడం లేదన్న బాధితుడు రాజు.



**బేతంచెర్ల జూన్ 20 ( నందిపత్రిక )** బేతంచెర్ల పట్టణం లో ని కోటపేటకు చెందిన రాజు (వయసు 40 సం.లు). మధుమేహం వ్యాధి కారణంగా రెండేళ్ల క్రితం ఎడమ చేయి పూర్తిగా కోల్పోయాడు. మెడికల్ ఆఫీసర్ పరీక్షించి 80% అంగ వైకల్య సర్టిఫికెట్ ఉన్నా కూడా,ఇప్పటికీ ఆయనకు వికలాంగుల పెన్షన్ మంజూరు కాలేదు. చేయి కోల్పోవడంతో రాజు ఎలాంటి కూలి పనికీ వెళ్లలేని స్థితిలో ఉన్నాడు. కుటుంబ భారం మొత్తం భార్య భుజాలపై పడింది. ఆమె కూలి పని చేస్తూ, వచ్చే కూలీతోనే భర్తకు మందులు కొనడం, ఇంటి ఖర్చులు భరించడం చేస్తోంది. ఆర్థిక పరిస్థితి రోజు రోజుకూ దిగజారుతుండడంతో కుటుంబం గడవడం చాలా కష్టంగా మారింది. పెన్షన్ కోసం పలుమార్లు అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో దంపతులు తీవ్ర ఆవేదన చెందు తున్నారు.కనీసం నెలకు వచ్చే పెన్షన్ అయినా ఉంటే మందులకు, పూట గడవడానికి ఉపయోగ పడుతుంది అని వారు చెబుతున్నారు. 80% వైకల్యం ఉన్న రాజుకు వెంటనే వికలాంగుల పెన్షన్ మంజూరు చేసి ఆదుకోవాలని దంపతులు ప్రభుత్వ అధికారులను వేడుకుంటున్నారు. అనేక సార్లు అధికారుల చుట్టు తిరుగుతునే ఉన్నామని వారు మీ సేవాకేంద్రం దగ్గరి పోండి అంటే, మీసేవ కేంద్రాల చుట్టూ తిరిగినా మాకు ఎటువంటి న్యాయం జరుగ లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.ఆన్‌లైన్ వెబ్ సైట్ ఓపెన్ చేసి అర్హులైన రాజుకు పెన్షన్ మంజూరు చేయాలని వారు అధికారులను కోరు తున్నారు.

## అన్నదాత సుఖీభవ' నిధులు విడుదల.

### రైతన్నలకు కూటమి ప్రభుత్వం అండ: ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి



**వెలుగోడు, జూన్ 20 (నందిపత్రిక):** ఎన్నికల నాటి సూపర్ సిక్స్ హామీలను నెరవేరుస్తూ ఎన్డీయే కూటమి ప్రభుత్వం రైతాంగానికి పెద్దపీట వేస్తోందని శ్రీశైలం నియోజకవర్గ శాసనసభ్యులు బుడ్డా రాజశేఖర రెడ్డి పేర్కొన్నారు. శనివారం వెలుగోడు పట్టణంలోని తెలుగు గంగ అతిథి గృహం వద్ద నిర్వహించిన "అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్" 2026-27 ఆర్థిక సంవత్సరపు నాలుగవ విడత నిధుల విడుదల మహోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే ప్రజాప్రతినిధులు, రైతు నాయకులతో కలిసి నిధుల విడుదలకు సంబంధించిన భారీ నమూనా చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఏడాదికి రూ. 20,000 ఆర్థిక సాయం.. నేడు నాలుగవ విడత జమ ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం రైతన్నల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని స్పష్టం చేశారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ప్రవేశపెట్టిన "అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్" పథకం ద్వారా ప్రతి రైతు కుటుంబానికి ఏడాదికి రూ. 20,000/- చొప్పున పెట్టుబడి సహాయాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే నేడు నాలుగవ విడత నిధుల విడుదల సందర్భంగా ఒక్కో రైతు ఖాతాలో రూ. 7,000/- ల చొప్పున ప్రభుత్వం నేరుగా నగదు జమ చేసిందని వివరించారు. నిరంతరాయంగా రైతులకు పెట్టుబడి సాయం అందిస్తూ ప్రభుత్వం తన నమ్మకాన్ని నిలబెట్టుకుందని ఆయన పేర్కొన్నారు.రైతులతో ఎమ్మెల్యే ముఖాముఖి ఆధునిక వ్యవసాయంపై కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే గారు స్థానిక రైతన్నలతో మమేకమై వారి సమస్యలను, సాగు వివరాలను అడిగి తెలుసుకున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అలవర్చుకోవాలని, తద్వారా తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించవచ్చని సూచించారు. పంటలకు మెరుగైన మార్కెటింగ్ సదుపాయాలు కల్పించేందుకు, సాగునీటి భద్రతను పటిష్టం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అలాగే రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, భూసారాన్ని కాపాడే ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు మొగ్గు చూపాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వెలుగోడు మండలానికి చెందిన ఎన్డీయే కూటమి నాయకులు, వివిధ గ్రామాలకు చెందిన రైతు ప్రతినిధులు, అధికారులు మరియు పెద్ద సంఖ్యలో రైతన్నలు పాల్గొన్నారు. నాలుగవ విడత సాయం కూడా సకాలంలో అందడం పట్ల స్థానిక రైతులు హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి, ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి గారికి కృతజ్ఞతలు తెలిపారు.

## మార్కెట్ యార్డు దుకాణాల బహిరంగ వేలంలో 4దుకానాలను దక్కించుకున్న గోళ్ళ రాజేష్ సేవా సమితి సభ్యులు..







**నంద్యాల నియోజకవర్గ ప్రజలకు మరింత సేవ చేసేదిశలోనే 4దుకానాల వినియోగించనున్నాము..సమన్వయకర్త సీనియర్ రిపోర్టర్ నూర్ భాషా గోళ్ళ రాజేష్ కు పూలమాలలు, శాలువాలులతో ఘణంగా సత్కరించి సంతోషం వ్యక్తం చేసిన మీడియా మిత్రులు..**

**నంద్యాల సిటీ బ్యూరో జూన్ 20 ( నంది పత్రిక )** పట్టణంలోని టేక్కే వ్యవసాయ మార్కెట్ యార్డ్ కు సంబంధించిన పది దుకాణాలకు రెండవ విడత బహిరంగ వేలంపాట నిర్వహించారు. మార్కెట్ యార్డు జే.డి. ఆంజనేయులు సమక్షంలో మార్కెట్ యార్డ్ గుంటుపల్లి హరిబాబు అధ్యక్షతన కమిటీ సభ్యులు, అదికారులతో పాటు వేలంపాటలో పలువురు వ్యాపారస్తులు వేలం పాటలో పాల్గొన్నారు. ఈ నేపద్యంలో నంద్యాల వాసి అయిన గోళ్ళ రాజేష్ సేవా సమితి సభ్యులు మరొకసారి రెండో విడత నిర్వహించిన బహిరంగ వేలం పాటలో వ్యవసాయ మార్కెట్ యార్డు కు సంబంధించిన నాలుగు దుకాణాలను వేలంపాటలో దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల వాసి అయిన ప్రముఖ వ్యాపారవేత్త సామాజికవేత్త గోళ్ళ రాజేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియా మిత్రులు పెద్ద ఎత్తున గోళ్ళ రాజేష్ పై అభిమానంతో పూలమాలలు శాలువాలతో ఘనంగా సత్కరించి తమ ప్రేమను చాటుకుని అభినందనలు తెలియజేశారు. మీడియా మిత్రులు ఈ సందర్భంగా గోళ్ళ రాజేష్ తనమీద ఇంత అభిమానం చూపిస్తున్న మీడియా మిత్రులు అందరికీ కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలియజేశారు గోళ్ళ రాజేష్ ఇలాగే ఎల్లప్పుడూ మీడియా మిత్రులందరి ప్రేమాభిమానాలు తనమీద ఇలాగే కలిగి ఉండాలని ఎల్లప్పుడూ కూడా మీడియా మిత్రులు అందరికీ మరింత సేవ చేసేందుకు ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటానని గోళ్ళ రాజేష్ వారితో మాట్లాడటం జరిగింది. ఈ కార్యక్రమంలో గోళ్ళ రాజేష్ కార్య నిర్వాహకులు సమన్వయకర్త సీనియర్ రిపోర్టర్ నూర్ భాషా మాట్లాడుతూ నంద్యాల నియోజకవర్గ ప్రజలందరికీ గోళ్ల రాజేష్ మూడు సంవత్సరాలకుపైగా ఇప్పటివరకు ఎన్నో రకాల సేవ,

సహాయ,ఆర్థిక,సహకారాలు అందిస్తూ వస్తున్నారని అదేవిధంగా విలేకరులకు అందరికి కూడా తన వంతు సహాయంగా గౌరవ ఆర్థిక సహకారం అందిస్తున్నారని ఇలా రానున్న రోజుల్లో మరిన్ని సేవా సహాయ సహకారాలు అందించేందుకు ప్రజలకు సహాయం చేసేందుకు మరింత చేరువయ్యేలా ఉండాలని ఉద్దేశంతో మార్కెట్ యార్డ్ రెండవ విడత బహిరంగ వేళల్లో నాలుగు దుకాణాలు దక్కించుకున్నట్టు ఈ నాలుగు దుకాణాలను కూడా వ్యాపారాలకోసం కాకుండా నంద్యాల నియోజకవర్గ ప్రజలకు సేవ చేసేలా ఈ దుకాణాలను రానున్న రోజుల్లో వినియోగించుకోబోతున్నామని తెలిపారు. అదే విధంగా నంద్యాల నియోజకవర్గ ప్రజలందరూ కూడా గోళ్ళ రాజేష్ ని ఎప్పుడు ఆదరిస్తూ తమ ప్రేమాభిమానాలను అందిస్తూ ఆశీర్వదాన్ని అందిస్తూ ఉండాలని ఈ సందర్భంగా నూర్ భాషా తెలిపారు.

## స్వర్గధామం వైకుంఠ రథం కోసం పదిలక్షలు సహాయం చేసిన గోళ్ళ రాజేష్



**నంద్యాల ప్రతినిధి. జూన్ 20. (నంది పత్రిక ):** నంద్యాలలో భీమవరం రాస్తాలో మరియు బస్టాండ్ దగ్గర నంద్యాల నవనిర్మాణ సమితి నిర్వహిస్తున్న రెండు హిందూ స్మశాన వాటికలను స్వర్గధామం" అన్న పేరుతో పది సంవత్సరాల నుంచి జీర్ణోద్ధరరణ చేసి నిర్వహణ చేస్తున్న విషయం మీకు అందరికీ తెలుసు. అందులో మానవతా సంస్థ వాళ్ళు ఇచ్చిన వైకుంఠ రథం ఒకటే ఉన్నది. నంద్యాల చుట్టుపక్కన 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న పల్లెటూర్లకు కూడా ఫ్రీజర్ బాక్స్, వైకుంఠ రథం సేవలను పెంపొందించుటకు మేము అడగగానే స్పందించి మృతి చెందిన ప్రతి హిందువు యొక్క ఆత్మను భగవంతునిలో పంచభూతాలలోఐక్యమయ్యేటువంటి స్వర్గధామానికి రెండవ వైకుంఠ రథం ఇవ్వడానికి ముందుకు వచ్చి వెంటనే స్పందించి పది లక్షల రూపాయల చెక్కును మధుమణి నర్సింగ్ హోమ్ నందు స్వర్గధామం సభ్యులకు అందచేయడం జరిగింది.గోళ్ళ రాజేష్ విశాల హృదయానికి, సమాజ సేవకు, నిష్కలంకమైన హృదయానికి నిదర్శనం. గోళ్ళ రాజేష్ చేస్తున్నటువంటి ఈ సేవా కార్యక్రమానికి నంద్యాల నవనిర్మాణ సమితి సభ్యులు అందరం కూడా కృతజ్ఞతాపూర్వక ధన్యవాదాలు చెబుతున్నారు. ఈ సమావేశంలో స్వర్గధామం అధ్యక్షులు డాక్టర్ మధుసూదనరావు,ఉపాధ్యక్షులు రాజశేఖర్ , ఉపాధ్యక్షులు శేషుబాబు, కార్యదర్శి గెలివి రామకృష్ణ , ట్రెజరర్ కశెట్టి కృష్ణమూర్తి, ద్వారకా వసంతు, షణ్ముఖ శ్రీనివాస్ ఇంకా స్వర్గధామం సేవకులు కూడా పాల్గొనడం జరిగింది.

## ఉపాధి కూలీలకు "శక్తి యాప్" పై అవగాహన: ఆత్మకూరు శక్తి టీం.

**వెలుగోడు, జూన్ 20 (నందిపత్రిక):** మహిళల రక్షణే ధ్యేయంగా నంద్యాల జిల్లా ఎస్పీ గారి ఆదేశాల మేరకు, ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్ ఉత్తర్వులతో శనివారం వెలుగోడు గ్రామ శివార్లలో ఉపాధి హామీ కూలీలకు "శక్తి యాప్" మరియు శాంతిభద్రతలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆత్మకూరు రూరల్ సీఐ సురేష్ కుమార్ రెడ్డి, వెలుగోడు ఎస్ఐ సురేష్ పర్యవేక్షణలో ఆత్మకూరు శక్తి టీం సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ షేక్ నూర్ అహమ్మద్, ఉమెన్ హోం గార్డ్ సుప్రియ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.వెలుగోడు ఏపీఓ నాగజ్యోతి అనుమతితో, గ్రామ పంచాయతీ కార్యదర్శి నరేంద్ర, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఉపాధి హామీ కరువు పనులకు వచ్చిన మహిళా కూలీలకు రక్షణ చట్టాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.శక్తి యాప్ మహిళలకు శ్రీరామరక్ష ఈ సందర్భంగా శక్తి టీం సిబ్బంది మాట్లాడుతూ... ఆపదలో ఉన్న మహిళల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా "శక్తి యాప్"ను తీసుకువచ్చిందని తెలిపారు. స్మార్ట్‌ఫోన్ ఉన్న ప్రతి ఒక్కరూ ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచిస్తూ, అక్కడికక్కడే కూలీల మొబైల్స్‌లో యాప్‌ను డౌన్‌లోడ్ చేయించి, దాని పనితీరును వివరించారు. అత్యవసర సమయాల్లో శక్తి యాప్ వాట్సాప్ నంబర్ 7993485111 కు సమాచారం అందించాలన్నారు. అలాగే ఉమెన్ వెల్ఫేర్ నంబర్ 181, ఎమర్జెన్సీ నంబర్లు 112, 100 ల ప్రాముఖ్యతను, 'వన్ స్టాప్ సెంటర్' సేవలను కూలీలకు వివరించారు.బాల్య వివాహాలు నిరసిద్దాం.. సైబర్ నేరాలపై అప్రమత్తతఆడపిల్లలకు 18 సంవత్సరాల లోపు పెళ్లిళ్లు చేయడం చట్టరీత్యా నేరమని, బాల్య వివాహాలు మరియు చిన్నపిల్లలపై జరిగే నేరాల నిరోధానికి పోక్సో చట్టం ఉందన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1098 లేదా 112 కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు.ప్రస్తుత రోజుల్లో పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వాట్సాప్‌లలో వచ్చే తెలియని లింకులు, నకిలీ ఏపీకే ఫైల్స్ ఓపెన్ చేసి ఆర్థికంగా నష్టపోవద్దని హెచ్చరించారు. మోసపోయిన బాధితులు వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1930 కు ఫిర్యాదు చేయాలన్నారు. **రోడ్డు భద్రత హెల్మెట్ తప్పనిసరి** మైనర్ పిల్లలకు (టీనేజ్) ఎట్టి పరిస్థితుల్లోనూ మోటార్ సైకిళ్లు ఇవ్వద్దని తల్లిదండ్రులకు స్పష్టం చేశారు. పురుషులు వాహనాలు నడిపేటప్పుడు ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలని, రోడ్డు ప్రమాదాల్లో నూటికి 90 శాతం మంది తలకు తీవ్ర గాయాలు కావడం వల్లే మరణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా మద్యం తాగి వాహనాలు నడిపితే కోర్టు ద్వారా రూ. 10,000/- జరిమానా లేదా జైలు శిక్ష విధిస్తారని హెచ్చరించారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఉపాధి హామీ కూలీలు, మేట్లు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## కూటమి ప్రభుత్వంలో పోలీసులు రాజకీయ తొత్తులుగా మారారు... వైసీపీ లీగల్ సెల్



**నంద్యాల సిటీ బ్యూరో జూన్ 20 ( నంది పత్రిక )** రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం లో పోలీసులు రాజకీయ తొత్తులుగా మారారని నంద్యాల లీగల్ సెల్ నాయకులు సంచలన వ్యాక్యలు చేశారు. శనివారం నంద్యాలలోని స్థానిక వైసీపీ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ లీగల్ సెల్ ప్రతినిధుల సమావేశం నిర్వహించడం జరిగింది. సమావేశంలో నంద్యాల జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు రామసుబ్బయ్య, నంద్యాల అధ్యక్షుడు ప్రతాప్రెడ్డి, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ శ్రీనివాసులు స్టేట్ అఫీషియల్ స్పోక్స్ పర్సన్ తిమ్మారెడ్డి, ఆర్టీఏ నంద్యాల అసెంబ్లీ వింగ్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, గ్రీవెన్స్ సెల్ అసెంబ్లీ అధ్యక్షుడు వివేకానందరెడ్డి, జిల్లా జనరల్ సెక్రటరీ జగన్ మోహన్ రెడ్డి, సాయిరాం రెడ్డి, మదాని, సోహేల్ రాణా, ద్వారకానాథ్, శరత్, రామాంజనే యులు, వసంత్ రెడ్డి, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నంద్యాల వైసీపీ లీగల్ సెల్ నాయకులు మాట్లాడుతూ...రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో అరాచకాలు, దౌర్జన్యాలు, సోషల్ మీడియా ఆక్టివిస్టపై వైసీపీ నాయకులు, కార్యకర్తలపై అనవరస కేసులు నమోదు చేస్తు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. సమాజంలో పోలీసుల పాత్ర అత్యంత ప్రధానమైనదని, అయితే నేడు కూటమి ప్రభుత్వంలో వారు రాజకీయతొత్తులుగా మారారని సంచల వ్యాక్యలు చేశారు. ఇటీవల కృష్ణలంక పోలీస్ స్టేషన్ లో కృష్ణవంశీ అనే యువకున్ని లాకప్ డెత్ జరిగిన ఘటన రాష్ట్రంలో సంచలనంగా మారింది. పోలీసుల చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వెళ్లి మృతుని కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి కృష్ణ వంశీ లాకప్ డెత్ గురించి తెలుసుకోవడం జరిగిందని అంతవరకు కనీసం స్పందించని పోలీసులు నేడు కృష్ణలంక సీఐపై కేసు నమోదు చేశారన్నారు. పోలీసు వ్యవస్థ రాష్ట్రంలో నిర్వీర్య అయ్యిందని విమర్శించారు. రాష్ట్రంలో మంత్రులు ఉన్నా అందరిని కేవలం మంత్రి లోకేష్ నియంత్రించడం జరుగుతుందని వారు పేరుకు మాత్రమే మంత్రులన్నారు. జూనియర్ న్యాయవాధుల విషయంలో నాడు వైసీపీ ప్రభుత్వం 5వేల రూపాయలను ఇవ్వడం జరిగిందని, అయితే ఎన్నికల సందర్భంగా జూనియర్ న్యాయవాధులకు నెలకు 10వేల రూపాయలు ఇస్తానని నమ్మించి నేటికి ఇవ్వలేదని మోసం చేశారని విమర్శించారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన వాగ్ధానాలను హామీలను నెరవేర్చలేదని పేర్కొన్నారు. డీఎస్సీ నియామకాల్లో మోసాలు, రైతులకు అన్యాయం చేశారని పేర్కొన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం లేదని కేవలం వైసీపీ నాయకులను, కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేయడమే పనిగా పెట్టుకున్నారని ఎద్దేవాచేశారు. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తున్నదని విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని వారు డిమాండ్ చేశారు.

# మున్సిపల్ రంగంలో ప్రవేట్రీకరణను ఉపసంహరించాలి.

## -సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వై ఎల్లయ్య.



**బేతంచెర్ల జూన్ 20 (నంది పత్రిక )** మున్సిపాలిటీ రంగంలో ప్రైవేటీకరణ ను ఉప సంహరించుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వై.ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో సిఐటియు ఉపాధ్యక్షులు బి. రామాంజనేయులు అధ్యక్షతన నిరసన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం మున్సిపల్ రంగంలో ప్రైవేటీకరణలు అమలు చేయాలన్న దుర్మార్గమైన ఆలోచన చేయడం సరైంది కాదని వారన్నారు. సమాజాన్ని శు భ్రపరచడంలో మున్సిపల్ రంగంలో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ కార్మికులు, వాటర్ మెన్లు, ఎలక్ట్రిక్ సిటీ వివిధ రకాలుగా విధులు నిర్వహిస్తున్న కార్మికులందరూ మున్సిపల్ రంగాన్ని ప్రైవేటు పరం చేస్తే తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉందని వారి ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వర్తించక పోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారని అన్నారు. మున్సిపల్ కార్మికులకు పదవీ విరమణ 62 సంవత్సరాలు పెంచి, హెల్త్ కార్డులు మంజూరు చేయాలని అన్నారు. అంతే గాకుండా గ్రాడ్యుటీ రిటైర్మెంట్ బెనిఫిట్స్ తో పాటు,ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను మున్సిపల్ కార్మికులు అందరికీ వర్తింప చేసే విధంగా ప్రభుత్వం జీవోలు జారీ చేయాలని కోరారు. ప్రభుత్వ ఇప్పటికైనా స్పందించి మున్సిపల్ కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో సిఐటియు ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమ పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం నగర పంచాయతీ కమీషనర్ డి.హరిప్రసాద్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు నాగరాజు, సుధాకర్, రంగడు, వెంకటలక్ష్మి, పద్మావతి , మద్దమ్మ, మరియమ్మ, మహేశ్వరి, లక్ష్మీదేవి, సులోచన, ఎల్లమ్మ, ఇందిరమ్మ, చెన్నయ్య, రామాంజనేయులు, చంటి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత...

## ఏఈ రాజశేఖర్.

**రుద్రవరం ప్రతినిధి జూన్ 20 (నంది పత్రిక):** నేడు రుద్రవరం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏ ఈ రాజశేఖర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూరుద్రవరం సబ్ స్టేషన్ క్రింద ఉన్న రైతులకు తెలియజేయడం ఏమనగా 21 వ తేదిన 3 వ ఆదివారం కనుక రుద్రవరం సబ్ స్టేషన్ మెయింటనెన్స్ కలదు కావున ఉదయం 09-00 గంటల నుండి మధ్యాహ్నం 01-00 గంటల వరకు సప్లై ఉండదు .కావున ప్రజలు సహకరించవలసినదిగా కోరడమైనది, అలాగే త్రీ ఫేస్ సప్లై టైం ని కూడా చేంజ్ చేయడం జరిగినది టైం 03-00 టు 09-00 :- 06-00 గంటలు మిగిలిన మూడు గంటల సప్లై షట్ డౌన్ పూర్తి అయిపోయిన తరువాత సప్లై ఇవ్వడం జరుగుతుందని ఏఈ తెలిపారు.

# మాల మహానాడు కడప జిల్లా అధ్యక్షుడిగా జక్కుల కిరణ్ నియామకం



**బద్వేల్, జూన్ 20:( నంది పత్రిక)**మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేష్ శనివారం కడప జిల్లాలో పర్యటించి, సంస్థ కడప జిల్లా అధ్యక్షుడిగా జక్కుల కిరణ్‌ను అధికారికంగా నియమించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులు, దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పన, ఎస్సీ సబ్ ప్లాన్ నిధుల వినియోగం వంటి కీలక అంశాలపై ఆయన మాట్లాడారు.అలాగే ఈ నెల 22వ తేదీన పోరుమామిళ్లలో నిర్వహించనున్న మాలల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని జిల్లా వ్యాప్తంగా నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.నూతన జిల్లా అధ్యక్షుడు జక్కుల కిరణ్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సంస్థ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గుండె నగేష్, రాష్ట్ర కార్యదర్శి సంపత్, పోరుమామిళ్ల జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి మోతపోతుల విజయరాజు, మోటపోతుల యోహాను తదితరులు పాల్గొన్నారు.

# హరినగరం పాఠశాలలో విద్యార్థులే భోజనం వడ్డిస్తున్న వైనం

## నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఏజెన్సీ, ఉపాధ్యాయులు



**రుద్రవరం ప్రతినిధి జూన్ 20 (నంది పత్రిక):** ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం హరినగరం ప్రాథమిక పాఠశాలలో అపహాస్యపాలవుతోంది. పాఠశాలలో ఉన్న 59 మంది విద్యార్థులకు నిబంధనల ప్రకారం వంట ఏజెన్సీ నిర్వాహకులే భోజనం వడ్డించాల్సి ఉండగా, శనివారం ఏజెన్సీ సిబ్బంది తక్కువగా ఉన్నారనే సాకుతో ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయుల సమక్షంలోనే చిన్నపిల్లలచే వేడి వేడి భోజనం, కూరలను వడ్డించడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది. ప్రభుత్వ లక్ష్యానికి విరుద్ధంగా ఏజెన్సీల నిర్లక్ష్యం ఒకవైపు, దీనిని కట్టడి చేయాల్సిన ఉపాధ్యాయుల బాధ్యతారాహిత్యం మరోవైపు ఉండటంతో, ప్రతిరోజూ విద్యార్థులే పనిభారాన్ని మోయాల్సి వస్తుందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వేడి భోజనంతో పిల్లలకు ప్రమాదం జరిగే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్న తల్లిదండ్రులు, అధికారులు తక్షణమే స్పందించి ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చూడాలని కోరుతున్నారు.

# రైతులు ఉద్యానవన పంటలు సాగు చేయాలి.



**రుద్రవరం ప్రతినిధి జూన్ 20 (నంది పత్రిక):** రైతులు సంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా, మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న ఉద్యాన పంటల సాగు వైపు అడుగులు వేయాలని నంద్యాల జిల్లా ఉద్యానశాఖ అధికారి యు. నాగరాజు పిలుపునిచ్చారు. శనివారం ఆయన ఉద్యాన అధికారి దస్తగిరి సిబ్బందితో కలిసి ఆలమూరు , మిట్టపల్లి గ్రామాల్లో పర్యటించి, అక్కడ సాగవుతున్న ఆయిల్ పామ్, అరటి, నేరేడు తోటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన రైతుల సాగు పద్ధతులను అడిగి తెలుసుకుని, నాణ్యమైన దిగుబడుల కోసం పలు సూచనలు చేశారు. అనంతరం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్యాక్ హౌస్ యూనిట్లను ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా జిల్లా అధికారి యు. నాగరాజు మాట్లాడుతూ:లిలి ఆయిల్ పామ్, నేరేడు సాగుతో స్థిరమైన ఆదాయం.. ప్రస్తుతం మార్కెట్‌లో ఆయిల్ పామ్ మరియు నేరేడు పంటలకు దేశీయంగా మంచి డిమాండ్ ఉందన్నారు. ప్రభుత్వ రాయితీలను సద్వినియోగం చేసుకుంటూ ఈ పంటలను సాగు చేయడం ద్వారా రైతులు దీర్ఘకాలికంగా స్థిరమైన రాబడిని పొందవచ్చని పేర్కొన్నారు. ప్యాక్ హౌస్, కోల్డ్ స్టోరేజ్ ప్రాధాన్యత:కోత కోసిన తర్వాత పంట దెబ్బతినకుండా ఉండేందుకు ప్యాక్ హౌస్‌లు, కోల్డ్ స్టోరేజ్ (శీతల గిడ్డంగులు) ఎంతో కీలకంగా మారాయన్నారు. వీటి ద్వారా పంట కాలపరిమితిని పెంచి, మార్కెట్‌లో సరైన ధర వచ్చే వరకు నిల్వ ఉంచుకునే వీలుంటుందని తెలిపారు. వాల్యూ అడిషన్ (విలువ జోడింపు) ఎంతో ముఖ్యం:ఉద్యాన పంటలలో 'వాల్యూ అడిషన్' ప్రాధాన్యతను రైతులు గుర్తించాలన్నారు. నేరేడు వంటి పండ్లను నేరుగా తక్కువ ధరకు అమ్ముకోకుండా.. పల్ప్, జెల్లీలు, లేదా ప్యాకేజ్డ్ జ్యూస్‌లుగా మార్చడం ద్వారా లేదా గ్రేడింగ్, బ్రాండింగ్ చేయడం ద్వారా నాలుగింతలు ఎక్కువ లాభాలను ఆర్జించవచ్చని స్పష్టం చేశారు.



# రంగసముద్రం రెడ్డినగర్‌లో నూతన గృహ ప్రవేశం ఘనంగా నిర్వహణ



**పోరుమామిళ్ల, జూన్ 20: (నంది పత్రిక )**పోరుమామిళ్ల మండలం రంగసముద్రం గ్రామపంచాయతీ పరిధిలోని రెడ్డినగర్‌లో గాజులపల్లి భాస్కర్ రెడ్డి, రాజేశ్వరి నూతనంగా నిర్మించిన గృహంలో శనివారం గృహ ప్రవేశ మహోత్సవం, శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జున రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరై కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి, గృహ యజమానులు అతిథులకు సత్కారం చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సాంబశివాయ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నోటు పుస్తకాల పంపిణీ

**మర్రిపాడు జూన్ 20నంది పత్రిక :** సాంబశివ చారిటబుల్ ట్రస్ట్,ఆత్మకూరు వారి ఆధ్వర్యంలో నిత్యాన్నదాత కంచి పరమేశ్వర్ రెడ్డి దాతృత్వంతో మర్రిపాడు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి ఐదవ తరగతి వరకు చదువుతున్న రెండు వేల మందికి పైగా విద్యార్థులకు దాదాపు 5 లక్షల రూపాయలు విలువైన ఉచిత నోటు పుస్తకాలను పంపిణీ చేయడం జరిగింది.ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి తిరుపతయ్య మాట్లాడుతూ ఆత్మకూరు ప్రాంత ప్రజలకు కంచి పరమేశ్వర్ రెడ్డి చేస్తున్న సేవలు నిరూపమానమైనవని,మెట్ట ప్రాంతమైన మర్రిపాడు మండల విద్యార్థులకు చేయూతనివ్వాలనే సదుద్దేశంతో ఉచితంగా నోటు పుస్తకాలను పంపిణీ చేయడం అభినందనీయమని,వారి సేవలను ఘనంగా కొనియాడారు.కంచి పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ విద్య ద్వారానే మంచి సమాజాన్ని నిర్మించగలమని,విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు.ముఖ్యఅతిథిగా విచ్చేసిన తహసిల్దార్ అనిల్ కుమార్ మాట్లాడుతూ ఆత్మకూరు ప్రాంత ప్రజలకు కంచి పరమేశ్వర్ రెడ్డి చేస్తున్న సేవా కార్యక్రమాలు వెలకట్టలేనివని,అన్నదాతగా,విద్యాప్రదాతగా ప్రజల గుండెల్లో చిరుస్థాయిగా నిలిచిపోతారని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి-2 ధనలక్ష్మి,ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పద్మలత, మారుతి కేశవ్ కుమార్ రెడ్డి,మస్తాన్, శ్రీనివాసులు,సుబ్బారెడ్డి,సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు నరసింహారెడ్డి,కొల్లా వెంకటేశ్వర్లు,వెలిశెట్టి నారాయణరావు,రాంపల్లి ప్రసాద్ రెడ్డి,మహేశ్వరరెడ్డి,ఈశ్వర్,రాజేంద్ర కుమార్,ఉపాధ్యాయులు,విద్యార్థులు,తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా 'స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమం: ప్రతిజ్ఞ చేసిన అధికారులు, ప్రజలు.



**వెలుగోడు, జూన్ 20 (నందిపత్రిక):** పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్య భారతే లక్ష్యంగా శనివారం వెలుగోడు గ్రామ పంచాయతీ కార్యాలయం నందు 'స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. వెలుగోడు గ్రామ పంచాయతీ అధికారి మల్లి నరేంద్ర ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం విజయవంతంగా సాగింది.అంబేద్కర్ విగ్రహం నుండి పొట్టి శ్రీరాములు సెంటర్ వరకు భారీ ర్యాలీ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు తొలుత భారీ ర్యాలీని నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీ ముఖ్య వీధుల గుండా సాగుతూ పొట్టి శ్రీరాములు సెంటర్ వరకు చేరుకుంది. స్వచ్ఛత యొక్క ప్రాముఖ్యతను చాటిచెప్పేలా నినాదాలు చేస్తూ సాగిన ఈ ర్యాలీలో అధికారులు, ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం పొట్టి శ్రీరాములు సెంటర్ వద్ద సమకూడిన అధికారులు, సచివాలయ సిబ్బంది మరియు గ్రామ ప్రజలందరితో కలిసి 'స్వచ్ఛ ఆంధ్ర' ప్రతిజ్ఞ చేయించారు. మన గ్రామాన్ని, పరిసరాలను నిరంతరం శుభ్రంగా ఉంచుకుంటామని అందరూ ఒకే తాటిపై ప్రమాణం చేశారు.ఈ ప్రత్యేక అవేర్నెస్ కార్యక్రమంలో వెలుగోడు మండల పరిషత్ అభివృద్ధి అధికారి మధుసూదన్ రెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో గంధం మురారి, చాంద్, గ్రామ ప్రత్యేక అధికారి స్వాతి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.వీరితో పాటు వెలుగోడు సచివాలయ సిబ్బంది, గ్రామ పంచాయతీ సిబ్బంది, వార్డు ప్రతినిధులు మరియు స్థానిక గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

# అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బుడ్డా



**బండి ఆత్మకూరు నంది పత్రిక జూన్ 20:** వెలుగోడు మండల కేంద్రంలో శనివారం అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ కింద 5827 మంది రైతులకు విడుదలైన మూడు కోట్ల 96 లక్షల రూపాయల చెక్కును విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులతో ఎమ్మెల్యే చర్చించారు. కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందని ఎమ్మెల్యే బుడ్డా పేర్కొన్నారు. సూపర్ సిక్స్ హామీలో భాగంగా కేంద్ర ప్రభుత్వం సహకారంతో అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ కింద రైతులకు ఆర్థిక సహాయాన్ని అందజేయడం జరిగిందని అన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన ఆర్థిక సాయం నేరుగా రైతు ఖాతాలోకి జమవుతుందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

**బండి ఆత్మకూరులో** బండిఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ అధ్యక్షతన అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ మొదటి విడత పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. సొంత భూమి కలిగిన 7690 మంది రైతు కుటుంబాలకు మరియు ఆర్ఓఎఫ్ ఆర్ భూమి కలిగిన 44 మంది సాగుదారులకు ఐదు కోట్ల 32 లక్షల రూపాయలు విడుదల అయిందని చెప్పారు. ఈ నగదు పంట కాలంలో పెట్టుబడి సాయం కొరకు సాగుదారులకు మద్దతు ఇవ్వడానికి మూడు వాయిదాలలో రైతు కుటుంబానికి సంవత్సరానికి 20వేల రూపాయల ఆర్థిక సాయం ప్రభుత్వము అందిస్తుందని తెలిపారు. అర్హత కలిగిన అన్ని రైతు కుటుంబాలకు మరియు ఆర్ ఓ ఎఫ్ ఆర్ భూమి షాపుదారులకు మొదటి విడుదల 5000 రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా, పీఎం కిసాన్ పథకం కేంద్ర ప్రభుత్వం ద్వారా రెండు వేల రూపాయలు కలిపి మొత్తం 7000 రూపాయలు రైతుల ఖాతాలకు విడుదలైన తెలిపారు. మండల సిరిసిల్ల ఆఫీసర్ లీలావతి మాట్లాడుతూ రానున్న ఎల్ నైనో పరిస్థితుల్లో రైతులు ప్రత్యామ్నాయంగా చిరుధాన్యాలైన పెసర మినుము పంటలు వేసుకోవాలని తెలిపారు. అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ ద్వారా మంజూరైన ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గాయత్రి తో పాటు పలు గ్రామాలకు చెందిన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆంజనేయ స్వామి ఆలయంలో మంత్రి ప్రత్యేక పూజలు

## కార్యాలయాల పునరుద్ధరణ పనులను పరిశీలించిన మంత్రి



**బనగానపల్లె జూన్ 20నందిపత్రిక** స్థానిక ఎల్ ఐ సి కార్యాలయం దగ్గరలో ఉన్న ఆంజనేయ స్వామి ఆలయంలో మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి శనివారం ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం ఆలయంను నూతనంగా పునరుద్ధరణ చేసే పనులుపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఆలయ ప్రాంగణం మొత్తం పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.అనంతరం బనగానపల్లె పట్టణంలో కొనసాగుతున్న పాత తహసీల్దార్ (ప్రస్తుత ఆర్డీఓ) కార్యాలయం పునరుద్ధరణ పనులను పరిశీలించారు ఈ సందర్భంగా కార్యాలయ ముఖద్వారంపై పలు డిజైన్లను అధికారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.డిజైన్లు పరిశీలించిన అనంతరం అధికారులకు మంత్రి పలు సూచనలు చేశారు.త్వరితగతిన ఈ పనులు పూర్తి చేసి కార్యాలయంను ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని మంత్రి అన్నారు.



## వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసేందుకే సహకారం

### ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ



**ఆళ్లగడ్డ ప్రతినిధి జూన్ 20, నంది పత్రిక** రైతుల ఆదాయాన్ని పెంచేదిశగా ప్రభుత్వం పనిచేస్తుందని, అలాగే వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అన్నదాత సుఖీభవ ద్వారా సహకారం అందిస్తుందని ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ తెలిపారు. శనివారం ఆళ్లగడ్డ పట్టణంలోని మార్కెట్ యార్డ్ లో అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ 2026-27 సంవత్సరానికి గాను మొదటి విడత 7 వేల రూపాయలు రైతుల ఖాతాలో జమ చేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ హాజరై ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని ఆరు మండలాల 42,981 మంది రైతులకు 29 కోట్ల 10 లక్షల రూపాయలు రైతుల ఖాతాలో జమ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రైతే దేశానికి వెన్నెముక అని, రైతుల అభ్యున్నతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. రైతుల సంక్షేమం కోసం ఎన్డీఏ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, రైతులకు పెట్టుబడి సాయం, సాగునీరు, మద్దతు ధరలు, వ్యవసాయానికి అవసరమైన సౌకర్యాల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి యువ నాయకుడు భూమా విఖ్యాత రెడ్డి మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీహరి గోపాల్, ఎ డి ఎ విజయశేఖర్, ఎంపిడిఓ నూర్జహాన్, ఎమ్మార్వో జ్యోతి రత్నకుమారి, ఎంపీడీవో నూర్జహాన్ బేగం ,మండల వ్యవసాయ అధికారి కిషోర్ కుమార్ రెడ్డి, ఆళ్లగడ్డ మండల కన్వీనర్ హరికుమార్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ హుస్సేన్ భాష కృష్ణాపురం టీడీపీ నాయకులు శివారెడ్డి, రఘు రామిరెడ్డి, మర్రి పల్లె పాపిరెడ్డి ,ఇతర మండల వ్యవసాయ అధికారులు, నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



## బాలికలకు బాల్యవివాహ నిరోధక చట్టంపై అవగాహన



**ఆళ్లగడ్డ ప్రతినిధి జూన్ 20 నంది పత్రిక** ఆళ్లగడ్డ పట్టణంలోని బాలిక ఉన్నత పాఠశాలలో బాలికలకు జిల్లా నోడల్ అధికారి ఉమామహేశ్వరమ్మ పాల్గొని చట్టాలు తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు మంగళవారం నాడు జరిగిన కార్యక్రమానికి నోడల్ అధికారి ఉమామహేశ్వరమ్మ పాల్గొని బాలికలకు హెల్ప్ లైన్ నంబర్లపై అవగాహన కల్పించి వాటిని గురించి వివరంగా వివరించారు. అలాగే బాల్య వివాహాల నిరోధక చట్టం పై తదితర వాటిపై అవగాహన కల్పించారు బాలికలు చదువులో మంచి ఉన్నత చదువు చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చే విధంగా బాలికలు ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ దస్తగిరిమ్మ తదితరులు పాల్గొన్నారు.




## ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ పై జీడిమెట్లలో పోలీసు సిబ్బందికి అవగాహన సదస్సు

కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలోని నాలుగు పోలీస్ స్టేషన్ల సిబ్బంది, హోంగార్డులకు ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ పై శనివారం జీడిమెట్ల ఇండస్ట్రియల్ అసోసియేషన్ బిల్డింగ్‌లో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ ఫైనాన్షియల్ అడ్వైజర్ కౌశిక్ మరిడి ముఖ్య వక్తగా హాజరై సిబ్బందికి మార్గనిర్దేశం చేశారు. నెలవారీ వేతనంలో పొదుపు పాటించాల్సిన విధానాలు, పొదుపు చేసిన మొత్తాన్ని సురక్షితంగా ఇన్వెస్ట్ చేసే మార్గాలు, దీర్ఘకాలిక ఆర్థిక సమృద్ధి సాధించే పద్ధతులపై పీ పి టి ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

## విస్తృతంగా మొక్కలునాటే కార్యక్రమము

**పర్యావరణ పరిరక్షణలో భాగంగా క్షేత్రంలో విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమము**

**ఈ వర్షాకాలంలో ఐదు వేల మొక్కలు నాటాలని నిర్ణయం**

**మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న ధర్మకర్తల మండలి**



**శ్రీశైలం జూన్ 20(నంది పత్రిక)** ఈ వర్షాకాలం ముగిసేలోగా క్షేత్రపరిధిలో పలుచోట్ల ఐదువేల మొక్కలు నాటాలని నిర్ణయించినట్లు ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీ పోతుగుంట రమేష్‌నాయుడు పేర్కొన్నారు. స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో (20.06.2026) మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టబడింది. ఈ కార్యక్రమములో ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీ పోతుగుంట రమేష్‌నాయుడు, కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి సభ్యులు మరియు ధర్మకర్తల మండలి ప్రత్యేక ఆహ్వానితులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధర్మకర్తల మండలి అధ్యక్షులు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా క్షేత్రపరిధిలో విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టబడిందన్నారు. వలయ రహదారికి ఇరువైపులా మరిన్ని మొక్కలు నాటడం జరుగుతుందన్నారు. అదేవిధంగా ఆరుబయలు ప్రదేశాలలో, దేవస్థానం ఉద్యానవనాలలో మొక్కలను విస్తృతంగా నాటాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. అవసరమైనచోట్ల నాటిన మొక్కలకు ట్రిగార్డ్లు ఏర్పాటు చేయబడుతాయన్నారు. అనంతరం కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావు మాట్లాడుతూ నాటిన చెట్ల సంరక్షణపట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరుగుతుందన్నారు. దేవస్థానం ఉద్యానవనాలలో మరిన్ని సుందరీకరణ మొక్కలను నాటడం జరుగుతుందన్నారు. ఆరుబయలు ప్రదేశాలలో నీడనిచ్చే మొక్కలను నాటడం జరుగుతుందన్నారు. కార్యక్రమములో పాల్గొన్న పలువురు ధర్మకర్తల మండలి వారు మాట్లాడుతూ క్షేత్రంలో మరింత ఆధ్యాత్మికత కల్పించేందుకు అనువైన చోట్ల దేవతా వృక్షాలను నాటాలని పేర్కొన్నారు. నాటిన మొక్కలలో 30 నుంచి 40శాతం దాకా దేవతా వృక్షాలు ఉండాలని సూచించారు. కాగా ఈ రోజు సంప్రదాయబద్ధంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించబడింది. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని సంకల్పపూర్వకంగా గణపతిపూజ నిర్వహించబడింది. తరువాత వృక్షపూజలు నిర్వహించి మొక్కలను నాటడం జరిగింది. కదంబం, తెల్లమద్ది, బాదం, బాహునియా,టుబుబియా రోజియా, స్పెతోడియా మొదలైన మొక్కలు నాటబడ్డాయి. కార్యక్రమములో శ్రీస్వామివారి ప్రధానార్చకులు మరియు ధర్మకర్తల మండలి ఎక్స్ అఫిషియో సభ్యులు హెచ్. వీరయ్యస్వామి, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీరు పి. మురళీబాలకృష్ణ, ప్రజాసంబంధాల అధికారి టి. శ్రీనివాసరావు, ఉద్యానవన అధికారి ఎస్. లోకేష్, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.



## విద్యార్థి దశ నుండే స్వచ్ఛతపై అవగాహన కల్పించాలి.



**తిరుపతి బ్యూరో చీఫ్ జూన్ 20 నంది పత్రిక** విద్యార్థి దశ నుండే పిల్లలకు స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తే భవిష్యత్తులో ఉత్తమ ఫలితాలు సాధించే అవకాశం ఉందని ప్రముఖులు తెలిపారు. స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్రలో భాగంగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఉపాధ్యాయుల నగర్ నందు పారిశుధ్యం పై నిర్వహించిన అవగాహన ర్యాలీలో రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, హస్త కళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ హరి ప్రసాద్, డిప్యూటీ కమిషనర్ అమరయ్య తదితరులు పాల్గొని పరిసరాలను శుభ్రం చేశారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు శుభ్రంగా ఉండాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో ప్రతి మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అందరూ ఆరోగ్యాకరంగా ఉండాలనే సదుద్దేశ్యంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాల్లో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఇటువంటి బృహత్తర కార్యక్రమాలను స్వచ్ఛతపై పాఠశాల స్థాయి నుండే పిల్లలను అవగాహన కల్పిస్తే భావి తరాలను పరిశుభ్రమైన వాతావరణం అందించిన వారం అవుతామని అన్నారు. పాఠశాల స్థాయిలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తే పర్యావరణ పరిరక్షణకు ఎంతో మేలు చేసినట్లు అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం లో సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యామ్ సుందర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, మునిసిపల్ ఇంజనీర్ తులసి కుమార్, డిసిపీ దేవి కుమారి, డి. ఈ. లు ప్రసాద్, మహేష్, రాజు, శానిటరీ సూపర్ వైజర్లు చెంచయ్య, సుమతి, అధికారులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, పాల్గొన్నారు.



## బాలయ్య పల్లె పాఠశాలలో ఆహ్లాదకరంగా "నో బ్యాగ్ డే "

**-రంగు కాగితాలతో పండ్లు తయారీ**

**-జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు ఖాసీం వల్లి**




**కాశినాయన జూన్ 20:( నంది పత్రిక)** కాశినాయన మండలంలోని బాలాయపల్లె ప్రాథమిక పాఠశాలలో శనివారం "నో బ్యాగ్ డే "సందర్భంగా విద్యార్థులు రంగు కాగితాలతో వివిధ రకాల కాగితపు పండ్లను చాలా ఆకర్షణీయంగా తయారు చేశారు. విద్యార్థులందరూ ఉత్సాహంగా పాల్గొని తమకు నచ్చిన వివిధ పండ్ల బొమ్మలను రంగు కాగితాలతో తయారుచేసి ప్రదర్శించారు. ఈ సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఖాసిం వల్లి మాట్లాడుతూ... విద్యార్థులు పుస్తకాలకే పరిమితం కాకుండా వారంలో ఒకరోజు ఇలాంటి వినూత్న కార్యక్రమాలలో పాల్గొనడం ద్వారా వారిలో అంతర్గతంగా దాగి ఉన్న "సృజన"కు పదును పెట్టవచ్చన్నారు . అంతేకాకుండా జట్టులో కలిసి పనిచేయడం ద్వారా "స్నేహభావం" ఏర్పడి "కలిసి నేర్చుకోవడం" జరుగుతుందన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పల్లా దస్తగిరి బాబు మాట్లాడుతూ... ఎన్.ఈ.పీ 2020లో భాగంగా ఈ కార్యక్రమం జరుగుతోందని,విద్యార్థులను చూస్తుంటే చాలా సంతోషంగా ఉందన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో ఉత్సాహం పెరగడమే గాక ఊహా శక్తి వికాసం కూడా జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం..మంత్రి బీసీ

**అన్నదాత సుఖీభవ నిధుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి**




**కోవెలకుంట్ల జూన్ 20నందిపత్రిక** శనివారం కోవెలకుంట్ల పట్టణం ఇందిరా ఫంక్షన్ సమావేశ భవనంలో లో అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ 2026-27 మొదటి విడత నిధుల విడుదల పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి వర్చువల్ గా విక్షించారు. అంతకుముందు కోవెలకుంట్ల కు విచ్చేసిన మంత్రి బీసీ జనార్దన్ రెడ్డికి ఘనస్వాగతం పలికిన రైతులు, స్థానికప్రజలు, కూటమి పార్టీ నేతలు కార్యకర్తలు. ఈ సందర్భంగా రైతు సోదరులు ఏర్పాటుచేసిన స్టాల్స్ ను మంత్రి పరిశీలించారు అనంతరం రైతులకు అన్నదాత సుఖీభవ నిధులు పంపిణీ చేసిన మంత్రి. అదేవిదంగా రైతులకు ఖరీఫ్ సీజన్ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా రైతులకు యూరియా ఎరువులు బుక్ చేసుకునే యాప్ పై మంత్రి అవగాహన కల్పించారు.

**మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ** రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వంలో పెద్దపీట వేసిందని సీఎం చంద్రబాబు నాయకత్వంలో అన్నదాత సుఖీభవ రైతులకు ఆర్థికంగా అండగా నిలుస్తుందని చెప్పారు. పథకం కింద నంద్యాల జిల్లాలో 2.06 లక్షల మంది రైతులకు రూ.139.41 కోట్ల ఆర్థిక సహాయం అందుచున్నదని ఇందులో రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.103.03 కోట్లు, కేంద్ర ప్రభుత్వం తరపున రూ.36.39 కోట్లు అందించబడుతుందని అన్నారు. పథకం కింద బనగానపల్లె నియోజకవర్గంలోని 40,664 మంది రైతులకు అందనున్న రూ.27.41 కోట్లు ఆర్థిక సహాయం అందగా అన్నదాతకు అండగా ప్రభుత్వం.. అర్హుడైన ప్రతి రైతుకు ఏడాదికి రూ.20 వేల ఆర్థిక భరోసా అందిస్తుందని అన్నారు. పథకం తొలి విడతలో కేంద్ర ప్రభుత్వం నుంచి రూ. 2 వేలు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ. 5 వేలు చొప్పున మొత్తం రూ.7 వేల చొప్పున ప్రతి రైతుకు లబ్ధి చేకూరుతుందని రైతుల ఆదాయాన్ని పెంచడం, సాగు ఖర్చులను తగ్గించడం, వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చడం లక్ష్యంగా అన్నదాత సుఖీభవ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నాం అని అన్నారు.



## శిల్పారామంలో అలరించిన కర్ణాటక గాత్ర కచేరి, కూచిపూడి నృత్య ప్రదర్శనలు

మాదాపూర్ లోని శిల్పారామంలో శనివారం వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా కర్ణాటక గాత్ర కచేరి, కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఎంతగానో అలరించాయి. టెక్సాస్, యుఎస్ నుండి విచ్చేసిన కుమారి శిరీష కోటంరాజు గాత్ర కచేరి అందరిని అలరించింది. అన్నయ్య సంకీర్తనలు, త్యాగరాజ కృతులు, రామదాసు కీర్తనలు ఆలపించి మెప్పించారు. అమ్రితా సింగ్ శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలో మూషిక వాహన, బ్రహ్మాంజలి, వసంత స్వరజతి, బృందావన నిలయ, ధనశ్రీ తిల్లాన, వచ్చెను అలిమేలు మంగ, అంబాష్టకం, కొలువైతివారంగా సాయి, కుంతలారావాలీ తిల్లాన అంశాలను ప్రదర్శించి కళాకారులూ సాహితి, మోహన, సాత్విక, షనాయా, గగన మొదలైన వారు ప్రదర్శించి మెప్పించారు.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com

# స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు






**స్వచ్ఛ ఆంధ్రతో పరిశుభ్రత.. యోగాంధ్రతో ఆరోగ్యవంతమైన సమాజం**

**పరిశుభ్రమైన పరిసరాలు - ఆరోగ్యకర జీవనానికి యోగా అవసరం**

**జిల్లావ్యాప్తంగా 4,600 కేంద్రాల్లో యోగాంధ్రకు విస్తృత ఏర్పాట్లు**

**యోగాంధ్ర-2026ను విజయవంతం చేయాలి : కలెక్టర్ రాజకుమారి గణియా**

**నంద్యాల బ్యూరో, జూన్ 20(నంది పత్రిక):-** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమంలో భాగంగా శనివారం నంద్యాల పట్టణంలోని రైల్వే స్టేషన్ పరిసరాలు, ప్రధాన వీధులు, ప్రజా ప్రదేశాల్లో నిర్వహించిన పారిశుద్ధ్య కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బైరెడ్డి శబరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు స్వయంగా పరిశుభ్రత కార్యక్రమాల్లో పాల్గొని ప్రజల్లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ గత ఏడాది జనవరిలో ప్రారంభమైన "స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమం జిల్లాలో నిరంతరంగా కొనసాగుతోందని తెలిపారు. పరిశుభ్రమైన పరిసరాల నిర్మాణంలో ప్రతి పౌరుడి భాగస్వామ్యం అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించడం, ప్రజా ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తోడ్పడాలని ప్రజలకు సూచించారు. రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లోని కాలువలు పూడికతో నిండిపోవడం వల్ల పారిశుద్ధ్య సమస్యలు తలెత్తుతున్నాయని గుర్తించి, వాటి పరిష్కారానికి మున్సిపల్ మరియు రైల్వే శాఖల సమన్వయంతో ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కాలువల పూడికతీత పనులు, అవసరమైన చోట్ల స్లాబ్‌ల ఏర్పాటు, అదనపు డస్ట్‌బిన్‌ల ఏర్పాటు ద్వారా పరిశుభ్ర వాతావరణాన్ని కల్పించనున్నట్లు వెల్లడించారు. నంద్యాల మున్సిపాలిటీలో గత నాలుగు వారాలుగా చేపడుతున్న "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమం ద్వారా పేరుకుపోయిన పాత చెత్త (లెగసీ వేస్ట్)ను పూర్తిగా తొలగించి, వ్యర్థాలను వర్గీకరించి కంపోస్టింగ్ యూనిట్లు, బయోడైజెస్టర్ ప్లాంట్లకు తరలించి సేంద్రియ ఎరువులుగా మార్చే చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ వివరించారు. ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా నంద్యాలను మరింత పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా, ఆరోగ్యవంతమైన నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిరోధించడంతో పాటు రోడ్లపై చెత్త వేయకుండా పరిశుభ్రతను జీవనశైలిలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛత కార్యక్రమాలు ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాకుండా ప్రతి పౌరుడి సామాజిక బాధ్యతగా భావించి స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని కోరారు. యోగాంధ్ర-2026ను విజయవంతం చేయాలి. అనంతరం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం నిర్వహించనున్న యోగాంధ్ర-2026 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. జిల్లావ్యాప్తంగా సుమారు 4,600 కేంద్రాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు.

గ్రామాలు, వార్డులు, మండల కేంద్రాలు, జిల్లా కేంద్రాల్లో ఒకేసారి యోగా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. జిల్లాలో ఇప్పటికే సుమారు నాలుగు లక్షల మంది యోగాంధ్ర కార్యక్రమాల్లో పాల్గొనేందుకు నమోదు చేసుకోవడం విశేషమని పేర్కొన్నారు. యోగా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించే అద్భుత సాధనమని, దీనిని కేవలం ఒక రోజు కార్యక్రమంగా కాకుండా ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన యోగా సంప్రదాయం నేడు అంతర్జాతీయ స్థాయిలో విశేష ఆదరణ పొందుతోందని, ఆరోగ్యవంతమైన మరియు ఆనందకరమైన సమాజ నిర్మాణానికి యోగా సమర్థవంతమైన మార్గమని కలెక్టర్ పేర్కొన్నారు.

జిల్లాలో నిర్వహించనున్న యోగాంధ్ర-2026 కార్యక్రమంలో ప్రజలందరూ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



**పరిశుభ్రమైన పరిసరాలే ఆరోగ్యకర సమాజానికి పునాది**

**జిల్లా రెవెన్యూ అధికారి రాము నాయక్**

**నంద్యాల బ్యూరో, జూన్ 20(నంది పత్రిక):-** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమాన్ని ప్రతి ప్రభుత్వ శాఖ సమన్వయంతో విజయవంతం చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ) రాము నాయక్ పేర్కొన్నారు. శనివారం నంద్యాల కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్వహించిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో డీఆర్ఓ పాల్గొని అధికారులతో కలిసి పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. కలెక్టరేట్ ఆవరణ, కార్యాలయ పరిసరాలు, ప్రజలు అధికంగా రాకపోకలు సాగించే ప్రాంతాలను పరిశుభ్రం చేయించారు. ఈ సందర్భంగా డీఆర్ఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పరిశుభ్రమైన, ఆరోగ్యవంతమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణ లక్ష్యంతో స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. పరిశుభ్రత అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాకుండా ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని తెలిపారు. కార్యాలయాలు, విద్యాసంస్థలు, ప్రజా ప్రదేశాలు, నివాస ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ వ్యర్థాల వినియోగాన్ని తగ్గించి, చెత్తను తడి - పొడి వ్యర్థాలుగా వేరు చేసి నిర్వహించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని సూచించారు. ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన పెంపొందించేందుకు అధికారులు, సిబ్బంది నిరంతరం కృషి చేయాలని తెలిపారు. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ద్వారా గ్రామాలు, పట్టణాలు పరిశుభ్రంగా మారడంతో పాటు ప్రజారోగ్యం మెరుగుపడుతుందని, వ్యాధుల నివారణకు కూడా ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# నీట్-యూజీ 2026 పునఃపరీక్ష నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

**జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో సీఎస్ సాయి ప్రసాద్ వీడియో సమీక్ష**



**నంద్యాల బ్యూరో, జూన్ 20(నంది పత్రిక):-** ఈనెల 21న నిర్వహించనున్న నీట్ (యూజీ)-2026 పునఃపరీక్ష ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ శనివారం విజయవాడ సీఎస్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. నంద్యాల జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి కలెక్టర్ ఛాంబర్ నుంచి వీడియో సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 65,790 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారని, వారి కోసం 185 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. ప్రతి జిల్లాలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి పరీక్షల నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రశ్నాపత్రాలు, జవాబు పత్రాల రవాణా మరియు భద్రపరచడంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, సీసీటీవీ నిఘాలో స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరచాలని స్పష్టం చేశారు. ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నందున పరీక్షా కేంద్రాల పరిసరాల్లో నిషేధాజ్ఞలు అమలు చేయడంతో పాటు అవసరమైతే ఇంటర్నెట్ సేవలను నియంత్రించాలని సూచించారు. దివ్యాంగ అభ్యర్థులకు అదనంగా ఒక గంట సమయం కల్పించనున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల సమీపంలోని ఫోటోకాపీ కేంద్రాలు, సైబర్ కేఫ్‌లు, కోచింగ్ సెంటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలని, కేంద్రాల్లో తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ప్రాథమిక వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. సోషల్ మీడియాలో పేపర్ లీకేజీ వంటి తప్పుడు ప్రచారాలు, వదంతులు సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, నకిలీ గుర్తింపు కార్డులు లేదా ఇతర

అక్రమ మార్గాల ద్వారా పరీక్ష రాసేందుకు ప్రయత్నించే వారిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టాలని సీఎస్ సాయి ప్రసాద్ స్పష్టం చేశారు.

# ముస్లింల సంక్షేమానికి భూమా కుటుంబం కట్టుబడి ఉంది



**ఆళ్లగడ్డ ప్రతినిధి జూన్ 20 నంది పత్రిక** భూమా కుటుంబానికి ముస్లిం మైనారిటీలకు తరతరాలుగా విడదీయరాని ఆత్మీయ బంధం ఉందని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు శనివారం ఆళ్లగడ్డ పట్టణంలోని లింగం దిన్నె రోడ్డు ఈద్గాలో నిర్వహించిన ముస్లిం సోదరుల ఆత్మీయ సమావేశంలో ముఖ్య ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ టిడిపి యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివంగత భూమా నాగిరెడ్డి భూమా శోభనాగిరెడ్డి ఆశయాల సాధనలో ముస్లింల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు నియోజకవర్గంలో మసీదులు షాది ఖానా అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఆళ్లగడ్డను మతసామరస్యానికి ప్రతికగా నిలుపుతామన్నారు స్థానిక ముస్లిం సమస్యలకు ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ హుస్సేన్ భాష, ముస్లిం మత పెద్దలు రాయలసీమ జోన్ కమిటీ సభ్యులు బాబు హుస్సేన్ , టి టి అమీర్ భాష, మైనారిటీ సోదరులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా చింతకుంట వారి వివాహం



**ఆళ్లగడ్డ ప్రతినిధి జూన్ 20 నంది పత్రిక**టిడిపి సీనియర్ నాయకుడు కాంట్రాక్టర్ నాగిరెడ్డిపల్లె చింతకుంట రామ శేఖర్ రెడ్డి చింతకుంట శివలక్ష్మి దంపతుల కనిష్ట పుత్రిక రామ పూజిత సాయికుమార్ రెడ్డి ల వివాహం ఘనంగా జరిగింది. శనివారం నాడు రుద్రవరం మండలం నరసాపురం మెట్ట జి ఎస్ ఆర్ ఫంక్షన్ హాల్ లో అంగరంగ వైభవంగా వివాహం జరిగింది. ఈ వివాహానికి ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ టిడిపి యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి హాజరై నూతన వధూవరులను అక్షింతలతో ఆశీర్వదించారు. ఈ వివాహానికి రాజకీయ ప్రముఖులు బంధువులు స్నేహితులు, శ్రేయోభిలాషులు ఆత్మీయులు తదితరులు తరలివచ్చి నూతన వధూవరులను ఆశీర్వదించారు. వివాహానికి హాజరైన అందరికీ పేరుపేరునా చింతకుంట రామ శేఖర్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

# డాక్టర్ కే రామలింగారెడ్డి మృతి

**డాక్టర్ రామలింగారెడ్డి భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ**



**ఆళ్లగడ్డ ప్రతినిధి జూన్ 20 నంది పత్రిక** ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు, మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ రామలింగారెడ్డి (87) శనివారం కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, శనివారం పరిస్థితి విషమించడంతో తుదిశ్వాస విడిచారు. ఆళ్లగడ్డ పట్టణంలో సుదీర్ఘకాలంగా వైద్యుడిగా సేవలందిస్తూ, ప్రజాప్రతినిధిగా పట్టణాభివృద్ధికి ఆయన చేసిన కృషి ఎనలేనిది.డాక్టర్ కె. రామలింగారెడ్డి మృతి చెందిన విషయం తెలియగానే స్థానిక ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ వెంటనే స్పందించారు. పట్టణంలోని నెహ్రూ వీధిలో ఉన్న ఆయన నివాసానికి చేరుకుని, రామలింగారెడ్డి భౌతికకాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా తీవ్ర దుఃఖంలో ఉన్న కుటుంబ సభ్యులను ఆమె ఓదార్చారు. వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ధైర్యంగా ఉండాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే అఖిలప్రియ మాట్లాడుతూ. ఆళ్లగడ్డ పట్టణాభివృద్ధికి, ప్రజలకు వైద్య, విద్య సేవలందించడంలో రామలింగారెడ్డి చేసిన సేవలు ఎప్పటికీ మరవలేనివని కొనియాడారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. రామలింగారెడ్డి మరణవార్త తెలియడంతో ఆళ్లగడ్డ పట్టణంలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఆయన మృతి పట్ల పట్టణంలోని పలువురు ప్రముఖులు, వివిధ పార్టీల నాయకులు, వైద్య బృందం మరియు పట్టణ ప్రజలు తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు.

# రాజీవ్ రహదారి విస్తరణ పనులలో భాగంగా తూంకుంటలో సేకరించిన స్థలంలోని నిర్మాణాల కూల్చివేత



సికింద్రాబాదు నుండి శామీర్ పేట్ వరకు రాజీవ్ రహదారి విస్తరణ పనులు శరవేగంగా జయగుతున్నాయి. అందులో భాగంగా తూంకుంట లోని భూ నిర్వాసితులకు గతంలోనే నష్ట పరహారం అందించగా, వారు కోరిన విధంగా మూడు నెలల గడువు అనంతరం ఎస్డిసిఎల్ వారు తూంకుంటలో సేకరించిన స్థలాన్ని పంచనామ చేసి జూన్ 6వ తేదిన హెచ్ఎండిఎ అధికారులకు అప్పగించారు. శనివారం ఎస్డిసిఎల్ మాలతి ఆధ్వర్యంలో హెచ్ఎండిఎ అధికారులు అక్కడ ఉన్న నిర్మాణాల కూల్చివేతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సర్వే ల్యాండ్ సర్వేయర్ వినయ్ కుమార్, ఆర్ఐ రాఘువ, హెచ్ఎండిఎ ఎఈ సంపత్ అధికారులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమానికి పెద్దపీట.. నంద్యాల జిల్లాలో 2.06 లక్షల మంది రైతులకు రూ.139.41 కోట్ల ఆర్థిక సహాయం





**అన్నదాతకు అండగా ప్రభుత్వం.. ప్రతి అర్హ రైతుకు ఏడాదికి రూ.20 వేల ఆర్థిక భరోసా**

**వ్యవసాయాభివృద్ధే లక్ష్యం.. రైతుల ఖాతాల్లో భారీగా నిధుల జమ**

**అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్‌తో రైతు కుటుంబాలకు ఆర్థిక భద్రత**

**రైతు సంక్షేమం, భూసార పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు - జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి**

**నంద్యాల బ్యూరో, జూన్ 20(నంది పత్రిక):–** రైతుల ఆర్థిక స్థిరత్వం, వ్యవసాయ రంగాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న "అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్" పథకం ద్వారా నంద్యాల జిల్లాలో అర్హులైన రైతులకు భారీ స్థాయిలో ఆర్థిక సహాయం అందిస్తున్నామని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. శనివారం నంద్యాల మండలం పోలూరు గ్రామంలో నిర్వహించిన "అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్" పథకం కార్యక్రమంలో కలెక్టర్ తో పాటు నంద్యాల పార్లమెంటు సభ్యురాలు బైరెడ్డి శబరి వ్యవసాయ, అనుబంధ రంగాల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో మొత్తం 2,06,052 మంది రైతులకు రూ.139.41 కోట్ల ఆర్థిక సహాయం రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.103.03 కోట్లు, కేంద్ర ప్రభుత్వం తరపున రూ.36.39 కోట్లు అందించబడినట్లు పేర్కొన్నారు. రైతుల ఆదాయాన్ని పెంచడం, సాగు ఖర్చులను తగ్గించడం, వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చడం లక్ష్యంగా ప్రభుత్వం ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్ పథకం కింద అర్హులైన ప్రతి రైతుకు సంవత్సరానికి రూ.20 వేల ఆర్థిక సహాయం మూడు విడతలుగా అందజేస్తున్నట్లు వివరించారు. తొలి, రెండో విడతల్లో కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.2 వేలు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.5 వేలు చొప్పున మొత్తం రూ.7 వేల చొప్పున, మూడో విడతలో కేంద్రం నుంచి రూ.2 వేలు, రాష్ట్రం నుంచి రూ.4 వేలు కలిపి రూ.6 వేలు అందజేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో అత్యధికంగా ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని 42,981 మంది రైతులకు రూ.29.10 కోట్లు, బనగానపల్లె నియోజకవర్గంలోని 40,664 మంది రైతులకు రూ.27.41 కోట్లు, నంద్యాల నియోజకవర్గంలోని 36,734 మంది రైతులకు రూ.24.94 కోట్లు అందించగా, డోన్ నియోజకవర్గంలోని 35,011 మంది రైతులకు రూ.23.40 కోట్లు, శ్రీశైలం నియోజకవర్గంలోని 25,018 మంది రైతులకు రూ.17.06 కోట్లు, నందికొట్కూరు నియోజకవర్గంలోని 12,953 మంది రైతులకు రూ.8.79 కోట్లు, పాణ్యం నియోజకవర్గంలోని 12,691 మంది రైతులకు రూ.8.72 కోట్లు మంజూరైనట్లు వెల్లడించారు. వ్యవసాయ ఉత్పాదకత పెరగాలంటే భూసారాన్ని కాపాడుకోవడం అత్యంత అవసరమని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వం యూరియా, డి.ఎ.పి., కాంప్లెక్స్ ఎరువులను భారీ సబ్సిడీపై అందిస్తున్నప్పటికీ, వాటిని మితిమీరిన స్థాయిలో వినియోగించడం వల్ల భూమి సారవంతత తగ్గే ప్రమాదం ఉందన్నారు. భూముల్లో జింక్, సూక్ష్మపోషకాలు, కర్బన శాతం లోపిస్తున్నాయని శాస్త్రవేత్తలు గుర్తించారని, రైతులు పచ్చిరొట్ట పంటలు సాగు చేయడం, సేంద్రీయ ఎరువుల వినియోగాన్ని పెంచడం ద్వారా భూసారాన్ని పరిరక్షించాలని సూచించారు. పోలూరు గ్రామంలో ప్రజలు ప్రస్తావించిన సమస్యలపై స్పందించిన కలెక్టర్, పాఠశాల చుట్టూ వర్షపు నీరు నిలిచిపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా ఇప్పటికే రూ.5 లక్షలతో అభివృద్ధి పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. పాఠశాల మైదానం లెవెలింగ్ అంశాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామంలోని సీసీ రోడ్లపై నీరు నిలిచే సమస్యను సాంకేతిక నిపుణులతో పరిశీలించి పరిష్కరిస్తామని చెప్పారు. అలాగే పొలాల రహదారుల నిర్మాణానికి సంబంధించి ఉపాధి హామీ పథకం సాఫ్ట్‌వేర్‌లో జూలై 1 నుంచి అమల్లోకి రానున్న మార్పుల అనంతరం అవసరమైన చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు. గ్రామాభివృద్ధి అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రజల భాగస్వామ్యం, సహకారం ఉంటేనే గ్రామాలు వేగంగా అభివృద్ధి చెందుతాయని కలెక్టర్ పేర్కొన్నారు. రైతులు, ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని గ్రామాభివృద్ధికి తోడ్పడాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి మాట్లాడుతూ, రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రైతు బాగుంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. రైతుల కష్టాలను అర్థం చేసుకున్న కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్ పథకాల ద్వారా ఆర్థిక సహాయాన్ని నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తోందని తెలిపారు. పోలూరు గ్రామ అభివృద్ధికి అవసరమైన రోడ్లు, నీటి పారుదల, పాఠశాల మౌలిక వసతుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామ సమస్యలను ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకువస్తే నిధుల మంజూరుకు తన వంతు సహకారం అందిస్తానని పేర్కొన్నారు.



# గిరిజనులకు రాజ్యాంగ ఫలాలు అందేలా చూడాలి.



**ఎస్టీలుపై దాడులను తీవ్రంగా పరిగణించాలి,**

**సమస్యలు పరిష్కారానికి ప్రత్యేక దృష్టి**

**రాష్ట్ర ఎస్టీ కమీషన్ చైర్మన్ సోళ్ల బొజ్జిరెడ్డి ...**

**గిరిజన సమస్యలు పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత.**

**జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ...**

**ఏలూరు, బ్యూరో చీఫ్ జూన్ 20 నంది పత్రిక :** గిరిజనులకు రాజ్యాంగ పరమైన హక్కులు, సంక్షేమ పథకాలు ప్రయోజనాలు సక్రమంగా అందేలా చూడాల్సిన బాధ్యత జిల్లా యంత్రాంగంపై ఉందని రాష్ట్ర ఎస్టీ కమీషన్ చైర్మన్ సోళ్ల బొజ్జిరెడ్డి తెలిపారు. జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి అధ్యక్షతన ఏలూరు కలెక్టరేటు గోదావరి సమావేశమందిరంలో శనివారం జరిగిన సమీక్షా సమావేశంలో రాష్ట్ర ఎస్టీ కమీషన్ చైర్మన్ సోళ్ల బొజ్జిరెడ్డి పాల్గొని గిరిజన సమస్యలు, సంక్షేమ పథకాల అమలుపై, ఆయా శాఖల్లో రోస్టర్ ప్రకారం రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు, ఎస్టీ బ్యాక్ లాగ్ ఖాళీలు భర్తీ, తదితర అంశాలుపై అధికారులతో సమీక్షించారు. అనంతరం గిరిజనులు నుంచి ఆయా సమస్యలు పరిష్కారంకోసం వినతులను ఆయన స్వీకరించారు. సమావేశంలో జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్, ఎస్టీ కమీషన్ సభ్యులు కాకి లక్ష్మీ, గొర్లె సునీత, జిల్లా జాయింటు కలెక్టరు డా.ఎం.జె. అభిషేక్ గౌడ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎస్టీ కమీషన్ చైర్మన్ సోళ్ల బొజ్జిరెడ్డి మాట్లాడుతూ గత రెండు రోజులుగా జిల్లాలో పర్యటించి గిరిజనులనుంచి వినతులు స్వీకరించినట్లు పేర్కొంటూ వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషిచేస్తామని తెలిపారు. జిల్లాలోని 18 ఎస్టీ విద్యాసంస్థల్లో రూ. 1.47 కోట్లతో 196 టాయిలెట్స్ ను మంజూరు చేసిన జిల్లా కలెక్టరు వారిని ఆయన అభినందించారు. ఈ పనులన్నింటిని నెలలోపు పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో గిరిజనులకు అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలు తీరును ఆయన సమీక్షిస్తూ సంతృప్తి వ్యక్తం చేశారు. ఇదే స్ఫూర్తితో మిగిలిన సమస్యలు పరిష్కారానికి చొరవ తీసుకోవాలన్నారు. జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ గిరిజన సమస్యలు పరిష్కారంకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ జిల్లాలో గిరిజన సమస్యలు పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేస్తున్నట్లు తెలిపారు. పి.జి.ఆర్.ఎస్. లో వినతులను సత్వరం పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఇప్పటివరకు విద్యుత్ సౌకర్యంలేని గిరిజన ప్రాంతంలోని రెండు మండలాల్లో మూడు గ్రామాలకు సోలార్ విద్యుత్ సౌకర్యం కల్పించామని అన్నారు. గిరిజన ప్రాంతంలో విద్యార్హతలు తక్కువగా ఉన్న యువతకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించి వారికి ఉపాధి కల్పించేందుకు తగు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. సర్వేమేరకు పశుపెంపకానికి రుణాలు కోరిన గిరిజనులకు ఈ ఆర్థిక సంవత్సరంలో రుణాలు అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. గౌ.రాష్ట్ర ముఖ్యమంత్రి చెప్పిన విధంగా ఒక కుటుంబంలో ఒకరికి తప్పనిసరిగా ఉపాధి కల్పించేందకు ప్లాన్ ఆఫ్ యాక్షన్ సిద్ధం చేస్తున్నామన్నారు. పోలవరం ప్రాజెక్ట్ ఆర్ అండ్ ఆర్ కు సంబంధించి ఏవైనా సమస్యలుంటే వాటిని విచారణ చేసి వాటిని పరిష్కరిస్తున్నామన్నారు. గిరిజన ప్రాంతంలోని 5 మండలాల్లో ఉపాధిహామీ కింద రూ. 30 కోట్లతో రహదారులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. కమీషన్ జిల్లా పర్యటన సందర్భంగా వారి దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు.

ఎస్టీ కమీషన్ చైర్మన్ పర్యటన సందర్భంగా వివిధ సమస్యలపై ఏలూరు జిల్లా గిరిజన ప్రాంతాలకు చెందిన పలువురు గిరిజనులు 26 అర్జీలను అందజేశారు. పోలవరం పరిధిలో 19 గ్రామాలకు చెందిన 18 సంవత్సరాలు నిండిన 375 మందికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజి మంజూరు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కొండ్రుకోటకు చెందిన మొడియం గంగాభవానీ, యం. దుర్గ, తదితరులు వినతులు అందజేశారు, జీలుగుమిల్లి మండలం దాట్లవారి గూడెంకు చెందిన కణిత ధనలక్ష్మి తదితర మహిళలు ఎల్ టిఆర్ కేసులకు సంబంధించి కేసులను పరిష్కరించాలని కోరారు, జీలుగుమిల్లికు చెందిన మొడియం శ్రీనివాసరావు వినతిపత్రం ఇస్తూ 2013 భూసేకరణ చట్టం ప్రకారం కాలువ ఆయుకట్టు పరిదిలోని భూమిని సేకరించడం ద్వారా గిరిజనులు, గిరిజనేతరులకు ఎటువంటి ఇబ్బందులు ఉండవని పేర్కొన్నారు. సమావేశంలో ఎస్టీ కమీషన్ డిప్యూటీ డైరెక్టర్ కట్టా సాంబయ్య , ఐటిడిఏ పివో కె.రాములు నాయక్, డిఎఫ్ఓ పి.వి.సంధీప్ రెడ్డి, ఇన్ చార్జి డిఆర్ఓ ఎల్. దేవకీదేవి, జెడ్పి సిఇఓ పి.జగదాంబ, డిపివో జి జి.మల్లిఖార్జునరావు, ఆర్ డిఓ కె.లక్ష్మీప్రసన్న, జిల్లా వ్యవసాయశాఖ అధికారి యస్.కె.హబీబ్ భాషా, ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ కె.ఎం. అంబేద్కర్, వివిధ శాఖలు జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# ఈనెల 21వ తేదీన జిల్లాలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు

**ఏలూరులోని ఇండోర్ స్టేడియంఓ 3 వేల మందితో పెద్దఎత్తున నిర్వహణ**

**జిల్లాలోని అన్ని స్వర్ణ గ్రామ/వార్డ్ సచివాలయాల వద్ద తప్పనిసరిగా నిర్వహించాలి**

**అంతర్జాతీయ యోగ దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై అధికారులతో జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ టెలి కాన్ఫరెన్స్**



**ఏలూరు, బ్యూరో చీఫ్ జూన్, 20 నంది పత్రిక** ఈనెల 21వ తేదీని జిల్లాలోని అన్ని స్వర్ణ గ్రామ/ వార్డ్ సచివాలయాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుండి ఈనెల 21వ తేదీ అంతర్జాతీయ యోగా దినోత్సవ నిర్వహణ ఏర్పాట్లపై అధికారులతో జేసీ టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ అభిషేక్ గౌడ మాట్లాడుతూ యోగాంధ్ర కార్యక్రమంలో జిల్లాలో 4. 2 లక్షల మంది తమ పేర్లను ఆన్లైన్ లో నమోదు చేసుకున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా యోగాంధ్ర పోర్టల్ లో 1.5 కోట్ల మంది ప్రజలు తమ పేర్లను నమోదు చేసుకున్నారని, యోగాంధ్ర కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నారన్నారు. ఈనెల 21వ తేదీ అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి కార్యక్రమం ఏలూరులోని ఇండోర్ స్టేడియం లో ఉదయ. 6. 30 ని.లకు ప్రారంభమవుతుందని, 3 వేల మందితో పెద్దఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. అదేసమయానికి జిల్లాలోని స్వర్ణ గ్రామ/వార్డ్ సచివాలయాలలో కూడా యోగ కార్యక్రమాలు ప్రారంభం కావాలన్నారు. అందుకు సంబంధించి పటిష్టమైన ఏర్పాట్లు చేయాలనీ జిల్లా పరిషత్ సీఈఓ, స్వర్ణ గ్రామ/వార్డ్ సచివాలయాల జిల్లా అధికారిని జేసీ ఆదేశించారు. కార్యక్రమం పూర్తి ఐన అనంతరం నిర్వహించిన ప్రదేశం, పాల్గొన ప్రజల సంఖ్య, తదితర వివరాలతో ఫోటోలు, వీడియోలను యోగాంధ్ర వెబ్సైటు లో అప్లోడ్ చేయాలన్నారు. కార్యక్రమంలో యోగాంధ్ర థీమ్ తో ముద్రించిన ఫ్లెక్స్ లను వినియోగించాలన్నారు. ఇంచార్జ్ డిఆర్ఓ దేవకీదేవి, సబ్ కలెక్టర్ బి. వినూత్న, జిల్లా పరిషత్ సీఈఓ జగదాంబ, ఆర్డీఓ లు లక్ష్మి ప్రసన్న, రమణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ఎస్టీ కమీషన్ చైర్మన్ సోళ్ల బొజ్జిరెడ్డి, కమీషన్ సభ్యులు కాకి లక్ష్మీ, గొర్లె సునీత లను మర్యాద పూర్వకంగా కలసిన జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి





**ఏలూరు, బ్యూరో చీఫ్ జూన్ 20: నంది పత్రిక** జిల్లా కలెక్టరేటు గోదావరి సమావేశమందిరంలో శనివారం జిల్లా పర్యటనకు రెండు రోజులు భాగంగా చివరిరోజు జిల్లా అధికార్లుతో జిల్లా సమీక్షా సమావేశానికి వచ్చిన రాష్ట్ర ఎస్టీ కమీషన్ చైర్మన్ సోళ్ల బొజ్జిరెడ్డి, కమీషన్ సభ్యులు కాకి లక్ష్మీ, గొర్లె సునీత లను మర్యాద పూర్వకంగా కలిసి జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి పుష్పగుచ్చాలను అందజేశారు. జిల్లా కలెక్టరుతో పాటు జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్, జిల్లాజాయింటు కలెక్టరు యం.జె. అభిషేక్ గౌడ, జిల్లా అటవీశాఖ అధికారి పి.వి.సంధీప్ రెడ్డి, ఐటిడిఏ పీవో కె.రాములు నాయక్ లు పుష్పగుచ్చాలను, పూలమొక్కలను అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జి డిఆర్వో ఎల్.దేవకీ దేవి, జెడ్పీ సిఈవో పి.జగదాంబ, ఆర్డీవో కె.లక్ష్మీప్రసన్న, వివిధ శాఖలు జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# రెవిన్యూ శాఖ అధికారులు సిబ్బంది రెవిన్యూ చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ప్రజలకు సేవలందించాలి జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి



**భీమవరం బ్యూరో చీఫ్: జూన్ 20, నంది పత్రిక** రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది రెవెన్యూ చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సూచించారు. రెవెన్యూ డే సందర్భంగా శనివారం కలెక్టరేట్ పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెవెన్యూ సిబ్బందికి దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసిన జాయింట్ కలెక్టర్, రెవెన్యూ శాఖలో ప్రతి ఫైలు ఒక జీవితంతో ముడిపడి ఉంటుందని, అందువల్ల ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి జాగ్రత్తగా పరిష్కరించాలని అన్నారు. రెవెన్యూ అధికారులు, సిబ్బంది చట్టాలపై సంపూర్ణ అవగాహన పెంపొందించుకోవడంతో పాటు కాలానుగుణంగా వస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునేందుకు నిరంతర శిక్షణ అవసరమని పేర్కొన్నారు. ప్రజలకు రెవెన్యూ శాఖపై మరింత విశ్వాసం కలిగేలా అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఉద్యోగులందరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.ఈ సందర్భంగా నర్సాపురం కలెక్టర్ కార్యాలయంలో ఏవోగా పనిచేస్తున్న పెద్దిరాజు, కలెక్టరేట్‌లో ఎలక్షన్ డీటీగా పనిచేస్తున్న శ్రీనివాస్, ల్యాండ్ సూపరింటెండెంట్ భాను, ఆఫీస్ సబార్డినేట్ భారతిని జాయింట్ కలెక్టర్ దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో డీఆర్వో బి.శివన్నారాయణ రెడ్డి, కలెక్టరేట్ పరిపాలన అధికారి ఎన్.వెంకటేశ్వరరావు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# జిల్లాలో నీట్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి

**మధ్యాహ్నం 1:30 గంటలలోపు కేంద్రాలకు చేరుకోవాలి ఆలస్యంగా వచ్చే వారికి అనుమతి లేదు**

**అభ్యర్థులు పరీక్షా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి**

**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**

**భీమవరం: బ్యూరో చీఫ్ జూన్ 20, నంది పత్రిక** జిల్లాలో జూన్ 21న నిర్వహించనున్న నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) పరీక్షను ప్రశాంతంగా, పారదర్శకంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తమకు కేటాయించిన పరీక్షా కేంద్రాలకు మధ్యాహ్నం 1:30 గంటలలోపు తప్పనిసరిగా చేరుకోవాలని, ఆ తర్వాత వచ్చే అభ్యర్థులను ఎట్టి పరిస్థితుల్లోనూ పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించబోమని స్పష్టం చేశారు. భద్రతా తనిఖీలు, బయోమెట్రిక్ ధృవీకరణ తదితర ప్రక్రియల దృష్ట్యా అభ్యర్థులు ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, వైద్య సేవలు, ప్రథమ చికిత్స తదితర సౌకర్యాలను కల్పించినట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి విద్యాశాఖ, పోలీసు, వైద్య ఆరోగ్య, రవాణా, రెవెన్యూ తదితర శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. కేంద్రాల వద్ద శాంతిభద్రతలు, ట్రాఫిక్ నియంత్రణ, అత్యవసర సేవల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. అభ్యర్థులు అడ్మిట్ కార్డు, చెల్లుబాటు అయ్యే ఫోటో గుర్తింపు కార్డు తప్పనిసరిగా వెంట తీసుకురావాలని సూచించారు. మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, బ్లూటూత్ పరికరాలు, ఇయర్ ఫోన్లు, కాలిక్యులేటర్లు, ఇతర ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లు వంటి నిషేధిత వస్తువులను పరీక్షా కేంద్రాలకు తీసుకురావద్దని హెచ్చరించారు. ఎన్‌టీఏ జారీ చేసిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని కోరారు. అభ్యర్థులు సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా తల్లిదండ్రులు, సంరక్షకులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద అనవసర రద్దీ సృష్టించకుండా



అధికారుల సూచనలను పాటించాలని కోరారు. జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని, అభ్యర్థులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా ఆత్మవిశ్వాసంతో పరీక్షకు హాజరై ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆకాంక్షించారు.

# ఎస్ఐఆర్2026 కార్యక్రమంలో భాగంగా 4,45,513 ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ

**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**

**భీమవరం: బ్యూరో చీఫ్ జూన్ 20, నంది పత్రిక** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) 2026 కార్యక్రమం జిల్లాలో విజయవంతంగా కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ఓటర్ల వివరాల సేకరణ, పరిశీలన, సవరణల కోసం ఈ నెల 15వ తేదీ నుంచి బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) ఇంటింటి సందర్శనలు నిర్వహిస్తున్నారని ఆమె వెల్లడించారు. జిల్లాలో నియమితులైన బీఎల్ఓలందరికీ ప్రత్యేక శిక్షణ అందించి, ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 14,75,036 మంది ఓటర్లు ఉండగా, శనివారం నాటికి 4,45,513 మంది ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. దీంతో ఇప్పటివరకు 30.20 శాతం



ఫారాల పంపిణీ పూర్తయిందని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో సేకరించిన ఫారాల వివరాలను నిరంతరాయంగా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఓటర్ల వివరాల సేకరణ, ధృవీకరణ, సవరణ ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఎస్ఐఆర్ 2026 కార్యక్రమంలో భాగంగా 15 జూన్ 2026 నుండి 14 జూలై 2026 వరకు బీఎల్ఓలు ప్రతి ఇంటిని సందర్శించి రెండు ఎన్యుమరేషన్ ఫారాలు అందజేస్తారని, అందులో ఒక ఫారాన్ని ఓటర్లు పూర్తి చేసి తిరిగి బీఎల్ఓలకు అందజేయాల్సి ఉంటుందని వివరించారు. ఓటర్ల జాబితా మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందించేందుకు ఈ కార్యక్రమం ఎంతో కీలకమని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, బీఎల్ఏలు, ప్రజాప్రతినిధులు మరియు ఓటర్లు ఈ కార్యక్రమానికి సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. ప్రతి అర్హ ఓటరు వివరాలు సక్రమంగా నమోదయ్యేలా ప్రజలు బీఎల్ఓలకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు..

# నేడే (జూన్ 21) ప్రపంచ యోగా దినోత్సవం

**జిల్లా వ్యాప్తంగా ఉదయం 6.00 గంటలకు యోగ కార్యక్రమాల ప్రారంభం**

**యోగ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి**

**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**

**భీమవరం: బ్యూరో చీఫ్ జూన్ 20, నంది పత్రిక** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం (జూన్ 21) జిల్లా వ్యాప్తంగా భారీ స్థాయిలో యోగ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, గ్రామాలు, పట్టణాలు, ప్రజా ప్రదేశాల్లో యోగ కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంతో పాటు జిల్లా వ్యాప్తంగా మొత్తం 5,079 కేంద్రాలను యోగ కార్యక్రమాల నిర్వహణకు సిద్ధం చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాలో సుమారు నాలుగు లక్షల మంది ప్రజలు పాల్గొనేలా లక్ష్యంగా పెట్టుకుని అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేపట్టినట్లు వెల్లడించారు. ఆదివారం ఉదయం 6 గంటలకే యోగ కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయని, ప్రజలు ముందుగానే ఆయా కేంద్రాలకు చేరుకుని కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. యోగ ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు క్రమశిక్షణ, ఏకాగ్రత, ఒత్తిడి నియంత్రణ వంటి అనేక ప్రయోజనాలు లభిస్తాయని తెలిపారు. ప్రపంచ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేసేందుకు జిల్లా స్థాయి అధికారులు, మండల అధికారులు, స్థానిక సంస్థల ప్రతినిధులు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు, మహిళా సంఘాలు సమన్వయంతో పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి కేంద్రంలో అవసరమైన మౌలిక సదుపాయాలు, తాగునీరు, వైద్య సహాయం, భద్రతా ఏర్పాట్లు కల్పించినట్లు తెలిపారు. జిల్లాలోని ప్రజలు, విద్యార్థులు, యువత, మహిళలు, ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొని యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి యోగ ఒక గొప్ప సాధనమని, ప్రతి ఒక్కరూ యోగను దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు.



# ఈనెల 23వ తేదీన ఛలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరు యూ ఎస్ ఎఫ్ ఐ

**విద్యారంగంపై రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశ ధోరణిని మానుకోవాలి**

**విద్యా రంగానికి పూర్తిస్థాయిలో న్యాయం చేయాలి**

**తెలంగాణ విద్యా రంగానికి వెంటనే విద్యాశాఖ మంత్రిని కేటాయించాలి**

విద్యారంగంపై రాష్ట్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ విద్యారంగ సమస్యల పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 23న చేపట్టిన ఛలో సెక్రటేరియట్ ముట్టడిని జయప్రదం చేయాలని కోరుతూ యుఎస్ఎఫ్ఐ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు ఎం.చంద్రకాంత్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రం లోని కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల్లో కొనసాగుతున్న అక్రమ ఫీజుల దోపిడీ, పాఠ్యపుస్తకాలు, నోట్బుక్స్, యూనిఫాంల బలవంతపు విక్రయాలు, విద్యార్థులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారం కోసం భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 23వ తేదీన నిర్వహించనున్న "చలో సచివాలయం" కార్యక్రమాన్ని విద్యార్థులు, యువజనులు, తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనేక ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యను సేవగా కాకుండా వ్యాపారంగా మార్చి విద్యార్థులు, తల్లిదండ్రులపై తీవ్ర ఆర్థిక భారాన్ని మోపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా సంస్థలు ఇష్టారాజ్యంగా అధిక ఫీజులు వసూలు చేయడంతో పాటు పాఠ్యపుస్తకాలు, నోట్బుక్స్, యూనిఫాంలను తమ వద్ద నుంచే కొనుగోలు చేయాలని ఒత్తిడి తెస్తున్నాయని అన్నారు. ప్రభుత్వం విద్యారంగంలో జరుగుతున్న ఈఅక్రమాలను అరికట్టడంలో విఫలమైందని, విద్యార్థుల హక్కులను పరిరక్షించేందుకు ప్రభుత్వం వెంటనే కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. యుఎస్ఎఫ్ఐ ప్రధాన డిమాండ్లు, ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో అక్రమ ఫీజుల వసూళ్లను వెంటనే నిలిపివేయాలి. ఈ కార్యక్రమంలో యూ ఎస్ ఎఫ్ ఐ నాయకులు రవి, సాయి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.





## అన్నదాత సుఖీభవ ఆర్థిక సహాయాన్ని వ్యవసాయ అవసరాలకు సద్వినియోగం చేసుకోవాలి

**జిల్లాలో 1,88,987 మంది రైతుల ఖాతాల్లో రూ.68.93 కోట్ల జమ**

**రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యం**

**జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి.**




**ఉండి: బ్యూరో చీఫ్ జూన్ 20, నంది పత్రిక.** రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకం కింద రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అయిన ఆర్థిక సహాయాన్ని వ్యవసాయ అవసరాలకు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి రైతులకు పిలుపునిచ్చారు. ఉండి కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ఆవరణలో శనివారం నిర్వహించిన జిల్లాస్థాయి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని రైతుల ఖాతాల్లో ఆర్థిక సహాయం జమ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయంలో యూరియా, రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ సాగు విధానాలను ప్రోత్సహించాలని రైతులకు సూచించారు. సేంద్రియ పద్ధతులను అనుసరించడం ద్వారా సాగు వ్యయాలు తగ్గడంతో పాటు భూమి సారవంతత పెరిగి అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన తొలి విడత ఆర్థిక సహాయాన్ని రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేయడం జరిగిందన్నారు. అర్హులైన భూ యజమాన రైతు కుటుంబాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి సంవత్సరానికి మొత్తం రూ.20,000 ఆర్థిక సహాయం అందిస్తున్నాయని తెలిపారు. ఈ సహాయంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం ద్వారా సంవత్సరానికి రూ.6,000, రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం ద్వారా అదనంగా రూ.14,000 అందజేస్తోందన్నారు. 2026–27 ఆర్థిక సంవత్సరానికి తొలి విడతలో రాష్ట్ర ప్రభుత్వం తరపున ఒక్కో రైతు కుటుంబానికి రూ.5,000, కేంద్ర ప్రభుత్వం తరపున రూ.2,000 చొప్పున మొత్తం రూ.7,000 రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేసినట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 1,88,987 మంది రైతు కుటుంబాలకు రూ.68.93 కోట్ల ఆర్థిక సహాయం అందించామని పేర్కొన్నారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.51.88 కోట్లు, కేంద్ర ప్రభుత్వ పీఎం కిసాన్ పథకం కింద రూ.17.05 కోట్లు రైతుల బ్యాంకు ఖాతాలకు జమ అయినట్లు వెల్లడించారు. రైతులు తమకు ఈ పథకం ప్రయోజనం అందిందో లేదో పీఎం కిసాన్ పోర్టల్‌లో ఆధార్ నంబర్ ద్వారా తెలుసుకోవచ్చని సూచించారు. రైతులకు అందాల్సిన ప్రతి రూపాయి ఎలాంటి మధ్యవర్తిత్వం లేకుండా పూర్తి పారదర్శకతతో నేరుగా వారి ఖాతాల్లో జమ అయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు కుటుంబాల ఆర్థికాభివృద్ధి, వ్యవసాయ రంగ ప్రగతికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రైతులు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని వ్యవసాయాభివృద్ధికి తోడ్పడాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ పి.వి.సత్యనారాయణ మాట్లాడుతూ రైతులు రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి జీవ ఎరువులు, పచ్చిరొట్ట ఎరువుల వాడకాన్ని పెంచాలని సూచించారు. ఈ విధానాల ద్వారా సాగు ఖర్చులు తగ్గడమే కాకుండా భూమి ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. కార్యక్రమం అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ చేతుల మీదుగా అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకం రైతులకు నగదు జమ నమూనా చెక్కును అందజేశారు. అనంతరం జాయింట్ కలెక్టర్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వివిధ ఆర్గానిక్ ఉత్పత్తుల ప్రదర్శనను సందర్శించి ఉత్పత్తుల తయారీ, వినియోగం, మార్కెటింగ్ అంశాలపై నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. తొలుత దేశ ప్రధాని నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రైతులకు నగదు జమ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సభల్లో పాల్గొన్న కార్యక్రమాలను జిల్లా జాయింట్ కలెక్టర్, తదితరులు వర్చువల్ గా తిలకించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం డైరెక్టర్ డాక్టర్ జి. రామచంద్రరావు, ఉండి కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్. మల్లికార్జునరావు, డాక్టర్ ఎన్. డిబోరా మెసినా, వ్యవసాయ శాఖ ఏడీఏ ప్రతాప్ జీవన్, ఏవోలు నిమ్మల శ్రీనివాస్, బి. సంధ్య, ప్రియదర్శిని, బీజేపీ నాయకులు తోట గంగరాజు, గాదిరాజు వెంకటేశ్వరరావు, చెరుకూరి కృష్ణంరాజు, కోరా రామ్మూర్తి, ముదునూరి నాగమణి, కొమ్మన నాగరాజు తదితరులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## జిల్లావ్యాప్తంగా 5,079 కేంద్రాల్లో 4 లక్షల మంది రిజిస్టర్డ్ సిటిజన్స్ యోగా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి.

**నేడు (ఆదివారం) భీమవరం కలెక్టరేట్ పరేడ్ గ్రౌండ్‌లో 1500 మందితో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం కార్యక్రమం నిర్వహణ.**

**జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి.**

**భీమవరం బ్యూరో చీఫ్ జూన్ 20 నంది పత్రిక** అంతర్జాతీయ యోగా దినోత్సవ సందర్భంగా జూన్ 21 (ఆదివారం) జిల్లా వ్యాప్తంగా నిర్వహించే యోగ కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి కోరారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి శనివారం యోగా కార్యక్రమాల నిర్వహణపై ఆర్డీవోలు, తాసిల్దార్ లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, మెడికల్ అధికారులు, నియోజకవర్గం ప్రత్యేక అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 5,079 కేంద్రాల్లో రిజిస్టర్ అయిన 4 లక్షల మంది యోగా కార్యక్రమాల్లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. జిల్లాస్థాయిలో భీమవరం కలెక్టరేట్ పరేడ్ గ్రౌండ్‌లో 1,500 మందితో భారీ స్థాయిలో యోగా కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు, మహిళలు, యువత, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొవాలని ఆయన కోరారు. జిల్లాలో ప్రతి సచివాలయం వద్ద ఆదివారం జరిగే యోగా కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. యోగా కేంద్రం వద్ద యోగ బ్యానరు, సౌకర్యవంతంగా యోగాసనాలు వేసేందుకు యోగ మ్యాట్లు వేయాలన్నారు. ప్రతి యోగా కేంద్రం మొత్తం తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. పురపాలక సంఘాల పరిధిలో యోగా కార్యక్రమాల నిర్వహణపై మున్సిపల్ కమిషనర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. యోగా కార్యక్రమం ఫోటోలను ఆన్లైన్లో అప్లోడ్ చేయాలన్నారు. ప్రతి వార్డులో యోగా కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. నియోజకవర్గ స్థాయిలో జరిగే యోగా కార్యక్రమాలను నియోజకవర్గ ప్రత్యేక అధికారులు ప్రత్యేకంగా పర్యవేక్షించాలన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాలను జిల్లాలో విజయవంతం చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని జాయింట్ కలెక్టర్ కోరారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డిఆర్ఓ బి. శివ నారాయణ రెడ్డి, జిల్లాలోని తాసిల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# అన్నదాతకు అండగా 'అన్నదాత సుఖీభవ'



- సీఎం చంద్రబాబు నాయకత్వంలో వ్యవసాయ రంగానికి పునర్వైభవం
- వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం
- గత ప్రభుత్వ వైఫల్యాలతో దెబ్బతిన్న రంగాలను తిరిగి బలోపేతం చేస్తున్నాం
- అభివృద్ధి, సంక్షేమం రెండింటినీ సమన్వయం చేస్తున్నాం: మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

**అమరావతి/ చిలకలూరిపేట బ్యూరో చీఫ్, జూన్ 20: నంది పత్రిక** రైతు సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న 'అన్నదాత సుఖీభవపీఎం కిసాన్' పథకం ద్వారా రాష్ట్రంలోని లక్షలాది రైతు కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట నియోజకవర్గంలోని లింగంగుంట్ల గ్రామంలో శనివారం నిర్వహించిన అన్నదాత సుఖీభవపీఎం కిసాన్ నిధుల విడుదల కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, రైతుల అభ్యున్నతికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రైతు కుటుంబానికి సంవత్సరానికి రూ.20 వేల ఆర్థిక సాయం అందించే ఈ పథకం వ్యవసాయ రంగానికి బలమైన అండగా నిలుస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, చిలకలూరిపేట నియోజకవర్గంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ప్రస్తుత పరిణామాలతో పాటు గత పరిస్థితులను కూడా గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. 2014లో ప్రజల అభిప్రాయానికి విరుద్ధంగా ఆంధ్రప్రదేశ్‌ను రెండు రాష్ట్రాలుగా విభజించారని, ఆ సమయంలో కొత్త రాష్ట్రానికి రాజధాని లేకపోవడం, కార్యాలయాలు లేకపోవడం, ఉద్యోగులు పనిచేసే పరిస్థితులు లేకపోవడం, రూ.16 వేల కోట్ల అప్పుతో రాష్ట్రం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొన్నదని గుర్తు చేశారు. అలాంటి క్లిష్ట సమయంలో రాష్ట్రాన్ని ముందుకు నడిపించగల నాయకుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాత్రమేనని ప్రజలు విశ్వసించి బాధ్యతలు అప్పగించారని చెప్పారు. ఆయన సమర్థవంతమైన నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. 2019లో కూడా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా కొనసాగి ఉంటే రాష్ట్రం దేశంలో అగ్రగామిగా నిలిచేదని అభిప్రాయపడ్డారు. అయితే 2019 ఎన్నికల్లో తప్పుడు హామీలు, మాయమాటలతో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాష్ట్రంలోని వ్యవస్థలను దెబ్బతీసిందని విమర్శించారు. అన్ని వర్గాల ప్రజల మధ్య విభేదాలు సృష్టించి, హరిజన, గిరిజన, బడుగు బలహీన వర్గాల ప్రయోజనాలను దెబ్బతీసిందన్నారు. 2024 ఎన్నికల్లో ప్రధాని నరేంద్ర మోదీ, తెదేపా జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కలిసి కూటమిగా ఏర్పడి పోటీ చేయగా, రాష్ట్రాన్ని మళ్లీ గాడిలో పెట్టగల నాయకుడు చంద్రబాబేనని ప్రజలు విశ్వసించారని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తీవ్రంగా దెబ్బతిన్నట్లు గుర్తించామని, అన్ని శాఖల ఖజానాలు ఖాళీ అయ్యాయని చెప్పారు. అయినప్పటికీ ఎన్నికల హామీలు, సూపర్ సిక్స్ పథకాల అమలుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఇటీవల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పాలనా రికార్డును అధిగమించిందని తెలిపారు. రైతు కుటుంబానికి ఏడాదికి రూ.20 వేల ఆర్థిక సాయంఅన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా గత ఏడాది రాష్ట్ర ప్రభుత్వం మొత్తం రూ.8,985.41 కోట్లు పంపిణీ చేసిందని మంత్రి తెలిపారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.6,560.18 కోట్లు, కేంద్ర ప్రభుత్వ వాటా రూ.2,425.23 కోట్లు ఉన్నాయని చెప్పారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా అమలవుతున్న ఈ పథకం ద్వారా అర్హత కలిగిన ప్రతి రైతు కుటుంబానికి సంవత్సరానికి రూ.20 వేల ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం రూ.14 వేలు, కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం కింద రూ.6 వేలు అందిస్తోందన్నారు. ఈ మొత్తాన్ని మూడు విడతల్లో రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాది తొలి విడతలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.5 వేలు, కేంద్ర ప్రభుత్వం రూ.2 వేలు కలిపి ఒక్కో రైతు ఖాతాలో రూ.7 వేలు జమ చేసామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 46,85,838 రైతు కుటుంబాలు ఈ పథకం ద్వారా లబ్ధి పొందాయని వెల్లడించారు. వీరిలో 45,69,817 మంది భూ యజమాని రైతులు, 1,16,021 మంది అటవీ హక్కుల చట్టం (=శీఖీ=) కింద సాగు చేస్తున్న రైతు కుటుంబాలు ఉన్నాయని పేర్కొన్నారు. మొత్తం రూ.3,125.47 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేసామని తెలిపారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.2,342.92 కోట్లు, కేంద్ర ప్రభుత్వ వాటా రూ.782.55 కోట్లు అని వివరించారు.

**రైతు సంక్షేమంపై ఆచరణలో చూపిన నాయకుడు చంద్రబాబు** రైతుల గురించి మాట్లాడేవారు చాలా మంది ఉన్నప్పటికీ, రైతు సంక్షేమాన్ని ఆచరణలో చూపించిన నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడేనని మంత్రి అన్నారు. తాను ఒక రైతుగా, పౌరుడిగా ఇందుకు గర్వపడుతున్నానని చెప్పారు. గత ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వ్యవసాయ, సాగునీటి శాఖలను నిర్వీర్యం చేసిందని విమర్శించారు. రైతు భరోసా పేరుతో రైతులను మోసం చేసిందన్నారు. ప్రస్తుతం రైతులకు ఆర్థిక సాయం అందిస్తూ కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. భూసార పరిరక్షణ, స్ప్రింక్లర్లు, డ్రిప్ ఇరిగేషన్, వ్యవసాయ యాంత్రీకరణ, డ్రోన్ల వినియోగం వంటి కార్యక్రమాలు గతంలో నిలిచిపోయాయని, ప్రస్తుతం వాటిని పునరుద్ధరించి రైతులకు అందిస్తున్నామని తెలిపారు. వ్యవసాయ రంగంలో అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావం కూడా ఉంటోందని, శాస్త్రవేత్తల సూచనలు, ఆధునిక సాంకేతికతను వినియోగించి వ్యవసాయం చేస్తే లాభదాయకంగా ఉంటుందని రైతులకు సూచించారు. గత ఏడాది పొగాకు, కోకో, ఉల్లి, తోతాపురి మామిడి వంటి పంటలకు మార్కెట్ ధరలు తగ్గిన సందర్భాల్లో రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధరలు అందించి రైతులకు తోడ్పాటును అందించిందన్నారు. తోతాపురి మామిడి ధరలు తగ్గిన నేపథ్యంలో ఈ ఏడాది కూడా కిలోకు రూ.4 ప్రోత్సాహకం అందిస్తున్నట్లు తెలిపారు. ఎరువుల పంపిణీ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో యూరియా, డీఏపీ ఎరువులు పుష్కలంగా అందుబాటులో ఉన్నాయని చెప్పారు. అయితే రైతులు యూరియాను అధికంగా వినియోగిస్తున్నారని, దీని వల్ల నేల సారవంతత దెబ్బతినడంతో పాటు పంటలపై ప్రతికూల ప్రభావం పడుతుందని హెచ్చరించారు. రైతులు యాప్ ద్వారా అవసరమైన ఎరువులను పొందుతూ యూరియా వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. ఎరువుల సరఫరాలో ఎక్కడైనా సమస్యలు ఉంటే టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని కోరారు. గుంటూరు మిర్చికి ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉందని మంత్రి పేర్కొన్నారు. అయితే ఇటీవల చైనాకు ఎగుమతి చేసిన మూడు కంటైనర్ల మిర్చిని రసాయన అవశేషాల కారణంగా తిరిగి పంపించిన ఘటనను గుర్తు చేశారు. అందువల్ల రైతులు రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి, సేంద్రియ వ్యవసాయ పద్ధతుల వైపు మొగ్గు చూపాలని సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం వేగంగా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని, ప్రజలందరూ ప్రభుత్వానికి సహకరించాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు.



# ప్రాంతీయ పార్టీలకు మరణ-శాసనమేనా ?

ఈ దేశంలోని ప్రాంతీయ పార్టీలకు మరణ శాసనం లిఖించబడుతోందా? ముంచుకొస్తున్న ముప్పు నుంచి ప్రాంతీయ పార్టీలు తమను తాము కాపాడుకునే మార్గాలు మిగిలి ఉన్నాయా? భారతీయ జనతా పార్టీ చేపట్టిన ఈ రాజసూయ యాగంలో ప్రాంతీయ పార్టీలు సమిధలుగా మిగిలిపోవలసిందేనా? 'కోర్ కోర్ శరణ్ కోర్' అన్న హుంకరింపులను ఔదలదాల్చినా వాటి మనుగడకు మాత్రమే గ్యారంటీ ఉంటుందా? ఎన్డీయే కూటమిలో భాగస్వాములుగా మారిపోయినంత మాత్రాన రక్షణ ఉంటుందా? దేశవ్యాప్తంగా ప్రాంతీయ పార్టీలలో చీలికలు రావడానికి స్వయంకృతాపరాధమే కారణమా? లేక మోదీషాల మంత్రాంగం కారణమా? గడచిన కొన్ని రోజులుగా ప్రాంతీయ పార్టీలలో చోటుచేసుకుంటున్న చీలికల నేపథ్యంలో ఈ ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఎన్నికలలో ఓడిపోయే పార్టీలకు మనుగడ లేకుండా పోవడం వాంఛనీయమా? ఆయా పార్టీల తరఫున గెలిచిన చట్టసభల సభ్యులు ఇంత నిస్సిగ్గుగా పార్టీ మారడానికి ఎందుకు తెగబడుతున్నారు? రాజకీయాలు ఇంతలా ఎందుకు దిగజారుతున్నాయి? ఇటువంటి ప్రశ్నలకు కూడా సమాధానం లభించాల్సి ఉంది. రాజకీయ పార్టీలను చీల్చడం, ఫిరాయింపులను ప్రోత్సహించడం ఇప్పుడే ప్రారంభం కాలేదు. ఈ కారణంగా జరుగుతున్న పరిణామాలకు బీజేపీని మాత్రమే దోషిగా పేర్కొనలేము. దేశంలో కాంగ్రెస్ పాలన అప్రతిహతంగా కొనసాగినప్పుడు ఆ పార్టీ కూడా ఫిరాయింపులను ప్రోత్సహించింది. అప్పట్లో ఆయారాం గయారాం సంస్కృతిపై దేశవ్యాప్తంగా చర్చ జరిగింది. దాదాపుగా అన్ని ప్రతిపక్ష పార్టీలు ఫిరాయింపులు, చీలికలకు బాధితులుగా మారాయి. దీంతో బుద్ధి తెచ్చుకున్న రాజకీయ పార్టీలు... ఫిరాయింపుల నిరోధక చట్టానికి పురుడుపోశాయి. అయితే, ఈ చట్టంలో ఎన్నో లొసుగులు! శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలు అన్నట్టుగా ఫిరాయింపుల నిరోధక చట్టానికి తూట్లు పొడిచారు. మూడింట రెండొంతుల నిబంధనను అధికారంలో ఉన్న వారికి అనుకూలంగా మలచుకున్నారు. తాజాగా తృణమూల్ కాంగ్రెస్ పార్టీలో చోటుచేసుకున్న తిరుగుబాటు, ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని పార్టీకి చెందిన తొమ్మిది మంది ఎంపీలలో ఆరుగురు తిరుగుబాటు చేయడం రాజకీయ పరిశీలకులను విస్తుపోయేలా చేస్తోంది. ఈ దేశంలో ప్రాంతీయ పార్టీలను బతకనీయరా? అని కొందరు ప్రశ్నిస్తున్నారు. నిజమే, ప్రధాని మోదీకి ప్రాంతీయ పార్టీల పట్ల విముఖత ఉందన్న ప్రచారం ఎప్పటి నుంచో ఉంది. అయితే, ఉన్నట్టుండి ప్రాంతీయ పార్టీల అస్తిత్వంపై ఇప్పుడే కత్తి ఝుళిపించడం వెనుక కారణం ఏమిటి? అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో లోక్‌సభ సీట్లను 50శాతం పెంచడంతోపాటు చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుకు అవసరమైన మద్దతును కూడగట్టడంలో మోదీ ప్రభుత్వం విఫలమైంది. రాజకీయంగా మోదీషాలకు ఇది తొలి ఎదురు దెబ్బ. బహుశా ఈ కారణంగా సదరు బిల్లులకు అవసరమైన మద్దతును సొంతంగా సమీకరించుకోవాలని వారిరువురూ నిర్ణయించుకొని ఉంటారు. ఈ నేపథ్యంలోనే 'ఆపరేషన్ ప్రాంతీయ పార్టీలు' ప్రారంభమైంది. ఒకదాని తర్వాత ఒకటిగా ప్రాంతీయ పార్టీలలో చీలికలు మొదలయ్యాయి.

**అందరూ ఆ తాను ముక్కలే...** ఫిరాయింపులను ప్రోత్సహించడం సమర్థనీయమా? అంటే కానే కాదు! అయితే ఈ నేరానికి పాల్పడని ప్రధాన రాజకీయ పార్టీ ఏది? అంటే చెప్పలేని పరిస్థితి. అందుకే కాబోలు ప్రజలు కూడా ఇలాంటి ఫిరాయింపులను సీరియస్‌గా తీసుకోవడం లేదు. అంతమాత్రాన కేంద్రంలోని పెద్దలు చేపట్టిన చర్యలను తప్పు పట్టకుండా ఉండలేము. అయితే, నేటి బాధిత పక్షాలు ఒకనాడు ఇవే ఫిరాయింపులను ప్రోత్సహించిన విషయం మరువకూడదు. తెలుగు రాష్ట్రాలనే తీసుకుందాం. ఉమ్మడి రాష్ట్రంలో రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తెలుగుదేశం, తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీలను మింగేయాలని చూశారు. ఆయన మరణంతో అది ఆగిపోయింది. అంతకుముందు పీవీ నరసింహారావు ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు లోక్‌సభలో అవసరమైన మెజారిటీ కొరవడటంతో ఫిరాయింపులను ప్రోత్సహించారు. తెలుగుదేశం ఎంపీలు కూడా ఫిరాయించేలా చేశారు. యూపీఏ ప్రభుత్వం తొలి టర్మ్‌లో కూడా తెలుగుదేశం ఎంపీలు పార్టీ ఫిరాయించేలా రాజశేఖర రెడ్డి మంత్రాంగం నడిపారు. ఈ కారణంగానే కాంగ్రెస్ అధిష్ఠానం వద్ద ఆయనకు పట్టు పెరిగింది. రాష్ట్ర శాసనసభలో కూడా అప్పటి టీఆర్ఎస్ సభ్యులను కాంగ్రెస్‌లో చేర్చుకున్నారు. దీనిపై కేసీఆర్ అప్పట్లో తీవ్ర ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేశారు. మొత్తానికి నాడు టీడీపీ, టీఆర్ఎస్ బాధిత పక్షాలుగా మిగిలాయి. విచిత్రం ఏమిటంటే, ఈ రెండు పార్టీలూ అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీ ఫిరాయింపులకు దూరంగా ఉండలేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక బీజేపీ మినహా మిగతా పార్టీల శాసన సభ్యులను కబళించారు. శాసనసభలో కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలు టీఆర్ఎస్‌లో విలీనమైనట్లు ప్రకటించారు. రాజ్యసభలో కూడా 2019 తర్వాత తెలుగుదేశం పార్టీ సభ్యులు బీజేపీలో విలీనం అయినట్టు ప్రకటించారు. ఇలా ప్రకటించడం పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని పరిహసించడం కాదా? రాజశేఖరరెడ్డి హయాంలో ఫిరాయింపుల విషయంలో బాధితులుగా ఉన్న కేసీఆర్, చంద్రబాబు 2014 తర్వాత ఫిరాయింపులను ప్రోత్సహించలేదా? అదే కేసీఆర్ ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ తమ సభ్యులను చేర్చుకోవడంపై సుప్రీంకోర్టు వరకు వెళ్లి పోరాటం చేస్తున్నారు. 2019కి ముందు తమ పార్టీ ఎమ్మెల్యేల ఫిరాయింపుపై విమర్శలు సంధించిన జగన్మోహన్‌రెడ్డి కూడా అధికారంలోకి వచ్చిన తర్వాత తెలుగుదేశం నుంచి ఫిరాయింపులను ప్రోత్సహించారు. దేశంలోని మిగతా రాష్ట్రాలలో కూడా ఇంచుమించుగా ఇదే పరిస్థితి! తిలా పాపం తలా పిడికెడు అన్నట్టుగా ఫిరాయింపులను ప్రోత్సహించిన పాపంలో అన్ని పార్టీలకూ అంతో ఇంతో వాటా ఉంది.

# సంపూర్ణ ఆరోగ్య ప్రక్రియ యోగా...

మన రుషులు అందించకినే అద్భుత ఆరోగ్య ప్రక్రియ యోగా. ఆధునిక కాలంలో మనమంతా చేస్తున్న కసరత్తులకు పూర్వమే రుషులు యోగా ద్వారా మన శరీరాన్ని అదుపులో పెట్టుకోవడమెలాగో ఆచరించి చూపారు. వేల ఏళ్లుగా ఈ యోగా అన్నది ఆనాటి దినచర్యలో భాగం. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధించవచ్చని నిరూపితం అయ్యింది. ఇతర వ్యాయామాకంటే భిన్నమైన యోగాభ్యాసము దానిలో నిబిడీకృతంగా ఉన్న ఆద్యాత్మిక భావం కారణంగా దేశవిదేశాలలో విశేషప్రాచుర్యాన్ని సంతరించుకున్నది. ఆరోగ్యమే మహాభాగ్యం అన్న నానుడికి యోగా పరమౌషధం. యోగా చేసేవారిలో ధృఢత్వం, మానసిక ప్రశాంతతను గమనించవచ్చు. ముఖ్యంగా పాశ్చాత్యదేశాల యోగా ప్రాచుర్యము, ఆదరణ అమోఘమైనది. పాశ్చాత్య దేశీయులకు యోగా మీద ఉన్న విశేషమైన మక్కువ, ఆకర్షణ లోక విదితం. బుద్ధ ఆరామలాలో ఇచ్చేశిక్షణలో యోగా కూడా ఒక భాగమే. వారి వేషధారణ క్రమశిక్షణ ప్రపంచ ప్రాముఖ్యత ఆకర్షణ సంతరించుకున్నది. భారతీయ సంప్రదాయిక యోగశిక్షణా తరగతులను అనేక దేశాలలో నిర్వహిస్తున్నారు. ఇతర వ్యాయాయములు శరీరదారుఢ్యాన్ని మాత్రమే మెరుగు పరచడములోదృష్టిని సారిస్తాయి. యోగా భ్యాసము ధ్యానం, ప్రాణాయామం లాంటి పక్రియలు మానసిక ఏకాగ్రత వలన మానసిక ప్రశాంతతను కలిగించి మానసిక ఆరోగ్యానికి కూడా దోహద పడుతుంది. మానసిక వత్తిడులు, హృద్రోగము, రక్తపోటు లాంటి వ్యాధుల తీవ్రత తగ్గించటానికి తోడ్పడుతుందని ప్రయోగాత్మకంగా యోగా నిరూపించింది. సనాతన సంప్రదాయమైన యోగా అధునిక కాలంలో కూడా అనేకమంది అధునికుల అభిమానాన్ని చూరగొన్నది. ప్రధాని మోడీ చొరవతో ఐక్యరాజ్య సమితి జూన్ 21న యోగా దినోత్సవం జరుపుకోవడానికి అంగీకరం చింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా 21న అంతర్జాతీయ యోగా జరుపుకుంటున్నాం. ఇది భారతీయులకు గర్వకారణంగా చెప్పుకోవాలి. జూన్ 21 ఉత్తరార్ధగోళంలో అత్యధిక పగటి సమయం ఉన్న రోజు. ప్రపంచంలోని పలు ప్రాంతాల్లో ఆ రోజుకు ప్రత్యేకత కూడా ఉంటుంది. ఎక్కువ పగటి సమయం ఉన్న రోజుగా గుర్తింపు పొందడంతో అదే రోజును అంతర్జాతీయ యోగా దినోత్సవంగా జరుపుకోవాలని ఐక్యరాజ్యసమితికి ప్రధాని మోదీ సూచించారు. దీంతో అంతర్జాతీయ యోగ దినోత్సవము ప్రతి సంవత్సరం జూన్ 21 న జరుపడానికి నిశ్చయించారు. 2014 సెప్టెంబరు 27న భారత ప్రధాని నరేంద్రమోడి ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం ప్రతి సంవత్సరం జూన్ 21న జరుపుకొనుట గురించి ప్రతిపాదన చేశారు. ఈ తీర్మానానికి 193 ఐరాస ప్రతినిధులలో 175 మంది మద్దతు ఇచ్చారు. భద్రతా కమిషన్‌లో శాశ్వత సభ్యులుగా ఉన్న భారతదేశం, అమెరికా, ఇంగ్లాండ్, చైనా, ఫ్రాన్స్, రష్యా వంటి దేశాలు కూడా ఈ తీర్మానానికి సహ ప్రతినిధులు. విస్తృతమైన చర్చల తరువాత డిసెంబర్ 2014 లో ఆమోదించబడింది. 2015 జూన్ 21 న, మొదటి అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా జరుపుకున్నారు. మన యోగా గురించి వేల ఏళ్ల క్రితం ఆచారంలో ఉన్నట్లు పురాణాలు, ఇతిహాసాల్లో ఉంది. ఈశ్వరుడు తపస్సు చేస్తున్నప్పుడు పద్మాసనంలో ధ్యానయోగంలో ఉన్నట్లు పురాణాలలో వర్ణించబడి ఉంది. లక్ష్మీదేవి ఎప్పుడు పద్మాసినియే, మహా విష్ణువు నిద్రను యోగనిద్రగా వర్ణించబడింది. తాపసులు తమ తపసును పద్మాసనంలోనే చేసినట్లు పురాణ వర్ణన. ఇంకా లెక్కకు మిక్కిలి ఉదాహరణలు హిందూ సంప్రదాయంలో చోటు చేసుకున్నాయి. బుద్ధ సంప్రదాయంలో, జైన సంప్రదాయం లోను, సన్యాస శిక్షణలోను యోగా ప్రధాన పాత్ర పోషిస్తుంది. సింధు నాగరికత కుడ్య చిత్రాల ఆధారంగా యోగా వారి నాగరికతలో భాగంగా విశ్వసిస్తున్నారు. 11 వ శతాబ్దమున ఘూరఖ్ నాద్ శిశ్యుడగు స్వామి స్వాత్వారామ ముని హఠయోగం అను యొగ శాస్త్ర గ్రంథం వ్రాసి యున్నారు. ఇందులో ఆసనములను, ప్రాణాయామ పద్ధతులను, బంధములను, ముద్రలను, క్రియలను సవిస్తారముగ వ్రాసి యున్నారు. అనేక వేల ఆసనములలో 84 ఆసనములను ముఖ్యమైనవిగా చెప్పబడినవి. ముఖ్యముగ ధ్యానమునకు కావలసిన సుఖాసనము, సిద్ధాసనము, అర్ధ పద్మాసనము, పద్మాసనములు ముఖ్యమని చెప్ప బడింది. ఇదె విధముగ పాతంజలి యొగ శాస్త్రమున – స్థిరసుఖ మాసనమ్– అని ఆసనము నకు నిర్వచనము ఉంది. ప్రాణాయామ సాధనలో – సూర్య భేదన, ఉజ్జాయి, శీతలి, సీత్కారి, భస్త్రిక, భ్రామరి, ప్లావని, మూర్ఛ – ఇతి అష్ట కుంభకాని వంటి 8 ప్రాణాయమములు చెప్ప బడెను. జాలంధర బంధము, మూల బంధము, ఉడ్యాన బంధము – ఈ మూడు బంధములు ముఖ్యమని చెప్పబడెను. ముద్రలలో మహాముద్ర, మహాబంధ, మహాభేధ – ముఖ్య మగు ముద్రలుగ చెప్ప బడెను. శరీరమునకు బహిర్ అంతర్ శుచి చాల అవసరముగ ఈ హఠయొగమున ప్రధాన అంశముగ చెప్పబడింది.–ధవుతి, నేతి, వస్తి, నౌలి, త్రటకం, తధా కఫాల భాతి ఏతాని షట్ కర్మాణి – అని వివరణగలదు.. అంటే యోగాలో ఏయే ఆసనం వేస్తే..ఏయే అవయవం బాగా పనిచేస్తుందన్న విషయం దాగివుంది. అందుకే శరీరాన్ని మన అదుపులో ఉంచుకుని శారీరక, మానసిక ప్రశాంతతను పొంతేందుకు చేసే విధానమే యోగ. యోగతో ఆరోగ్యం మన స్వాధీనంలో ఉంటుంది. శ్వాస ప్రక్రియ వలన ఆరోగ్యం స్థిరంగా ఉంటుంది. అలాగే మన జఠరం బాగా పనిచేసి అవయవాలు పనిచేయ డానికి దోహదపడుతుంది. ఇలాంటి యోగను ఏటా అంతర్జాతీయంగా జరుపుకోవాలన్న నిర్ణయం వల్ల ఇప్పుడు ప్రపంచ దేశాల్లో యోగా ప్రాముఖ్యతను గుర్తించారు. మన నిత్య జీవితంలో యోగాను భాగం చేసుకుంటే ఆరోగ్యం మన అదుపులో ఉంటుంది. శరీరం అదుపులో ఉంటుంది. దీనిని ప్రతి ఒక్కరూ భాగం చేసుకుంటే జీవితం సుఖమయంగా సాగగలదు.

# నీట్ అడ్మిట్ కార్డుల్లో లోపాలు

నీట్ రీ–ఎగ్జామ్‌కు సంబంధించి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ జారీ చేసిన అడ్మిట్ కార్డులో లోపాలు బయటపడ్డాయి. మహారాష్ట్రలోని నాగ్‌పుర్‌కు చెందిన ఓ అభ్యర్థికి.. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని అబుధాబీలో పరీక్షా కేంద్రాన్ని కేటాయించడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దీనిపై స్పందించిన ఎన్‌టీఏ.. సమస్యను పరిష్కరిస్తున్నట్లు తెలిపింది పరీక్షకు ఒకరోజు ముందు ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. నీట్ రీటెస్టుకు సమయం దగ్గరపడుతోన్న నేపథ్యంలో అబ్దుల్లా మహ్మద్ తాలిబ్ అనే అభ్యర్థి.. శుక్రవారం సాయంత్రం తన అడ్మిట్ కార్డును డౌన్‌లోడ్ చేసుకున్నాడు. అందులో పరీక్షా కేంద్రాన్ని చూసి అవాక్కయ్యాడు. అబుధాబీలోని ఓ భారతీయ స్కూల్‌లో ఎన్‌టీఏ అతడికి పరీక్షా కేంద్రాన్ని కేటాయించింది. ఈ అడ్మిట్ కార్డుకు సంబంధించిన ఫొటో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. తాము ఇచ్చిన ఆప్షన్లలో అలాంటి కేంద్రం ఏదీ లేదని విద్యార్థి తండ్రి మీడియాతో పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఎన్‌టీఏ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. శనివారం సాయంత్రం 4 గంటల్లోపు కొత్త అడ్మిట్ కార్డు జారీ చేస్తామని తమకు హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. సమయం తక్కువగా ఉన్నందున నాగ్‌పుర్‌నే పరీక్షా కేంద్రంగా కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సంఘటనతో తన కొడుకు తీవ్ర ఆందోళనలో ఉన్నట్లు తెలిపారు. ఈ సమస్యపై ఎన్‌టీఏ కూడా స్పందించింది. సాంకేతిక లోపం వల్ల ఇలా జరిగినట్లు పేర్కొంది. సమస్యను పరిష్కరిస్తున్నామని.. కొన్ని గంటల్లోనే ఆ విద్యార్థికి పరీక్షా కేంద్రాన్ని కేటాయిస్తామని స్పష్టంచేసింది. కాగా.. అడ్మిట్ కార్డులో వ్యక్తిగత వివరాలు, పరీక్ష కేంద్రాలు ఇతర ముఖ్యమైన అంశాల్లో ఏమైనా లోపాలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని ఈసందర్భంగా ఎన్‌టీఏ అభ్యర్థులకు సూచించింది.

# పీర్ల పండుగ సంస్కృతిని కాపాడుకుందాం,

## భారతదేశ ఐక్యతను చాటి చెప్పుదాం :

రోడా మేస్త్రి నగర్ డివిజన్ పరిధిలోని మగ్దుమ్ నగర్ లో ఘనంగా పీర్ల పండుగ ఉత్సవాలను నిర్వహించారు. కాజా మియా ఆధ్వర్యంలో జరిగిన పీర్ల పండుగ ఉత్సవంలో సవారి ఎత్తుకొని ఉత్సవంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు, ఐ ఎన్ టి యు సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాష్ట్రీయ ఓబీసీ జాతీయ అధ్యక్షులు గూడ ఐలయ్య గౌడ్. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశం చాలా గొప్పదని, వివిధ మతాలు కులాలు సంస్కృతి ఉన్న భారతీయులంతా ఒకటే అని చాటి చెప్పి అన్ని పండగలను ఐక్యతతో జరుపుకోవడం భారతదేశ గొప్పతనాన్ని లౌకిక ప్రజాస్వామ్యాన్ని చాటి చెబుతుందని అన్నారు. మన సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజా పాలనలో సర్వ మతాలు సమానంగా పండుగలు జరుపుకుంటూ మన సంస్కృతిని చాటి చెబుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకురాలు మాజీ కౌన్సిలర్ గూడ వరమ్మ, రేవంత్ రెడ్డి యువసేన సాయి ప్రవీణ్ గౌడ్, హాజీ, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com